# శ్రీమదొంటిమిట్ట
# కోదండరామ మాహాత్మ్యము

రచన
ఆంధ్రవాల్మీకి, వాసుదాసు
**శ్రీ వావిలికొలను సుబ్బారావు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**
**2024**

**SRIMADONTIMITTA KODANDARAMA MAHATMYAM**

***by***

**Sri Vavilikolanu Subbarao**

*Editor*

**Dr. Akella Vibhishana Sarma**

Special Officer,

Publications Division

T.T.D. Religious Publications Series No. 1493

© All Rights Reserved

*First Edition : 2024*

*Copies : .*

*Published by*

**Sri J. Syamala Rao,** I.A.S.,

Executive Officer,

Tirumala Tirupati Devasthanams,

Tirupati - 517 507

***D.T.P:***

Publications Division,

T.T.D, Tirupati.

*Printed at :*

**Tirumala Tirupati Devasthanams Press,**

Tirupati - 517 507





# ముందుమాట

ఏకశిలానగరమనే నామాంతరం కలిగిన ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానములకు అనుబంధ ఆలయంగా విరాజిల్లుతున్నది. అక్కడి ఉత్సవాలు, నిత్యపూజలు తి.తి.దే. ఆధ్వర్యవంలో జరుగుతున్నవి. అక్కడ వెలసిన శ్రీ కోదండరామస్వామి ప్రాంగణంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించడం అందరికీ తెలిసిందే.

ఆ క్షేత్రంలో వావిలికొలను సుబ్బారావు గారనే మహాకవి నివసించారు. ఆయన వాల్మీకి రామాయణాన్ని సంస్కృతం నుండి తెలుగునకు అనువాదం చేసి మందరమను పేరుతో వ్యాఖ్యానాన్ని కూడా వ్రాశారు. అట్టి మహాకవి రచించినదే 'శ్రీమదొంటిమిట్ట కోదండరామ మాహాత్మ్యము' అన్న ఈ గ్రంథము.

ఈ గ్రంథంలో ఒంటిమిట్ట కోదండరాముని విభూతులకు సంబంధించిన నాలుగు గాథలు ఉన్నవి. మాలఓబని కథద్వారా భగవంతుని అనుగ్రహానికి భక్తిమాత్రమే కారణంగాని, కులం కారణం కాదని సాక్షాత్తు కోదండరాముడే ప్రకటించినట్లు తెలియజేశారు. ఇమాంబేగ్ కథద్వారా కోదండరాముడు పిలిస్తే పలికేదైవంగా నిరూపణ జరిగింది. అయ్యలరాజు రామభద్రుని కథద్వారా సీతమ్మ మాహాత్మ్యం తెలియజేయబడింది. భక్తకవి, శ్రీమదాంధ్ర భాగవతకర్త బమ్మెర పోతనామాత్యుని కథద్వారా భగవంతుడు భక్తసులభుడని, భగవంతుని అనుగ్రహం నిర్వ్యాజమైనదని తెలియజేయ బడినది.

ఈ నాలుగు కథలు మాత్రమేకాక ఉపయుక్తమైన శాస్త్రవిషయాలను కవిగారు ఇందులో పొందుపరిచారు. వారు స్వయంగా రచించిన పాటలు,

పద్యాలు, స్తోత్రాలు ఆస్తికులైన భక్తజనులకు నిత్యపారాయణయోగ్యంగా ఉన్నాయి.

ఇటువంటి గ్రంథాన్ని పునర్ముద్రించి భక్తులకు అందుబాటులోనికి తేవాలని తి.తి.దే. సంకల్పించింది. ఆ సంకల్పంలో భాగంగా ప్రస్తుత సమాజానికి అర్థమయ్యేరీతిలో గ్రంథసారాన్ని ప్రముఖ శతావధాని శ్రీ ఆముదాల మురళి గారిచే చక్కటి పీఠికరూపంలో వ్రాయించి ఈ గ్రంథంలో జోడించి ముద్రిస్తున్నది.

ఈ గ్రంథానికి ఇంతచక్కటి పీఠికనందించిన శ్రీ ఆముదాల మురళి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

భగవద్భక్తులు, పాఠకులు ఈ గ్రంథాన్ని చదవడం ద్వారా శ్రీమదొంటిమిట్ట కోదండరాముని మాహాత్మ్యాన్ని తెలుసుకొని శ్రీరామచంద్రుని అనుగ్రహానికి పాత్రులు కాగలరని కోరుకుంటూ, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఆకాంక్షిస్తున్నాను.

ఈ గ్రంథాన్ని ముద్రింపజేయడంలో విశేషంగా కృషి చేసిన ప్రచురణల విభాగ ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి అభినందనలు.

సదా శ్రీవారి సేవలో....

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

# శ్రీరామమహిమాను వర్ణనము

ఆంధ్రవాల్మీకి, వాసుదాసుగా సుప్రసిద్ధులైన శ్రీవావిలికొలను సుబ్బారావుగారు ఒంటిమిట్ట కోదండరామస్వామి సాన్నిధ్యంలో సేవచేసి తరించిన భక్తకవి. ఎక్కడ ఏక్షేత్రంలో ఏ స్వామి వెలసినా ఆతనికి సంబంధించిన కథలు, మాహాత్మ్యాలు స్థానికంగా వినబడుతూ ఉంటాయి. ఏదో ఒక పురాణంతో సంబంధించిన కల్పనలు కూడా ఉంటాయి. సుప్రసిద్ధ పౌరాణిక గాథల ఛాయలో కొన్ని ప్రచలితమై ఆకర్షిస్తూ ఉంటాయి. ఒక్కో పర్యాయం అతిలోకమైన విభూతులు కూడా ప్రజల నాల్కలపై నడయాడు- తుంటాయి. వాటి ఆధారంగా కవులు క్షేత్ర మాహాత్మ్య కావ్యాలు వ్రాసి ఆయా తీర్థక్షేత్రాలను జగత్ప్రసిద్ధం చేస్తుంటారు. కాలక్రమంలో వాటికి సాధికారత సంక్రమించి స్థిరమౌతూ ఉంటాయి.

కడప జిల్లా ఒంటిమిట్టలోని కోదండరామాలయం ప్రాచీనమైనది, ప్రసిద్ధమైనది. ఆ రామచంద్రుని మాహాత్మ్యమును చాటు నాలుగు గాథలు ఇందు కూర్చబడినవి. వారిలో మాలయోబడు మినహామిగిలిన ముగ్గురు చారిత్రకవ్యక్తులు. అందులో ఇద్దరు కవులు, మరొకరు అన్యమతస్థులు. భగవంతుని దృష్టిలో, సృష్టిలో కులమతములు లేవు, అవి మానవుని కల్పనలు. ఒకనాటి సామాజిక అవసరాల దృష్ట్యా ఏర్పడిన కూటములకు కులములని పేరుపెట్టి వాటిని వివిధ రాజకీయ అవసరాలకొరకు కొనసాగించుట సామాజిక రుగ్ణత.

శ్రీ వాసుదాసు గారు మాలయోబని చరిత్ర నెపమును నాటి సాంఘికవ్యవస్థను చక్కగా అభివర్ణించారు. విద్యయొక్క గొప్పతనాన్ని, భక్తి యొక్క ఆవశ్యకతను వాసుదాసుగారు తెలియజేశారు. ఓబన్న సంజీవ రాయని కోవెల ముందు భజన చేస్తున్న సందర్భంలో రాగతాళ నిర్దేశముతో

కూడిన కీర్తనలను రచించారు. భజన చేస్తున్న ఓబన్నను తహసీల్దారు తన బంట్రోతులతో మెడబట్టి గెంటించాడు. ఆ సందర్భంలో ఓబన్ననోట దాసుగారు పలికించిన కీర్తన మకుటాయమానమైనది. కాని, మూర్ఖులకు సద్బుద్ధిని ప్రసాదించలేక పోయినది. అప్పటినుండి నిందాస్తుతిలో సాగిన ఓబన్న కీర్తనలు ఆర్తిప్రధానమైనవి. న్యాయమా రామా ననువిడనాడ – అంటూ అర్తిస్తూనే, నీదు బాసయె నీవు తప్పిన నిందరాదటరా?' అని ప్రశ్నించాడు ఓబన్న. పరాకాష్ఠనందిన భక్తిలో ప్రశ్న కూడా అంతర్భాగమై పోతుంది. ఆ ప్రశ్న భగవంతునికా? ఆనాటి సమాజానికా? సార్వకాలికసత్యం చాటి చెప్పడానికి! బ్రాహ్మణ్యము, సాత్వికాహారము, అహింస, వెనుకబడిన వారిచదువు, మతాంతరములకు బోవుకారణములు – ఇత్యాదులు దాసుగారి ఓబని చరిత్రలో చర్చించబడిన అంశాలు. ఓబడు చెరువులో నిలిచి భజన చేయుచుండెను. రాముడు ఓబని వైపు దిరిగెను. భక్తునివైపే భగవంతుడు గాని అధికారుల వైపు అతడేల ఉండును? అర్చకునికి, అధికారికి ఒకేరకమైన స్వప్నం వచ్చింది. అందరూ ఓబని వెతుక్కుంటూ వెళ్లి అతన్ని తీసుకొని వచ్చారు. అతనిపట్ల రామానుగ్రహం అలా ఉన్నది.

భక్తులను అవమానించి గెంటివేస్తే భగవంతునికి ప్రీతి కలుగుతుందా? మానవుడు తాను సృష్టించుకొని కొనసాగిస్తున్న కులమతాలకు రాముడు అతీతుడు. శ్రీరామ పరబ్రహ్మతత్త్వాన్ని బోధించడమే వాసుదాసు గారి ప్రణాళిక. ఇమాంబేగ్ కడప నవాబు. ఒంటిమిట్ట దేవాలయంలోనికి వెళ్లి రామా! అని పిలిచాడు, రాముడు పలికాడు. గురి కుదిరింది. స్వామి సేవకు బావిని త్రవ్వించాడు. ఇది ఎటువంటి భక్తి? కలదు కలండనెడు వాడు కలడోలేడో... అని సందేహించిన భక్తియా? లేక నీ హరి ఈ స్తంభంలో ఉన్నాడా? ఉంటే చూపించు... అని గద్దించిన భక్తియా? ఏదైతేనేం? రాముడు పలికాడు. దానికి ఇమాంబేగ్ బావి నేటికీ సాక్ష్యం.

రామాభ్యుదయం వ్రాసిన కవి అయ్యలరాజు రామభద్రుడు. ఆయన పసివాడుగా ఉన్ననాటి కథ. తల్లిదండ్రులు ఒంటిమిట్ట సీతారాముల ఉత్సవాలకు వెళ్లారు. ఒకరి మీద ఒకరి నెపంతో బిడ్డను వదలి ఇల్లు చేరుకొని, ఆపై బిడ్డకోసం వెదికారు. ఈ సందర్భంలో శ్రీవాసుదాసు గారు సీతారామ తారావళి, సీతాదండకం, శ్రీరామ సుప్రభాతం సంస్కృతశ్లోకాలు, ఉత్పలమాలా పద్యాలలో మేలుకొలుపులు వ్రాశారు. బిడ్డ సీతమ్మ ఒడిలో దొరికాడు. సీతమ్మ చంటివానికి కడుపునిండా పాలిచ్చింది. అందుకే తర్వాత కాలంలో రామాభ్యుదయం వ్రాశాడు. కథ చిన్నదే కాని కథనెపంతో సృజించిన స్తోత్రసాహిత్యం దొడ్డది. నిత్య పారాయణ యోగ్యమైన పద్యాలు, సుప్రభాతం భక్తులకోసం శ్రీదాసు గారు అందించారు. స్వామి మహిమ తెలిసిన వెంటనే స్తుతించడానికి వలసిన స్తోత్రసముదయం కూడా సిద్ధాన్నంలా లభించడం ఈ గ్రంథ పాఠకుల భాగధేయం.

ఇక బమ్మెర పోతనామాత్యుడు. ఈయన ఒంటిమిట్ట వాడని శ్రీదాసు గారు నిర్ణయించారు. ఈ సందర్భంలో శ్రీ జనమంచి శేషాద్రి శర్మ గారి దత్తమండల కవుల చరిత్రను పేర్కొన్నారు. అంతేకాక తాను స్వయంగా చూసిన 'సూక్ష్మతనూ విద్యావిలాసము'ను గూర్చి పేర్కొనడం వారి వాదనకు ఉపబలకం. అది అలా ఉండనిద్దాం! 'శూరుల జన్మంబు సురలజన్మంబును– ఏరుల జన్మంబు నెరుగనగునె' అన్నది భారతం. మనకు రామమహిమే ప్రకృతము. ఈ ఉపాఖ్యానము నందు శ్రీవాసుదాసు గారు జీవేశ్వర తత్త్వాన్ని విశదీకరించారు. చెఱువు – మడుగు దృష్టాంతము సాధకులకు కలిగే అనేక సంశయాలను తీర్చగలదు. 'తేజముగలవాడు జీవుడు, అఖండ జ్ఞానానంద తేజఃపూర్ణుడు భగవంతుడు' అని నిర్ధారించారు శ్రీదాసుగారు.

పోతన చరిత్ర సందర్భంగా విస్తృతమైన ఆధ్యాత్మిక ప్రబోధం శ్రీదాసు గారు చేశారు. మహాత్ముల చరిత్రలో అలివిమాలిన అద్భుతాలుంటాయి.

భాగవతాన్ని తెనిగిస్తున్న ప్రతిఘట్టంలో రాముని మహిమలు ఎలా ప్రకటీకృతమయ్యాయో శ్రీదాసుగారు వివరంగా వ్రాశారు. భాగవతాన్ని అంకితం తీసుకోవాలని సంకల్పించిన ప్రభువు – రామరాజుకు తప్ప మానవరాజుకు అంకిత మీయనని భీష్మించిన కవిప్రభువు – కర్ణాటక రాజు సైన్యాన్ని కకావికలం చేసిన ఆదివరాహ ప్రభువు – భక్తపరాధీనుడైన శ్రీరామ చంద్రుని మహిమ ఊహలకందనిది.

'అలవైకుంఠపురంబులో.... అని వ్రాసి చిరునామామరచిన భక్త కవికోసం సాక్షాత్తు నారాయణుడే దిగివచ్చి ఘంటము చేతబట్టితన చిరునామా వ్రాసి పెట్టిన ఘట్టం రోమాంచమును కలిగిస్తుంది. శ్రీనాథుడు, పోతనల సమాగమం – కవిత్వ ఔచిత్యవిచారం – సిరికింజెప్పదు.... ఇత్యాది పద్యం... దానికి పోతన సమాధానం – హృదయావర్జకం.

ఈ గ్రంథానికి వారు వ్రాసిన పీఠికలో ఒంటిమిట్టను ఏకశిలా నగరమని సంస్కృతీకరణ చేయకుండా ఒంటడు, మిట్టడు అనువారు తపము చేయుట వలన ఆపేరు వచ్చెనని పేర్కొనుట చాలా బాగున్నది. ఒంటి మిట్ట రామాలయ పూర్వపౌరాణిక గాథను పీఠికలో కూర్చుట వలన పాఠకులకు మిక్కిలి ఆసక్తి రేకెత్తు ప్రణాళికతో ఈ రచన సాగినది.

ఈ గ్రంథమును పునర్ముద్రించుట తెలుగు వారి అదృష్టము. ఇందులకు పూనుకొన్న వారికి రామానుగ్రహం కలగాలని ప్రార్థిస్తున్నాను.

**– శతావధాని ఆముదాల మురళి**

# పీఠిక

ఏకశిలానగర క్షేత్రమాహాత్మ్య సంగ్రహము.

మహామునీంద్రులు స్కందుఁగని యిట్లనిరి. కుమారా! నీవు మా యందుఁగల పరమానుగ్రహబుద్ధి క్షేత్ర తీర్థమాహాత్మ్యంబుల వచించితివి. వీనులారా వింటిమి. ధన్యులమై మంటిమి. కాని యొక సందేహంబు బాధించుచున్నది. పరబ్రహ్మము వాచ్యుఁడు. ప్రణవము వాచకము. వాచ్యవాచకముల కభేదము గదా. ఈ యర్థమును బోధించు క్షేత్రము గాని, తీర్థము గాని లోకంబునఁగలదా? ముల్లోకంబుల నీ వెఱుంగని రహస్యంబులు లేవు. మాకీ సందియంబుఁ దీర్చి కృతార్థులఁ జేయుమని వేఁడ షణ్ముఖుఁ డిట్లనియె.

మునీంద్రులారా! యిట్టి ప్రశ్న మీరు గాక మఱి యెవ్వరడుగఁ గలరు? ఇది పరమ రహస్యవిషయము. అయినను నే రహస్యమైన నెఱుఁగ మీరు పాత్రులరు. జ్ఞానభక్తివైరాగ్యనిష్ఠులు. పవిత్రచరిత్రులు. కావున నెఱింగించెద. శ్రద్ధాళువులై వినుఁడు.

ప్రణవార్థమును బోధించు దేవతామూర్తులఁగాని, యట్టి మూర్తులు గల క్షేత్రము గాని, యట్టి తీర్థముగాని భూమండలంబున నెందైనగలదా యని యడిగితిరి. ఇట్టి క్షేత్రము దైవతము తీర్థమొక్క చోటనే కలదు. అది యిప్పుడు లోకంబున నేకశిలానగరమని వ్యవహరింపఁబడు చున్నది. ఇది దండకారణ్యంబున శ్రీశైలమున కాగ్నేయ ప్రదేశంబునఁ గృష్ణాకావేరుల నడుమ శ్రీవేంకటేశ్వరాలయంబునకు వాయవ్య దిశను గలదు. అవ ధాతువు వలనఁ బుట్టిన యేకాక్షరము ప్రణవము సంసార తారకంబగును గదా. తారకము రామనామమే కదా. రామప్రణవముల కభేదము. అట్టులే

రామబ్రహ్మములకు నభేదము. రామవర్ణములు బ్రహ్మ శబ్దమునందే కలవు గదా. కావుననే 'రామపదేనాసౌ పరబ్రహ్మాభిధీయతే" యని తత్త్వజ్ఞులు వచించిరి. ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ యన్నట్టులు ఓంకార మొక యక్షర మయ్యును నందు అ+ఉ+మ యను మూఁడక్షరములు గలవు కదా.

అట్టులే సూక్ష్మ చిదచిద్విశిష్టుఁడైన ఈశ్వరుఁడొక్కఁడే యని చెప్పబడుఁ చున్నాఁడు. ఆస్తంబబ్రహ్మపర్యంతము గల బ్రహ్మాండమునఁ బ్రతిపరమాణువు ప్రకృతి-జీవాత్మ-పరమాత్మలను మూఁడు తత్త్వములు గలదై యున్నది. ఈ తత్త్వార్థమునే శ్రీమన్నారాయణుఁడు సీతాలక్ష్మణసహితుఁడై యరణ్య సంచారము చేయునపుడును, శ్రీకృష్ణుఁడై భారత రణవేళ నర్జుననకుఁ దత్త్వోపదేశంబు సేయుసమయంబున, రథంబు నందును బోధించెను.

**శ్లో॥ అకారే ణోచ్యతే విష్ణు । స్సర్వలోకైక నాయకః**
**ఉకారే ణోచ్యతే లక్ష్మీ । ర్మకారో జీవవాచక**

యనునట్లు అకారము విష్ణువును దెలుపును. ఉకారము ప్రకృతి కధిష్ఠానదేవత యగు లక్ష్మిని దెలుపును. మకారము జీవునిఁ దెలుపును. అట్టులే రామశబ్దమునందు రకారము విష్ణువును, అకారము లక్ష్మియగు సీతాదేవిని, మకారము దాసుఁడైన జీవుని లక్ష్మణుని దెలుపును. అహం దాస్య ముపాగతయని లక్ష్మణుఁడే చెప్పెనుగదా! కావునఁ బ్రణవరామ శబ్దములకు విష్ణు లక్ష్మీ జీవులకు, రామసీతాలక్ష్మణులకు నభేదంబని యెఱుఁగుఁడు. *

ఏకశిలానగరంబున వెలసిన శ్రీసీతారామలక్ష్మణులును వారు కల్పించిన తీర్థంబులు నీ యర్థంబునే బోధించుచున్నవని చెప్పిన విని మునీశ్వరు లిట్లనిరి.

---

* ఈ విషయము విపులముగ శ్రీరామనామ మాహాత్మ్యంబునఁ గననగు.

సర్వజ్ఞకుమారా! యిట్టి చరిత్రంబును నీ వెన్నఁ డింతకు మున్ను వినిపించినవాఁడవు కావు. మేము విన్నవారమును గాము. ఇంకను వినఁ గుతూహలంబు గలదు. వినిపింపుము. మఱియు నేకశిలానగరంబు నుత్పత్తియు శ్రీసీతారామలక్ష్మణులు సంచరించిన కారణంబును శ్రీసీతారామ లక్ష్మణ తీర్థోత్పత్తియు నిచ్చటఁ గృతార్థులైన మహాత్ముల చరిత్రంబులును మఱియు నేవేని విశేషంబు లున్నవనియు నెఱిఁగింపుమా యని ప్రార్థింప గుహుఁ డిట్లనియె.

మునీంద్రులారా! వినుండు. తొల్లి దేవత లుబుసుపోకకై వాయువునకు నాదిశేషునకుఁ గలహంబు గల్పించి వారిని బోరఁ జేసి వారిలో బలవంతు లెవ్వరో తెలియఁగోరి వాయుదేవతం గని యిట్లనిరి. వాయూ! నీవే ప్రత్యక్ష బ్రహ్మవు. మహాబలుఁడని లోకమునఁ బ్రవాదము కలిగినది. కారణమేమో! ఎవరో యీ విషయము శేషునితో నన వాయు వననెంత. ఉహ్వానినఁ బోఁ డా! వానికొక యూరా నిలుకడతావా. ఎప్పటికిఁ జంచలుఁడే యనెనఁట. నీవు మాలో నొకండవు. మా యందఱకన్న బలిష్ఠుండవు. నీ కవమానము వచ్చిన మాకు వచ్చినట్లె కదా. ఆ నిమిత్తమున నీ చెవుల నిది వేయవలసి వచ్చె ననిన మారుతుండిట్లనియె.

తుట్టెపురుగుమాటల కేమిలెండు. అవి మీరు విశ్వసింపఁ దగు నవికావు. ఆ పురుగునకుఁ గూడ నేనే కదా ప్రాణమైయున్నాఁడను. వక్ర చరిత్రులమాట లట్లుగాక మఱియెట్టు లుండును. పోనిండు. దానికేమి యనిన వారు మేలుమేలు లెస్స చెప్పితివని పోయి యాదిశేషుంగని యిట్లనిరి.

అనంతమూర్తీ! నీ మహిమం బద్భుతంబు. భూమండల మంతయుఁ గందుకమువోలె నొకపడగయంద ధరించెదవు. ఇట్టి యద్భుతశక్తి గల వారెవ్వరు లేమిని జేసి కదా బ్రహ్మ యా భారంబు నీపై వైచె. ఇట్టి నిన్ను వాయుదేవుఁడు తుట్టెపురుగని వక్రచరిత్రుఁ డని, తన వలననే నీవు

జీవించుచున్నాఁడ వని మాతోడ ననియె. నీ కంటె వాయుదేవుండెట్లు మహాబలుఁడయ్యె ననిన శేషుఁ డిట్లనియె.

దివిజులారా! వెల్లుల్లి యెన్నాళ్ళు పచ్చకప్పురముతో పాటుగ నుంచినను దాని సహజవాసన పోఁజాలదు. అట్టులే యాదితేయు లైన మీతో నెంత కలిసియున్నను దైతేయుఁడు దైతేయుఁడుగానే యుండును గాని యాదితేయుఁ డగునా? అందు జంచలులు సత్య మెట్లెఱుఁగఁ గలరు? పేరున కేమి లెండు. మహాబలుఁడనుకొన వచ్చును. నేతిబీరకాయలు లేవా? ఊరక చేయి విసరిన నంత దవ్వు పోవుచుండువాఁడు మహాబలుఁడో మహా బలుఁడో మీరే యెఱుంగుదు రనిన నమ్మాటలు వారు వాయువుతోఁజెప్పిరి.

దేవతలిట్లు వారిరువురకుఁ గలహము పెంచిరి. మాటలు వాకాటులై తుదకుఁ బోరాటమునకు దిగెను. నేను నా వేయిపడగల మేరు పర్వతము వేయిశిఖరంబులఁ జుట్టి పట్టుకొనెదను. వానిలో నొకటైన వాయు వెగజిమ్మెనేని నాకంటె బలీయుఁడని యంగీకరించెద నని శేషుఁడనెను. ఆ మాటలు సురలు వాయువునకుఁ జెప్పిరి. వాయువు నంగీకరించెను. శేషుఁడు తన సహస్రఫణంబుల మేరుశిఖర సహస్రంబుఁ జుట్టి పట్టుకొనెను. మహాభీమవేగంబున సప్తమరుత్తు లొక్కటై వచ్చిరి. కాని యొక్క శిఖరంబు నైనఁ గదలింపఁ జాలరైరి. వాయువు పట్టినపట్టు విడువక భీషణరోషంబున రాత్రులనక పగళ్ళనక సంధ్యలనక వీచుచుండె. శేషుండునుఁబట్టువిడువక యుండె. వాయువేగంబునకు లోకము చీకాకుపడియె.

వృక్షంబు లన్నియు నాకాశంబున సంచరింపదొడంగె. సూర్య చంద్రమసులు త్రోవలు దప్పిరి. గ్రామనగరంబులు పాడయ్యె. లోకంబున హాహాకారంబులు ప్రబలె. ఆ యిరువుర పోరాటంబున లోకంబునకైన హా వడింగని దేవతలు వారిని శాంతిపఱుపఁ జూచిరి. కాని యిరువురు నంగీకరింపరైరి. అప్పుడు దేవతలెట్లెటొ శేషుని శాంతునిఁ జేసి లోకంబునకుఁ

గలిగిన యుపద్రవము దెలిపి నీవే బలిష్ఠుఁడవని మాకు స్పష్టపడియె. వృథాపోరేల? నీ వొకపడగ వదులుము. దానిఁ గొనిపోయి వాయువు సంతోషించును గాక యని చెప్ప లోకరక్షాతత్పరుండైన యాదిశేషుం డట్ల కావించె.

అంత వాయువా శిఖరంబు నెగఁజిమ్ము కొనిపోయె. ఆ పోయెడి శిఖరంబునుండి యేకశిల మున్ను నేఁ జెప్పినచోట దండకాటవియందుఁ బడియె. అది మొదలది యేకశిల యని చెప్పఁబడెడి. ఆవల నందు నగరంబు నిర్మాణమగుటచే నేకశిలానగరంబని ఖ్యాతి వహించె. దాని కనతి దూరంబున మృకండాది మహర్షులాశ్రమంబులు గల్పించుకొని యున్నారు.

జనకుని సత్యసంధునిఁ జేయుటకై శ్రీరామచంద్రమూర్తి భార్య యగు సీతాదేవితోడను దమ్ముఁడగు లక్ష్మణునితోడను దండకారణ్యమున ఋష్యాశ్రమంబుల సంచరించుచు నీ మునీశ్వరుల దర్శింప నిం దరు దెంచెను. ఆ మువ్వుర పాదపరాగముచేఁ బవిత్రితమైన దేశ మియ్యది. ఆ ఋషీశ్వరుల దర్శింప మువ్వురు నరుదెంచునెడ నిప్పుడు శ్రీరామతీర్థం బని ఖ్యాతమైన స్థలమునొద్దకు వచ్చినపుడు మండువేసంగిని దీక్ష్ణకర తీవ్రతరకర తాపముచే సీతాదేవి డప్పిగొని రాముంగని నాథా! యీ ప్రాంతమున దప్పిగొన్న పశువుల పక్షుల గతి యేమి? యనెను. పరేంగితజ్ఞుఁ డైన శ్రీరాముఁ డామాటలచే నామె దప్పిగొని యుంట నెఱింగి నలువంకలఁ బాఱఁజూచెఁ గాని యెందును జలమున్నజాడ గానరాదయ్యె. అప్పుడు విల్లుగొని బాణంబు సంధించి యాకర్ణాంతంబు లాగి భూమిపై వైచిన నది భూమిని భేదించి పాతాళంబుఁ జొచ్చి మరలఁ దూణీరంబుఁ జేరె. ఆ బాణమార్గరంధ్రంబునఁ బాతాళగంగ చిమ్మనఁ గ్రోవిఁ జిమ్మినట్లు పై కెగసె. అందు సీతారాములు దప్పి యార్చికొనిరి. లక్ష్మణుఁడును వాని పజ్జనట్ల కావించె. అప్పుడు సీతాదేవి మీ యిరువుర పేర రెండుతీర్థంబు లేర్పడియె నన సీత యభిప్రాయం బెఱింగి నీకును దీర్థంబు గల్పించెద నని మఱియొండు

బాణంబు సంధింప సీతాదేవి యాయన కేలుపట్టుకొని వలదు వలదు భూదేవి నా మాతగదా? నా నిమిత్తముగఁ గూడ మీరామెను భేదింప వలయునా? స్త్రీలపైఁ గత్తి దూయ మీకుఁ జిన్నప్పుడే నేర్పిన దోషము మీ గురువులవారిది. ఆయన విశ్వామిత్రుఁడు కదా యనిన శ్రీరామచంద్రుఁడు నవ్వుచు నూరకుండె.

అంత సీతాదేవి భూదేవిం గని కేలుమోడ్చి జననీ లోకపావన యగు నాకాశగంగ నీ గర్భంబునంద కలదుగదా! దాని నిందుఁ బ్రసరింపఁ జేసి భూతధాత్రి యనుపేరు సార్థకంబు చేసికొమ్మని నేలను గోరఁ గీఱి ప్రార్థించు చుండ రామలక్ష్మణులు వెఱగుపడి చూచుచుండఁ బాతాళగంగ యామె గీఁచిన స్థలంబు నంద వెలికివచ్చె. అప్పుడు లక్ష్మణుఁ డన్నను జూచి యన్నా మనము గోరనగు పనికి గొడ్డలియెత్తితిమి. స్త్రీలు పేర నబలలే కాని సామర్థ్యంబునఁ గారు. మన మానప్రాణంబులు గూడ నీమె వశంబున నున్నవి. అనిన సీతాదేవి సెలవుల నవ్వి యూరకుండె. ఆ ప్రాంతములనున్న యన్ని దినంబులు వారు ముప్వురందే స్నానపానంబులు గావించుచు ప్రక్క నున్న శృంగి శైలంబుపైఁ బరుండుచుండిరి.

అది యెఱిఁగి ఋషీశ్వరులును బత్నుల తోడ నందే స్నానంబు గావించి యా తీర్థంబునే పానంబుగావించి విగతపాపులగుచుండిరి.

అంత ఋషిపత్నులు సీతాదేవింగని యమ్మా! నీవు లోకజనని వగు శ్రీమహాలక్ష్మివి. దుశ్శీలురై స్త్రీల శీలంబుఁ జెఱుచు పాపాత్ముల శిక్షింపను, పతివ్రతల శీలంబు రక్షింపను నయోనిజవై పుట్టితివి. ఇట్టి నీ జ్ఞాపకార్థంబు లోక పాపనాశార్థం బీ తీర్థంబు శాశ్వతంబుగ నుండను, నిందు శ్రద్ధాభక్తి యుతలై యహరహంబరుణోదయ కాలంబున యథావిధి నిన్ను నీ పతిని స్మరించుచు స్నానంబు చేయు స్త్రీలకు భర్తృవియోగ క్లేశంబు లేకుండను బానంబు చేయువారి కాయురారోగ్యాభివృద్ధి యథా యోగ్యంబగు సంతానాభి

వృద్ధి దాంపత్య సుఖంబు నగు నట్లును వర మిమ్మనిన నట్ల కానిండని యామె యనుగ్రహించె.

అట్టులే యమ్మునీశ్వరులు వేఁడ శ్రీరామచంద్రుఁ డి ట్లానతిచ్చె.

పాతాళభూమ్యాకాశగంగా త్రయసంగమంబయిన యీ తీర్థ త్రయంబు. తాపత్రయహరంబు. జగత్త్రయపావనంబు. త్రిమూర్తి ప్రీతికరంబు. త్రిదివేశ్వర సేవితంబు. సప్తపూరుషతారకంబు. ఈ జలంబులఁగాని యీ తీర్థ తీరంబులఁ గాని చేయు స్నానదానజపతపోవ్రతంబులు శతగుణితంబు లగు. ప్రత్యహం బిందుఁగ్రుంకి యీ తీరంబున మదీయ షట్సప్తాష్టాక్షర మంత్రంబులుగాని, షడక్షరాష్టాక్షర ద్వాదశాక్షరమంత్రంబులు గాని యేకాక్షర మంత్రంబు గాని యేకపాదస్థుఁడై తదేకనిష్ఠ నష్ట సహస్రకంబు జపించువారికి మత్సాయుజ్యము ప్రాప్తించు. అష్టోత్తర శతప్రణవ మంత్రంబునఁ గాని షోడశాష్టాక్షర మంత్రంబునఁ గాని మంత్రించి యీనీరంబు దినదినంబు ద్రావు నరుఁడు మరల జననీ స్తన్యంబుఁ గ్రోలఁడు.

ఈ తీర్థత్రయంబు మూర్తీభవించిన ప్రణవంబు. కావుననే రూప మందును ఓమ్‌కారమును బోలియున్నది. ఓమ్‌కారమందలి యూర్ధ్వ వలయము మదీయతీర్థంబు. దానికి దక్షిణమున నెడమ వైపు వలయాకారంబు సీతాతీర్థంబు. దానికిఁ దూర్పువలయంబు లక్ష్మణతీర్థంబు. ఒక్క యక్షరంబున మూఁడక్షరములవలె నొక తీర్థంబున మూఁడు తీర్థంబు లున్నవి.

అని వరం బిచ్చిన నందఱు సంతోషించిరి. నాఁడు మొదలు నేటిదనుక ఋషీశ్వరులందుఁ గ్రుంకి పోవుచుందురు. నాగకన్యకలు దేవకన్యక లిందుఁ గ్రీడించుచుందురు.

మఱియు నా ఋషులిట్లు శ్రీరాముఁ బ్రార్థించిరి. మహానుభావా! యిచ్చట రాక్షసబాధ మాకు సహింపరాకున్నది. నీవు మాకు వరదుఁడవు కమ్ము. నీవిందే నిలిచితివేని మేము నిర్విఘ్నముగఁ దపస్సులు గావించుచు సర్వదానజపతపోనుష్ఠానాదులకు ఫలంబైన భవద్దివ్యమంగళ విగ్రహంబు దర్శించుచు జన్మంబు సఫలంబు చేసికొందుము. భక్తపరాధీనా! శరణాగత వత్సలా! మేమర్థులము. దీనులము. అనన్యగతికులము. నీ చరణంబులె మాకు శరణంబులు. నిన్ను స్మరింపని నిమేషంబులు మాకు మరణంబులు. దయాసింధూ! ఆపద్బాంధవా! నీ విందె నిలుమని పెక్కు తెఱంగులఁ బ్రార్థించు నమ్మునీంద్రులఁ గని కృపార్ద్రీభూతచిత్తుఁడైన యా దేవసత్తముఁ డిట్లనియె.

మహానుభావులారా! నేనిందు నిలువరాదు. నేను జేయ వలసిన కార్యము చాల నున్నది. అయినను మీ శరణాగతి వ్యర్థము కారాదు. పితృవాక్యరూపప్రతిబంధ మడ్డుపడుటచే భరతుని శరణాగతి వెంటనే సార్థకము కాదయ్యె. అట్టులే యిప్పుడునై యున్నది. అయినను మీ కోరిక రిత్తపుచ్చనొల్ల, మా ప్రతినిధి రూపంబుల మీ కనుగ్రహించెదము. అదియే మీకు భుక్తి ముక్తిదాయకంబు లగు, సర్వభయనివారకంబు నగు. హేమాద్రి శిఖర గళితంబైన యొందుశిల యందుఁ గలదు గదా. దానిఁ గనుఁడొండు. మీ కోరిక నెఱవేఱు ననిన, వారును వల్లెయని యచట కేగి చూడ నా యేకశిలయే శ్రీసీతారామలక్ష్మణ మూర్తుల వహించి కానవచ్చె. మునులు ముక్తి కాంక్షులగుట సీతాదేవి వామపార్శ్వంబున నిలిచె. రామస్య దక్షిణో బాహు వన్నట్టు లక్ష్మణుఁడు కుడివంక నిలచె. ఐశ్వర్యమాత్ర కాముకుల ననుగ్రహించునపుడు సీతాదేవి కుడి ప్రక్క నిలుచు. మోక్షార్థులకు వామే భూమిసుతాయన్నట్టు లెడమ వైపు సీత కానవచ్చు. అయినను,

**శ్లో॥ శరీరారోగ్య మర్థంచ, భోగాన్ శ్చైవానుషంగికాన్**
**దదాతి ధ్యాయినాం నిత్య మపవర్గప్రదో హరిః**

యన్నట్లు శ్రీ సీతారామలక్ష్మణులు భుక్తిముక్తులు రెండు నొసంగు చుందురు. ఆ చిత్రంబు గని యా తపస్వు లబ్బురపడి యానాఁడు మొదలు యథావిధి యమ్మూర్తిత్రయంబును షోడశోపచారంబుల దినదినము ముప్పూటఁ బూజింపసాగిరి. ఆహా శ్రీరాముల కరుణా విశేషము! సోదరుఁ డైన భరతునకుఁ బాదుక లొసంగి మునులకుఁ దన మూర్తినే యనుగ్రహించె.

ఆవలఁ గొన్ని వత్సరములకు నంగదుండు హనుమజ్జాంబవదాది వానరులఁ గూడి సీతను వెదకుచు వచ్చునపు డొకరాత్రి వారెల్ల నిందు విశ్రమించిరి. ఆ రాత్రి స్వప్నమున జాంబవంతుఁడు సీతావిశిష్టులైన రామచంద్రుల దర్శించి విస్మయపడి లేచి వానరుల లేపి తన కలవిధం బుపన్యసించి శ్రీరామలక్ష్మణు లెక్కడ? సీతాదేవి యెక్కడ? మన మెక్కడ? వారు మువ్వురిందు నాకు సాక్షాత్కరించు టెట్లని కొంతవడి యాలోచించి యుదయమున నందుండు మునీంద్రులఁ బ్రశ్నించె. వారును నమ్మూర్తులఁ జూపిరి. రాత్రి తాను గలయందుఁ గన్నమూర్తులవియే యగుటచే రోమాంచ కంచుకిత గాత్రుఁడై నేత్రముల హర్షాశ్రువులు జలజలరాలఁ బునఃపునః సాష్టాంగ నమస్కారంబులు గావించి తక్కిన వానరులు తోడ్పడ నొక్క చిన్నమండపంబు నిర్మించి యావల సీతను వెదకుచుఁ జనియె.

శూద్రతపస్వి యగు శంబుకు నన్వేషించు సమయంబున శ్రీరాముఁ డు లక్ష్మణసమేతుఁడై యిచ్చటికి వచ్చియుండి మునిగణ ప్రార్థితుఁడై రాక్షస భీతిని వారింప నాంజనేయుల నిచట నిలిపి చనియె. ఆయనయు రావణ ప్రతినిధులగు నెనమండ్రుగురు రాక్షసుల వధించె.

శ్రీరాములు వైకుంఠమున కేగుతఱి నిత్యము స్వదర్శన లాభం బపేక్షించిన హనుమ తల్లబ్ధపరుఁడై సంజీవరాయఁ డను పేర నింద ప్రసన్న మూర్తియై వెలసె.

సవతుల పోరు గృహకలహములకు రోసి శివుఁడు భార్యాపుత్ర భృత్యగణాదుల విడిచి వైరాగ్యంబు వహించి యేకతంబున శ్రీరాము

సేవింపవచ్చి యిందు నిలిచె. ఈయనయే యొంటిమిట్ట రామలింగఁడు. మార్కండేయుఁడు శివలింగపూజ గావించి మృత్యువును జయించి చిరాయువై వెలసిన దిచ్చోటనే. నిష్కారణముగఁ బరీక్షిత్తును శపించి యా పాపంబు పోవ శృంగిమహర్షి రామతీర్థంబున నుండు కొండపైఁ దపంబు గావించి పాపముక్తుండయ్యె. ఆ కారణంబున నది శృంగి శైలమనఁ బ్రసిద్ధ మయ్యె. ఇందే శ్రీసీతారామలక్ష్మణులు మూఁడు రాత్రులు నిదురించిరి. అప్పుడు వారికి నీ యాత్రమస్థులు దీపంబు నుంచి వారిచే వరంబందిన కారణంబున నిందెవ్వరేని దీపంబుల వెలిఁగించి యీ శైలమును బ్రదక్షిణించి రేని వారి కజ్ఞానంబు దొలంగి సుజ్ఞానంబు చెలంగి సర్వపాపముక్తులగుదురు. అందుఁ గార్తీకమాసంబునను, నమావాస్యలయందును జేయు దీపోత్సవము సప్తజన్మపాపకర్మముల నశింపఁజేయు. ఇది లఘుప్రదక్షిణంబు, శృంగి శైలంబును రామాలయంబును బాఱువేఁట పర్వతంబును గ్రామంబును జుట్టివచ్చిన మహాప్రదక్షిణంబగు.

కలియుగాదిమ కాలంబున వసుమంతుఁ డనురాజు వేఁట నిమిత్తమై కతిపయసేనాపరివృతుఁడై యీ ప్రాంతభూములఁ దిరిగి యలసి దప్పిగొని యెందును నీరు గానక యశ్వమాత్ర ద్వితీయుఁడై శృంగి శిఖరాగ్రగతులైన యిరువుర ఋషులం గాంచి వారలఁ జేరఁ బిలిచి యిట్లనియె.

ఓరీ మీరెవరు? ఈ యరణ్యంబున నుండు వారేని నొక్క జలాశయం బున్నఁ జూపుఁడు. దప్పిచే మిగుల బాధ పడుచున్నాను. నాలుక యెండినది. నోటఁ దడిలేదు అని యడిగిన వా రా రాజును దోడ్కొనిపోయి శ్రీరామ తీర్థంబును జూపిరి. ఆ రా జమృతకల్పములైన యా నీరు త్రావి సేదదేఱి యశ్వమును ద్రావఁజేసి పుణ్యాత్ములారా! మీ యుపకారమునఁ జేసి పునర్లబ్ధజీవితుఁడనైతిని. నా సేనయు నీరువట్టుచే నెంత శ్రమించు చున్నదో ఇంతకుఁ బెద్దమడుఁ గున్న జూపుఁడు. నా సేనయంతయుఁ గడుపారఁ ద్రావును గాక యనిన వారలిట్లనిరి.

'రాజేంద్రా! నీవు సందేహింపవలదు. నీ సేనగాదు. పామరులు మమ్మొంటఁడని మిట్టఁడనిఁ యిక్కడనుండు గుట్టను బట్టి వ్యవహరింతురు. నీ సేనకుఁ బదియంత లెక్కుడు సేన వచ్చినను భయములేదు. అందఱు తనియఁ ద్రావినను నీటికిఁ గొఱఁత లేదు' అని చెప్పిరి. అట్టులే యా సేన యంతయు గరి తురగ భటాదులెల్లఁ ద్రావినను నీరు కొఱవడక యుండె. అప్పుడా నృపాలుఁడు సంతుష్టుఁడై మీరెవరు? నా వలనఁ గాఁదగిన యుపకారమున్నఁ గోరుఁడు. ప్రత్యుపకారకాంక్ష తీవర పెట్టుచున్న దనిన వారిట్లనిరి. రాజోత్తమా! మేమా నిషాదులము. నా పేరు రామానాయఁడు. వీఁడు నా తమ్ముఁడు లచ్చానాయఁడు. ఈ యొంటిమిట్టయం దుండు వారము. ఒకరి వలన మాకుఁ గావలసిన యుపకారమేదియు లేదు. అయినను నీవు చేయుట నిజమేని లోకోపకారమైన కార్యము చెప్పెదము. దానివలన నీవునుఁ దరింతువు. లోకులునుఁ దరింతురు. మా వెంట రమ్మని తోడ్కొని జాంబవన్నిర్మితమై యిప్పుడు శిథిలమై గుహవలె నుండు చోటికిఁ బోయి యందలి స్వయంవ్యక్తంబుల సీతారామలక్ష్మణుల విగ్రహంబులఁ జూపి యీ జగన్మోహనమూర్తులకు నాలయంబుఁ గట్టింపుము. నీకుఁ గావలసిన ధనంబును గలదని యొక నిక్షేపముఁ జూపి యంద తత్క్షణము వారిరువు రదృశ్యులైరి. రాజు విస్మయపడి తనకు దర్శనమిచ్చి యాదేశించిన వారు రామలక్ష్మణులే యని విశ్వసించి వారి నుద్దేశించి నమస్కరించి యొక భవనంబు నిర్మాణంబు గావించె నని మఱియు ననేక విషయంబులు బోధించె.

ఎన్ని వేల సంవత్సరములనాఁడో యీ రాజు గట్టించిన దేవాలయమే యిప్పుడు సీతారామలక్ష్మణు లుండు గర్భగృహము. దీని ద్వారంబున ద్వారపాలకులు గాననగు. కొన్ని శతాబ్దముల కావల దానికి ముంగలనుండు భవనము నిర్మింపఁ బడినది. దానికిఁ గొన్ని శతాబ్దముల కీవల నాస్థాన మంటపము లోనైనవి నిర్మింపఁబడినవి. ఈ దేవాలయము చరిత్రలయందు జెప్పఁబడిన

విషయములఁబట్టి తత్పూర్వ మెవరి వశముననుండెనో కాని యావలఁ జోళరాజులవశముననుు, నవలఁ గర్ణాటప్రభువుల పాలనమందు నుండెను. తళ్ళికోట యుద్ధమునందుఁ గర్ణాట ప్రభుత్వము చెడిన పిమ్మట మట్లి ప్రభువుల స్వాధీనమందుండెను. దేవాలయమున గోపురము నొద్దఁ గానవచ్చు శాసనములో యుద్ధమునకు 10-15 సంవత్సరములకు ముందు స్థాపింపఁ బడెను. ఇది నిస్సంశయముగ దివ్యక్షేత్రము. మహామహిమ గలది. చెన్నపురి తెంగలకోమట్లిది యాళ్వారుల పాడెల్లో లేదని వారి పాషండత్వమును జాటించుకొందురు గాక. అహోబల దర్శనార్థమై పోవునపుడు విశిష్టాద్వైత సిద్ధాంత స్థాపనాచార్యులయిన శ్రీభగవాన్ రామానుజాచార్యులవారును, శ్రీకృష్ణావతార మూర్తులయిన కృష్ణచైతన్యులును నీ స్వాముల దర్శనమునకై వచ్చినవారే. బలరామకృష్ణాదులు నిచ్చటికి వచ్చినవారే. అట్టి వారి పాదధూళిచేఁ బవిత్రమైనది యీ గ్రామము. బదరీనారాయణ క్షేత్రము మొదలు దక్షిణమున సేతువు పర్యంతము దివ్య క్షేత్రముల దర్శించితినిగాని "యత్రైకాగ్రతా తత్రావిశేషాత్" అను బ్రహ్మసూత్రమునకును,

**శ్లో॥ సాకాశీతి న చాకశీతి భువి సా యోధ్యేతి నాధ్యాస్యతే**
**నావంతీతి నకిల్బిషా దవతి సా కాంచీతి నోదంచతి**
**ధత్తేసామధురాపి నోత్తమధురాం నాన్యాపి మాన్యాభువి**
**యా వైకుంఠకథా సుధారసభుజాం రో చేత నో చేతసే**

యను కవితార్కికసింహ వేదాంతదేశిక వాక్యమునకు లక్ష్యభూతమైన దిది యొక్కటేయై యున్నది. ఏ పూర్వపుణ్య విశేషంబుననో నాకీ శ్రీసీతారామ లక్ష్మణ సేవ లభించె. పూర్వ పుణ్యంబునఁగాక యిట్టి ఫలము లభింపదు. శ్రీరామకరుణాకటాక్షమున క్షేత్రమాహాత్మ్యమంతయు నాంధ్రంబున వెలువడి నపుడు లోకు లీ విషయంబు సమగ్రంబుగ నెఱుఁగఁ గలరు.

**– వాసుదాసుఁడు**

# పంచరత్నములు

## ప్రాతఃకాల స్మరణీయ శ్లోకములు

ప్రాతఃస్మరామి రఘునాథ ముఖారవిందం
మందస్మితం మధురభాషి విశాలఫాలమ్
కర్ణావలంబి చలకుండల గండభాగం
కర్ణాంత దీర్ఘ నయనం నయనాభిరామమ్ 1

ప్రాతర్భజామి రఘునాథ కరారవిందం
రక్షోగణాయ భయదం వరదం నిజేభ్యో
యద్రాజ సంసది విభిద్య మహేశచాపం
సీతాకర గ్రహణమంగళ మాప సద్యః 2

ప్రాతర్నమామి రఘునాథ పదారవిందం
పద్మాంకుశాది శుభచిహ్న సుఖావహంచ
యోగీంద్ర మానసమధువ్రత సేవ్యమానం
శాపాపహం సది గౌతమ ధర్మ పత్న్యాః 3

ప్రాతర్వదామి వచసా రఘునాథనామం
వాగ్దోషహారి సకలం కలుషం నిహంతమ్
యత్పార్వతీ స్వపతినా సహభోక్తుకామా
ప్రీత్యా సహస్రహరినామ సమం జజాప. 4

ప్రాతశ్శ్రయే శ్రుతినుతాం రఘునాథమూర్తిం
నీలాంబుదోత్పల సితేతర రత్ననీలామ్
ఆముక్త మౌక్తిక విశేషవిభూషణాఢ్యాం
ధ్యేయాం సమస్తమునిభిర్నిజ భృత్యముఖ్యైః 5

యశ్శ్లోక పంచకమిదం నియతః పఠేత్
నిత్యం ప్రభాతసమయే పురుషః ప్రబుద్ధః
శ్రీరామ కింకరజనేషు స ఏవముఖ్యో
భూత్వా ప్రయాతి హరిలోక మనన్యలభ్యమ్. 6

## మంగళ శ్లోకములు

మునిమానస హంసాయ మారసుందర మూర్తయే
సితాబ్జ పత్రనేత్రాయ సీతారామాయ మంగళమ్.
రామరామ దయాసింధో రావణారే జగత్పతే
త్వత్పాద కమలాసక్తిర్భవే జ్జన్మనిజన్మని.
రామో మత్కుల దైవతం సకరుణం రామం భజే సాదరం
రామేణాఖిల ఘోరపాప నిహతో రామాయ తస్మై నమః
రామాన్నాస్తి జగత్త్ర యైక సులభో రామస్య దాసోస్మ్యహం
రామే ప్రీతిరతీవమే కులగురో శ్రీరామరక్షస్వమామ్.
కంజాత పత్రాయత లోచనాయ
కర్ణావతంసోజ్జ్వల కుండలాయ
కారుణ్య పాత్రాయ సువంశజాయ
నమోస్తు రామాయ సలక్ష్మణాయ

విద్యున్నిభాంభోదసువిగ్రహాయ
విద్యాధరైస్సంస్తుత సద్గుణాయ
వీరావతారాయ విరోధిహంత్రే
నమోస్తు రామాయ సలక్ష్మణాయ
సంసక్త దివ్యాయుధ కార్ముకాయ
సముద్రగర్వాపహరాయుధాయ
సుగ్రీవమిత్రాయ సురారిహంత్రే
నమోస్తు రామాయ సలక్ష్మణాయ

పీతాంబరాలంకృత మధ్యకాయ
పితామహేంద్రామర వందితాయ
పిత్రే స్వభక్తస్య జనస్య మాత్రే
నమోస్తు రామాయ సలక్ష్మణాయ

నమో నమస్తేఖిల పూజితాయ
నమోనమశ్చంద్ర నిభాననాయ
నమోనమస్తే రఘువంశజాయ
నమోస్తు రామాయ సలక్ష్మణాయ

ఇమాని పంచరత్నాని త్రిసంధ్యం యః పఠేన్నరః
సర్వపాప వినిర్ముక్తః సయాతి పరమాంగతిమ్.

జగతి విశదమంత్రం జానకీ ప్రాణమంత్రం
విబుధ వినుత మంత్రం విశ్వవిఖ్యాతమంత్రమ్
దశరథ సుత మంత్రం దైత్యసంహార మంత్రమ్
రఘుపతి నిజమంత్రం రామరామేతి మంత్రమ్

బ్రహ్మాదియోగ మునిపూజిత సిద్ధమంత్రం
దారిద్ర్యదుఃఖ భవరోగ వినాశమంత్రమ్.
సంసార సాగర సముత్తరణైక మంత్రం
వందే మహాభయహరం రఘురామమంత్రమ్

నిత్యం శ్రీరామ మంత్రం నిరుపమ మధికం నీతి సుజ్ఞాన మంత్రం,
సత్యం శ్రీరామ మంత్రం సదమల హృదయే సర్వదారోగ్యమంత్రమ్
స్తుత్యం శ్రీరామ మంత్రం సులలిత సుమనస్సౌఖ్య సౌభాగ్య మంత్రం
పఠ్యః శ్రీరామ మంత్రం పవనజ వరదం పాతుమాం రామమంత్రమ్
జానాతి రామ తవనామరుచిం మహేశో
జానాతి గౌతమ సతీచరణ ప్రభావమ్.
జానాతి దోర్బల పరాక్రమ మీశచాపో
జనాత్యమోఘ పటుబాణ గతిం పయోధిః

రామం శ్యామాభిరామం రవిశశి నయనం కోటి సూర్యప్రకాశం
దివ్యందివ్యాస్త్రపాణిం శరహృతశరధిం చారుకోదండ హస్తమ్
కాలంకాలాగ్ని రుద్రం రిపుకుల దహనం విఘ్న విచ్ఛేదదక్షం
భీమం భీమాట్టహాసం సకల భయహరం రామచంద్రం భజేఽహమ్.

మాతారామో మత్పితా రామచంద్రో
భ్రాతారామో మత్సఖా రాఘవేశః
సర్వస్వం మే రామచంద్రో దయాళుః
నాన్యం దైవం నైవజానే నజానే

జననీ జానకీ సాక్షాత్ జనో రఘునందనః
లక్ష్మణో మిత్ర మస్మాకం, కోవిచారః కుతోభయమ్.
జనకో రామచంద్రో మే, జననీ జనకాత్మజా

హనుమ త్ప్రముఖాస్సర్వే
హరయో మమ బాంధవాః

శ్రీరామచంద్ర కరుణాకర దీనబంధో
సీతాసమేత భరతాగ్రజ రాఘవేశ
పాపార్తి భంజన భయాతుర దీనబంధో
పాపాంబుధౌ పతితముద్ధర మామనాథమ్.

వదతు వదతు వాణీ రామరామేతి నిత్యం
జపతు జపతు చిత్తం రామపాదారవిందమ్
నమతు నమతు దేహం సంతతం రామచంద్రం
నభవతు మమ పాపం జన్మజన్మాంత రేషు.

* * *

# శ్రీరామగీతములు

| | | | |
|---|---|---|---|
| కమలలోచనౌ | – | కాంచనాంబరౌ | |
| కవచభూషణౌ | – | కార్ముకాన్వితౌ | |
| కలుషసంహరౌ | – | కామితప్రదౌ | |
| రహసినౌమితౌ | – | రామలక్ష్మణౌ | 1 |
| పవనజానుగౌ | – | పాదచారిణౌ | |
| పటుశిలీముఖౌ | – | పావనాంఘ్రిణౌ | |
| పరమసాత్త్వికౌ | – | భక్తవత్సలౌ | |
| రహసినౌమితౌ | – | రామలక్ష్మణౌ | 2 |
| వనవిహారిణౌ | – | వల్కలాంబరౌ | |
| వనఫలాశనౌ | – | వాసవార్చితౌ | |
| వరగుణాకరౌ | – | వానరాశ్రితౌ | |
| రహసినౌమితౌ | – | రామలక్ష్మణౌ | 3 |
| మకరకుండలౌ | – | మౌనిసేవితౌ | |
| మణికిరీటినౌ | – | మంజుభాషణౌ | |
| మనుకులేశ్వరౌ | – | మానుషోత్తమౌ | |
| రహసినౌమితౌ | – | రామలక్ష్మణౌ | 4 |
| సవనరక్షణౌ | – | సత్యసంగరౌ | |
| సమరభీషణౌ | – | సాహసాన్వితౌ | |
| సదయమానసౌ | – | సర్వపూజితౌ | |
| రహసినౌమితౌ | – | రామలక్ష్మణౌ | 5 |

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | మాలయోబని చరిత్రము | 1 |
| 2. | ఇమాంబేగ్ చరిత్రము | 49 |
| 3. | అయ్యలరాజు రామభద్రుఁడు | 52 |
| 4. | బమ్మెరపోతనామాత్యుఁడు | 69 |



# శ్రీమదొంటిమిట్ట కోదండరామ మాహాత్మ్యము
# ఒంటిమిట్ట మాలయోబనిచరిత్రము

శ్రీసీతారామలక్ష్మణ భవనమైన యొంటిమిట్ట యిప్పు డల్పగ్రామముగఁ గానవచ్చుచున్నను గొన్ని సంవత్సరములకు ముందు పెద్ద నగరముగానే యుండెను. కొన్ని నిదర్శనముల వలన నీ నగరము నిడివి యుత్తర దక్షిణముగఁ గొలిచిన రమారమి మైలునకు మించియే యుండెనని యేర్పడుచున్నది. కోట శిథిలమై పోవఁ గోటలోని నేలమళ్లైపోయెను. కోటలోని మళ్ళు యిప్పటికిని గోటమళ్ళని వ్యవహరింపఁబడుచున్నవి. శిథిలములై నేల చదరములై పోవ మిగిలిన బురుజు నేఁటికిని నొండుగా గానవచ్చుచున్నది. దేశభ్రష్టుఁడై యీ ప్రాంతముల సంచారము చేసిన యోరుగంటి ప్రతాపరుద్రున కీ యేకశిలానగరము కొన్నినాళ్ళు శరణమయ్యెను. కాలము దురతి క్రమము. ఓడల బండ్లును, బండ్ల నోడలును బోవుట గలుగును. కలిమి లేములు కావడికుండలు. మునుపటి హస్తినాపుర మేదీ? ఇసుక దిబ్బయైయున్నది. మునుపటి యయోధ్యయేదీ? పాటలీపుత్రమేదీ? ఇట్టులే కాలచక్రభ్రమణంబున నున్నతదశ యందుండినవి యధమ స్థితికి వచ్చును. అధమస్థితి యందుండినవి మహోన్నత దశకు వచ్చును. మొదటి దానికి మన భరతఖండమే దృష్టాంతము. రెండవదానికి నింగ్లాండు మొదలైన పాశ్చాత్య దేశములే నిదర్శనములు.

ఒక దేశము చెడుటకు బాగుపడుటకు నా దేశప్రజలే కారణభూతులు. ఒక వంశము తామరతంపరై యభ్యుదయము నొందుటకు నిర్మూలమగుటకు నా వంశమువారే హేతువగుదురు. అట్టులే యొక కుటుంబము కీడొందుటకు మేలొందుటకు నా కుటుంబము నందలివారే నిదానము.

దైవభక్తి, శీలము, సదాచారము, భూతదయ, పరోపకార బుద్ధి యెందుండునో యా దేశ, మా వంశ, మా కుటుంబము బాగుపడును. ఇవి యెందులేవో యవి వృద్ధి గాంచవు. వీనికి విరుద్ధగుణము లెందుఁ గానవచ్చునో యని శీఘ్రకాలమందే నిర్మూలము లగును. మన దేశము క్షీణదశకు వచ్చుట కిదే కారణము. ఒంటిమిట్ట చెడుటకు నిదే కారణము.

దైవభక్తి, శీలము సదాచారము లోనగు సద్గుణములు కల వారియెడ భగవంతుఁడు ప్రీతుఁడగును. ఆ కారణమున వారు ప్రాయికముగ మఱు జన్మంబున శ్రీమంతులై జనింతురు. విరాగము, దృఢమైన దైవభక్తి లేనివారికి నైశ్వర్య మనర్థకము. బాల్యముననే యైశ్వర్యవంతులగుటచే నే కారణమునఁ దమ కాయైశ్వర్యము కలిగెనో యెఱుఁగ లేక యైశ్వర్యజనితములైన మదా హంకారలోభాది గుణములపాలై పరాపకారపరులై, దురాచారులై, దయా శూన్యులై దుష్టసాంగత్యమున వర్తించి లోకపీడ గావించి యాపాపంబున నాగర్భ శ్రీమంతులు చెడుదురు. మన మిట్లు చెడినవారమే. చెడుచున్న వారమే.

హిందువుల కాత్మవిద్య పెట్టనికోట. పాశ్చాత్యులో యనాత్మ విద్యాపారీణులు. తళుకుబెళుకుల వగలుగులుకు వారవనితవంటిది యనాత్మ విద్య. శీలవతి యైన పతివ్రతవంటిది యాత్మవిద్య. వేశ్యల సొగసులకు మోహించి వారితో నైకమత్యము గలిగి తిరుగు పురుషులు చెడునట్లే పాశ్చాత్య సాంగత్యమున మనము చెడితిమి. పరభాష, పరవేషము, పరాహారము, పరాచారము మనము మాన్యములని స్వీకరించితిమిగాని యవి మన దేశమునకు మన దేహమునకు మన నీతి మతాచారములకు నను గుణములా

విగుణములా యని యాలోచించు శక్తిగాని, మనవాని యౌత్కృష్ట్యము నెఱుఁగ నభిలాష గాని లేనివారమై

**ద్వి. తగ స్వనుష్ఠిత పరధర్మంబు కంటె**
**విగుణ మైనను మేలు స్వీయధర్మంబు**
**మరణమైనను స్వధర్మంబున మేలు**
**పరధర్మ మెప్పుడు భయకారణంబు. ద్విపద భగవద్గీత**

**శ్లో॥ శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్।**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మోభయావహః॥**

అను శ్రీకృష్ణులవారి హితోపదేశమును బెడచెవిఁ జెక్కితిమి. ఇట్టివా రెట్టిదశయం దుండవలయునో యట్టి దశయందే యున్నారము. ఒంటిమిట్ట యందుఁ బూర్వము చతుర్వేద వేదులైన బ్రాహ్మణులు, నుదారులైన భూదారులు, దానగుణ వశ్యులైన వైశ్యులు, గుణభద్రులైన శూద్రులు బంగారు కండ్లగు రెడ్లు మహాకవులు నుండిరి.

వేళ కాఁకలిగొని వచ్చిన యతిథుల నభ్యాగతుల నాదరింపని బ్రాహ్మణులు, దేహియన నాస్తియను క్షత్రియులు, బేరసారంబుల నమ్మినవారి నశ్యుల జేయు వైశ్యులు, సద్గుణ దరిద్రులగు శూద్రులు, సడిమసిబుడ్లగు రెడ్లు, జాతి నీతి లేక స్వైరలై చరించు నించుబోఁడులు, నా గ్రామంబున మందునకైన లేకుండిరి.

ప్రతిరాత్రము చతుర్థయామంబున బ్రాహ్మముహూర్తంబున విప్ర కుమారుల స్వాధ్యాయ ఘోషంబును, భక్తుల భజన గానంబును, గోవుల నంభారవంబును, గోదోహననినదంబును, దధిమథన ఘుంఘుమా రావంబును, వైణికీజనుల వీణారవంబును, శ్రవణ పర్వంబుగ దిగంతంబుల మాఱు మ్రోగు చుండెను. అర్థాశచేఁ గాని కామాశచేఁగాని యకార్యంబులఁ జేయు వారా పురంబునఁ గాఁపురంబు సేయువారిలో లేకుండిరి.

శ్రీరామాలయంబున నర్చకుఁడు పూజారిగాక త్రిసంధ్యంబు లందును యథావిధి నర్చనలఁ గావించుచుండె. ఇది దివ్యక్షేత్రం బయియుండిన కారణంబున స్వామికేగాక దేశాంతరవాసులై స్వామిదర్శనార్థమై వచ్చిన వారికెల్ల స్వామిప్రసాదం బవారిగ లభించుచుండె. అర్చకులు పాచకులు స్వామికై భక్తు లిచ్చినదంతయుఁ దళియ చేసి వినియోగపఱచుచుండిరి. ప్రసాదవినియోగ సమయమునందు మాత్రమేగాక వేదపారాయణ బ్రాహ్మణులు తక్కిన సేవకులు నర్చావేళలందు ముప్పూఁట స్వామి దర్శనార్థము వచ్చుచుండిరి. దినమున కొక్కసారియైన స్వామి దర్శనము చేయని యాఁడుది గాడిదగను, నరుఁడు వానరుఁడుగను భావింపఁబడుచుండిరి. అన్ని యుత్సవములు వేళకుఁ దప్పక చక్కఁగ జరుగుచుండెను. విచారణలోపము పాపమని ధర్మకర్తలు ప్రత్యుత్సవము సమక్షమందుండి జరుపుచుండిరి. ఈ కారణంబున నా గ్రామమందు బంగారు వాసన గొట్టుచుండెను. అఱువది సంవత్సరముల క్రిందటివఱకు నిచ్చుకోళ్ళ నాణెములకు మాఱు బంగారు తునకల నిచ్చుచుండిరి. పండని పొలము, నెండిన పైరు, నిండని చెఱువు నా పొలిమేరలోన గానరాకుండెను. అదనున వానరాకయుఁ బదునున నేఱువాకయుఁ దప్పకుండెను.

గ్రామ మిట్టి యభ్యున్నతదశ నుండు సమయంబున నూఱు వత్సరములనాఁ డీ యొంటిమిట్టకు జేరిన మాలవాడ యందుఁ బంచముల కుటుంబ మొక్కటి యుండె. ధర్మవ్యాధుని వలెఁ గులవృత్తి దుష్టమైనను మానరాదను ధర్మమెఱిఁగిన వారగుటచే గులవృత్తిమానక, ధర్మంబు వీడక యా దంపతులు దేవబ్రాహ్మణ భక్తిగలవారై యుండిరి. ఎట్టి కులమందుఁ బుట్టినను, నెట్టి పాపాత్ములనైనను భక్తిగలవారిని భగవంతుఁడు రక్షించునని పెద్దలు చెప్పఁగా విన్నవారగుటచేత భగవంతుఁడు తమ్ము రక్షించునని దృఢవిశ్వాసము గలవారై రామకృష్ణ నరసింహ యనునామంబులే యుచ్చరించు చుండిరి. పరుండుటకు ముందు రామా నీవేగతి యనుచు స్వామి పాదంబులఁ

దమ శిరస్సులుంచి నట్లెంచి పండుకొనుచుండిరి. శ్రీసీతారామలక్ష్మణులను పేర మూఁడు శిలలు గృహమున నొకమూల నెత్తుప్రదేశంబున నుంచిరి. ఆ యిల్లా లా స్వాములముందఱ బ్రతిదిన ముదయమున నావుపేఁడతో నలికి ముగ్గులు పెట్టును. మాలఁడును దాను భుజించుటకు ముందు దానూర్ధ్వపుండ్రము ధరించి ముంతెఁడు నీళ్ళు ఱాలపైఁ బోసి తిరుమణి శ్రీచూర్ణము దిద్ది దొరికిన పూలా శిలలపై నుంచి సాఁగిలఁబడి నమస్కారములు గావించి లేచి చేసిన యన్నమో సంకటో యారగింపు పెట్టి పిదపఁ దాను భుజించు చుండెను. రాత్రులందును, దెల్లవాఱుజామునను రామకీర్తనలను బాడుచుండెను. అతని యిల్లాలును నతని కన్నివిధములఁ దోడుపడు చుండెను. సద్వృత్తి యందుండు భర్తకు ననుగుణవతియగు సతి యతని పూర్వజన్మ సుకృతంబున గాని లభింపదు. కులవృత్తిచే లభించిన దానివలన జీవించుచు, ననుకూలదాంపత్యంబున సుఖించుచుఁ బరలోకసుఖ మాశించి ధర్మంబున వర్తించుచుఁ దత్ప్రసాదసిద్ధికై భగవంతు భజించుచు వారు సుఖముండిరి.

చెకుముకిఱాతికి నినుపతునుకకు నగ్ని పుట్టినట్లా దంపతుల కొక కుమారుఁడు కలిగెను. ఆ బాలునికి వా రోబఁడని పేరు పెట్టిరి. నాగరికతా వ్యాధిచే బాధపడుచుఁ దాము కన్నబిడ్డలకుఁ దాము కడుపారఁ బాలిచ్చు భాగ్యములేక పోఁతపాలుపోసి రోగములపాలుచేసి దుర్బలాంగులజేయు నిప్పటి మిటారుల వలెఁగాక యా మాలత తన కుమారునకుఁ దానే పాలిచ్చి పెంచుచుండెను. ఆ కారణమున నా శిశు వవయవసౌష్ఠవము కలిగి నీ కాలమున మనలోఁ బటముల యందు మాత్రము గానవచ్చు బిడ్డలవలెఁ జూడ వేడుక కలిగించు చుండెను. నేలయు విత్తనము రెండును మంచివై నపుడు చెట్టు మాత్ర మేల మంచిది కాకుండును?

తల్లికిఁ గాలుసేతు లాడకుండునట్లు పోరు పెట్టుకొన్న సమయమం దామె యెన్నివిధముల నాడించినను లాలించినను బాలుడు బోరు

మానెడువాఁడు కాఁడు. కాని దేవుని మీఁది కీర్తనలు పాడెనేని కటుక్కున నోరు మూసుకొని చెవి యిచ్చి విను చుండెడి వాడు. శిశువునకుఁ దల్లి గర్భము మొదటి పాఠశాల. ఉయ్యాల రెండవ పాఠశాల. ఇప్పుడా శిశువు మనస్సున నాటిన విత్తనమే వెనుక వృక్షమై ఫలించును. నడుమ నెన్ని విద్యలు నేర్చినను నవి యా చెట్టును బ్రాఁకియుండును గాని దానిని మించి పోఁజాలవు. ఇప్పటి విద్య ననుసరించియే తరువాత విద్యయు నుండెనా త్రవ్వి యెఱువు పెట్టినట్లగును. వేఱు విద్య యయ్యెనా రెండికిఁ బొంతనములు చెల్లక రెండును వృద్ధికి రావు. దేవుని కీర్తనలు పాడిన యెడల నేడుపు చాలించి శిశువు వినుచుండుట తెలిసికొని యా తల్లి దేవుని కీర్తనలే పాడి శిశువును సమాధానపఱుచు చుండెను. శిశువును దన తల్లి దేవుని కీర్తనలు పాడినఁ జెవి యిచ్చి వినుచు సంతోషంబునఁ గేకలు వేయుచు నాడుకొను చుండును. పాటలు చాలించెనా యేడుపు ప్రారంభించును. ఆ కారణమున నా మాలెత యెల్లవేళ దేవుని కీర్తనలే పాడవలసి వచ్చెను. ఇట్లు తల్లికిఁ గొడుకే గురువాయెను. ఆట బ్రాయంబు నను మూఁడు శిలలనో మూఁడు మంటిముద్దలనో పెట్టి యమ్మా జేజె యని యెంతో సంతోషముతోఁ జప్పట్లు తట్టుచుఁ గేకలు వేయుచుఁ జుట్టు తిరుగుచుఁ దల్లి పాడెడి పాటలను వచ్చి రాని ముద్దుమాటలను దాను బాడుచు నమ్మను బాడమనుచు బాడకున్న నేడ్చుచుఁ బాడిన సంతోషించుచు నుండెనుగాని మఱి యే యాటలకుఁ బోవువాఁడు కాఁడు. ఇవి యేమని యెవరైన నడిగిన నిది లాముఁడు. ఇది లచ్చనుఁడు. ఇది సీత యనుచుండెను.

తరువాతఁ గొంచె మీడు వచ్చి యేదైనఁ బని చేయునపుడును మాల దాసరులో మఱియెవరో దేవునిపాటలు పాడినను దేవుని ముచ్చటలాడినను జేతిపనియైన విడిచి యచ్చటికిఁ బరువెత్తి పోవును. ఇట్లుండ నొంటిమిట్టలో నొకబ్రాహ్మణుడు దేవాలయము నొద్ద రాత్రులందు రామాయణము చదివి

చెప్పుట కారంభించెను. ఊరిలోని స్త్రీలు పురుషు లనేకులు వచ్చి వినుచుండిరి. ఈ వార్త యెట్టులో యీ యోబఁడు విని రాత్రులం దచ్చటికిఁ బోసాగెను. పసివాఁడవు చీఁకటిఁలో బోవలదని తండ్రి వారించినను నిలుచువాఁడు కాఁడు. వివేకముగలవాఁ డగుటచేఁ బిల్లవాఁడు మంచిపని చేయునపుడేల వారింపవలయునని తలఁచి తండ్రియుఁ గొడుకు తోఁడబోయి రామాయణము వినుచుండెను. ఆ పురాణము వినవచ్చినవారిలోఁ గొందఱు త్రాగుబోతుల వలెఁ దూఁగితూఁగి ప్రక్కవారిపైఁ బడుచుండిరి. కొందఱు దయ్యము పట్టినవారివలె ముందునకు వెనుకకు నూఁగు చుండిరి. కొందఱు తదేకధ్యాన తత్పరులయి వినుచున్నట్లు కన్నులు మూసికొని నిద్దురపోవుచున్నారని యితరులు తలంతురేమోయని కాలివ్రేళ్ళు కదలించుచు నడుమ నడుమఁ గన్నులు విచ్చి చూచుచుండిరి. మఱుజన్మమున మేమిట్లు పుట్టుదుమని చెప్పినట్లు కొందఱు పూడుపాములవలె నేలఁ బరుండి గుఱకలతో నిద్రించిరి. కొంద ఱెప్పుడెప్పుడు ప్రసాదము వినియోగమగునాయని యెదురు చూచుచుఁ బ్రొద్దెంత యైనదని నడుమ నడుమ నడుగుచుండిరి.

ఇంద ఱిన్ని పోకలఁ బోవుచుండినను మన యోబఁడు మాత్రము దూరమునఁ గూర్చుండి కనురెప్ప పెట్టక పౌరాణికునిఁ గనుచుఁ గథ వినుచుండెను. సీతారామలక్ష్మణులు కష్టము లనుభవించినారని వచ్చిన పట్టులనెల్ల వానికిఁ గన్నీరు ధారలై కాఱుచుండెను. ఒక్కొక్కసారి రావణాసురుని జంపెదనని లేచి పరువెత్తఁ బోవఁ దండ్రి చేయిపట్టి లాఁగఁ గూర్చుండును. విసరుటచేఁ జిన్న మిణుఁగురు పెద్దమంట యయినట్లు శ్రీరామాయణము వినుటచే నోబనికి భక్తి యతిశయించెను.

రుక్మిణి : అప్పా! యోబనికిఁ జదువువచ్చునా?

తండ్రి : రాదు.

రుక్మిణి : చూచితివా! నిమ్నజాతులవారికి మన బ్రాహ్మణులు చదువు నేర్పక యణఁగఁ ద్రొక్కియున్నారు. చదువులేమిని జ్ఞానము లేదు. చదువు లేమిని ధనము లేదు. కాఁబట్టికదా **వీరు అన్యమతాలపాలయి పోవుచున్నారు.**

తండ్రి : మేలు మేలు. అర్థము లేని పత్రికా భాషాపదములు నాలోచన లేనివారి వాదమును జక్కగ నేర్చితివి. నిమ్న జాతుల వారనఁగా నెవరు? పంచములు – చెంచులు – ఏనాదులు – ఎఱుకలు లోనగువారని నీ భావమా? అట్లైన వీరిని నెవరణఁగఁ ద్రొక్కిరి? అణఁగఁ ద్రొక్కక ముందెట్లుండిరి? చదివిన వారందఱు జ్ఞానులా? చదువనివారందఱు జ్ఞానహీనులా? జ్ఞానమనగా నేమి? వీరిని నణఁగఁ ద్రొక్కుటచే బ్రాహ్మణులకు వచ్చిన మేలేమి? వారికూటికి వీరడ్డము పోయిరా? పంచములు లోనగువారు కులభ్రష్టులు – మతభ్రష్టులగుటకు దారిద్ర్యము కారణము. త్రివర్ణముల వారిలో భ్రష్టులగుటకు స్త్రీలు కారణము. ఎర నాశించి చేఁపలు గాలమునకు దగులుకొన్నట్లు కామినీ కాంచనముల కాశించి మనవారిలో బుద్ధి మాలినవారు చెడుచున్నారు. కండపొగరునఁ జెడిన కామదాసుల మాట యటుండనీ. మాలమాదిగలు చెంచులు నెఱుకలేనాదులు లోనగువారు దరిద్రులెట్లయిరి? పూర్వము స్వదేశ ప్రభువులు రాజులుగ నున్నప్పు డడవుల విచారణయంతయు వీరి స్వాధీనమందుండెను. అడవులవలన వచ్చు నాదాయము వీరనుభవించుచు రాజునకు లోఁబడి యతనికిఁ బన్ను గట్టుచుఁ గావలసి నప్పుడు సేనల సమకూర్చి యిచ్చుచుండిరి. ఇట్టి సేనకే యాటవిక సేన యని పేరు. బాటసారులకు చోరభయము లేకుండ వీరే యడవులందు వారిని గాపాడుచుండిరి. వీ రడవులలోఁ బుట్టు పండ్లు లోనగు పదార్థముల నమ్మి జీవించుచుండిరి. ఇప్పు డడవులనెల్లఁ బ్రభుత్వమువారు స్వాధీన పఱచుకొని వ్యాపారమంతయు వారే చేయుచు నడవులందుఁ దమ సేవకులు దప్ప నితరు లెవ్వ రనుజ్ఞ పొందక సంచారము చేయరాదని యాజ్ఞ పెట్టుటచే నీ జాతులవారందఱుఁ గూడి పేదలై యడవులలో నిలువ నీడలేక పల్లెలపాలై

క్రమయ కార్యములు చేసి జీవింప సాహసింప వలసి వచ్చెను. చచ్చిన మృగముల నన్నిటిని బంచములే తీసికొనిపోయి చక్కఁబఱిచి చెప్పులు బొక్కెనలు లోనైనవి కుట్టి ప్రజలకిచ్చి జీవించుచుండిరి. ఇప్పుడీ దేశము తోళ్ళన్నియుఁ బరదేశములకుఁ బోయి యచ్చట సిద్ధము చేయఁబడి మరల నిచ్చటికి వచ్చుచున్నవి. ఒకటికిఁ బదంతలు వెలలు పెట్టి మనమే వానిని గొనుచున్నాము. పొరుగింటి పుల్లగూర రుచి. ఎముకల రాసులను బాశ్చాత్యులే చక్కెర శుద్ధము చేయుటకుఁ గొనుచున్నారు. నీవు నిమ్నజాతు లని చెప్పిన వా రీ విధముగ దరిద్రులైరి. దీనిలో బ్రాహ్మణులు చేసిన దోష మేమి గలదు?

చదువు లేకున్న జ్ఞానము లేదనుట సరిగాదు. కొంచెము గఁజదివిన స్త్రీలు పత్రములలోఁ జేవ్రాలు చేసి తమ నెత్తిపై దామే ఱాలు వేసికొనుచున్నారు. జ్ఞానము వచ్చునట్లు చదువు వలయుననినఁ బెక్కేండ్లు చదువవలయును. ఈ కాలములోఁ బెద్దబెద్ద పరీక్షలం దారి తేఱినవారుకూడ జ్ఞానహీనులై విచారశూన్యులై యుండుట మనము చూచుచున్నాము కదా. చదువు రాని స్త్రీపురుషు లనేకు లెంతో తెలివి జ్ఞానము కలవారై యుండలేదా. కష్టము చేసి జీవింప వలసినవారు వేలకొలఁది వెచ్చపఱిచి 10–15 సంవత్సరముల పాఠశాలలందుఁ జదివి వన్నెవిసనకఱ్ఱలవలెఁ జలువ వస్త్రములు ధరించి రాజధానులఁ దిరుగుచుండిన జీవనోపాయమెట్లు? ఇట్టి బాధ లనేకము లుండుట యాలోచించియే మన పెద్దలు పఠనము వలన జ్ఞానము సంపాదింప ననుకూలము లేనివారికి శ్రవణము (వినుట) వలన జ్ఞానము వ్యాపింపఁ జేయు సులభము ప్రయోజనవంతమునగు మార్గము లేర్పఱిచిరి. రాత్రు లందుఁ బౌరాణికులు పురాణములఁ జదివి యర్థము విశేషార్థము చెప్పిన ననేకులు వచ్చి వినుచుందురు. పగటి కార్యములకు హాని లేదు. రాత్రులందు నిద్రించుటకు ముందు గొంచెము దీనికై యుపయోగించి పుణ్యకథలు విని బాగుపడిన వా రనేకులు గలరు. మన యోబఁడే కాక ద్రావిడుఁడైన నందనా

రిట్లు బాగుపడినవాఁడే. మఱి యెందరో కలరు. మా మేనత్తలకు మా తండ్రి రామాయణము భారతము చదివి చెప్పుచుండఁగా బాల్యమున నేను వినుటచేతనే నాకు జ్ఞాన లేశ మంకురించెను. తరువాత దానిని గ్రమక్రమముగ వృద్ధి చేసికొంటిని. నాకుఁ దెలిసినది మీకుఁ జెప్పుచున్నాను. మీకుఁ దెలివి తేటలుండిన దీనిపై మీరెంతో వృద్ధి చేసికొనవచ్చును. నా వలన విని నేర్చుకొన్న విషయములు మీరెన్ని యేండ్లు జదివినఁ దెలిసికొనఁ గలిగి యుందురు? ఇట్టివి పాఠశాలలు గావా? నెలకు నూర్లు వేలు జీతములు దీసికొని కళాశాలలయం దుపన్యాసము లిచ్చు పండితులకు వీరికి భేదమేమి? హరికథలు చెప్పు భాగవతు లిట్టివారు గారా? చదివి పది సంవత్సరములలో సంపాదించు జ్ఞానము విని పదినెలలలో సంపాదింపవచ్చును. అఱువది సంవత్సరములుగా నేను జదివి విని యాలోచించి తెలిసికొన్న విషయములను నాఱునెలలలోఁ గానే మీరు నా వలన విని నేర్చుకొంటిరిగదా. అఱువది సంవత్సరములనాఁడు నాకున్న జ్ఞానము మీ రిఱువది సంవత్సరములనాటికే సంపాదించి నప్పుడా వల మీఱెంత జ్ఞానము సంపాదింపరాదు? అప్పుడు మీ రితరుల కిట్లే చెప్పిన నప్పటి బాలురెంత వివేకవంతులగుదురు. మీరును జదువు వచ్చినవారి లెక్కలోఁ జేరినవారే కదా. చదివి మీ రెంత జ్ఞానము సంపాదించిరి. దినమునకు గంట గంటన్నర విని నా వలన నెంత నేర్చుకొంటిరి? అస్పృశ్యత విషయమై నేను వ్రాసినది చదువుఁడు.

ఇఁక జీవనమార్గమందో తండ్రి వృత్తియే కొడుకు దగుటచేతఁ దండ్రియే గురువు. ఈ గురువు కూలికిఁ జెప్పువాఁడు కాఁడు. బాలుఁడు బాగుపడ వలయునన్న తలంపుతో మనసు విచ్చి సమర్థముగా విద్య నేర్పువాఁడు. దానిలోను నిట్లే మేలు గలదు. అఱువది సంవత్సరముల వాఁ డిఱువది సంవత్సరముల వానికిఁ దనకుఁ దెలిసినదంతయు నేర్పెనేని దానిపై వాఁడా విద్యయం దెంత ప్రవీణుడు కానేరఁడు? అట్టులే వీఁడు తాను విన్నది స్వానుభవమువలన నేర్చినది తన బాలునకు నేర్పిన వాఁ డెంత కుశలుఁడు

కాఁజాలఁడు. కావుననే వంశపారంపర్యముగ వచ్చిన వైద్యశిల్పాది శాస్త్ర జ్ఞానమునకు నిప్పుడు పాఠశాలల యందుఁ జదివి తెలిసికొను విసయములకు నెంతో భేదమున్నది. కులవిద్య పట్టుపడుటయు సులభము. కావుననే

**కం. వెలయాండ్రు రెందఱైనను**
**గులకాంతకు నీడుగారు కువలయమందున్**
**బలువిద్య లెన్నియైనను**
**గులవిద్యకు సాటిరావు గువ్వలచెన్నా.**

యని పెద్దలు చెప్పిరి. వర్ణ సాంకర్యముతోడ వృత్తి సాంకర్యము కలిగి యిప్పుడు దేశము చెడుచున్నది. ఇంకను జెడనున్నది. ఇదట్టులుండనీ, ఓబని చరిత్రము వినుఁడు.

పురాణశ్రవణముచే నోబని భక్తిజ్ఞానములు వృద్ధి యయ్యెను. వాఁ డిట్టు లాలోచింపసాగెను. నే నెవఁడను? ఏల పుట్టితిని? పుట్టినవారంద ఱేమగుచున్నారు? నేను బరమాణువనని జ్ఞానానంద స్వరూపుఁడనని, పాప రహితుఁడనని, నిత్యుఁడను శాశ్వతుఁడను ముసలితనము చావులేనివాఁ డను శోకరహితుఁ డను ఆఁకలి దప్పులు లేనివాఁడను. సత్యకాముఁడను సత్యసంకల్పుఁడనని శాస్త్రములు చెప్పుచున్నవని యయ్యవారు చెప్పిరి. నాకుఁ గాలు సేతులు కన్ను ముక్కు సెవులు లేవఁట. ఇట్టినాకు గన్ను ముక్కు చేతులు గాళ్ళులోనైన వెట్లు వచ్చెను? ఆఁకలి దప్పులేల పీడించు చున్నవి? పరమాణువుగా నుండువాఁడను బారె డెట్లైతిని. తప్పు తప్పు. నాకుఁ గాలు సేతులు లేవు. ముక్కు చెవులు లేవు. ఆఁకలి దప్పులు లేవు. చలి వేఁడుములు లేవు. దుఃఖశోకములు లేవు. ఆధివ్యాధులు లేవు. నాకుఁ బుట్టుట లేదు. పెరుఁగుట లేదు. చచ్చుట లేదు. ఇవన్నియు దేహ గుణములే కాని నా గుణములు కావు. ఇంటిగోడకు సున్నము కొట్టిన నింటి లోనివానికిఁ గొట్టినట్లగునా? గడ్డపాఱతో నింటిగోడ త్రవ్విన నింటిలోని వానిని ద్రవ్వుట

యగునా? వానలచే గోడ విఱుగఁ బడిన నింటివాఁడు విఱుగఁబడునా? అగ్నిచే నింటికప్పు గాలిన గృహస్థు కాలినాఁ డనవచ్చునా? ఎండవాన యింటిగోడలకుఁ దగులునా యింటిలోనివానికిఁ దగులునా? తెలిసెఁ దెలిసె ఇల్లు నాది యను కొనుటచే నింటికిఁ గలిగినవన్నియు నాకుఁ గలిగి నట్లే యభిమానముచే నెంచుకొనుచున్నాను. దీనికి నహంకారము, మమకారమే కారణములు. వాస్తవార్థ మాలోచింప నీ దేహము సదా నాకు శాశ్వతముగా నుండునదా? నా కింతకు ముందు దేహము ఱాయిగాఁ జెట్టుగాఁ బక్షిగాఁ బశువుగా నుండెనఁట. పుణ్యాత్ములు నాపై విశ్రమించుట చేతను, దేవునకుఁ టెంకాయ కొట్టుటలోనగు పుణ్యకార్యముల నన్నుపయోగించుట చేతను, నాకు రాతిజన్మము పోయి వృక్షజన్మము లభించెను–నేను వృక్షముగా నుండునపుడు పుణ్యాత్ములు నా నీడ నిలిచి గాసి దీర్చుకొనుట చేతను, దిక్కు లేని పక్షుల కాశ్రయమునై యుండుట చేతను, నన్ను నఱకిన బరుల కపకారము చేయ– కుండుటచేతను, వృక్షజన్మము వీడి పక్షిజన్మ మెత్తితిని. ఏ పుణ్యోదయముననో చిలుకనై రామరామ యనుటచేతనో పక్షిజన్మముఁ బాసి పశువునై యందు నా బిడ్డలకును లేకున్నను మనుష్యులందుఁ దల్లిలేని శిశువులకు రోగులకు నా పాలొసంగియు, శరీరధారణమునకుఁ గావలసినంత మాత్ర మాహారము గడ్డిగాదము గొని పరులకై దున్నుట. బరువులు మోయుట–బండ్లు లాగుటలో నగు కార్యములు చేసి వారల జీవింపఁ జేసిన పుణ్యమున మనుష్యుఁడనైతిని. తెలిసి చేసినను దెలియక చేసినను బుణ్యపాపములు వాని వాని ఫలము కొంతయైన నీయక పోవుగదా. ఇప్పుడు మనుష్యుఁడ నగుటచే జ్ఞాన మొక్కటి యెక్కువ యయ్యెను. ఈ జ్ఞానముచేఁ గదా యిట్టు లాలోచింపఁ గలిగితిని. ఇట్టి దుర్లభమైన జ్ఞానమును దుర్వినియోగపఱిచి దుష్ట వర్తనుఁడ నైతినేని పశుపక్ష్యాదుల కంటె హీనుఁ డనేకదా. మనుష్యులకు గతులుమూఁడని బ్రాహ్మణులు చెప్పిరి. అందొకటి హింసాది పాపకార్యములు చేసి యధోగతిపాలగుట. రెండవది ప్రతిఫలము

కోరి పుణ్యకార్యములు చేసి యా పుణ్యఫలము స్వర్గమునఁ గొంతకాల మనుభవించి మరల భూమిపైఁ బుట్టి యిట్లు స్వర్గమునకు భూమికి నడుమఁ నశాశ్వతము నగు స్వర్గసౌఖ్యముఁగూడఁ గోరరానిదే. దేహకష్టము లేక ధననష్టము గాక స్వర్గము రాదు. వచ్చినను నిత్యముగాదు. ధనము ధర్మసాధన మందునా యది యార్జవంబునను రక్షణంబునను నాశమందుటచే వ్యధనమే. కామాగ్ని కింధనము అన్నివిధముల దంధనమైన ధనమేల? ధనమార్జించితినిబో నేను ద్విజుఁడను గానే నాకు యజ్ఞాది కర్మాధికార మేదీ? కర్మాధికారము నాకు లేదని సంతోషింపవలయును గాన దుః ఖింపరాదు. దేవుఁడు నా యందలి కృపచేఁ గర్మాధికారములేని జన్మమిచ్చెను. కర్మాధికారులా యా కర్మముల నియతకాలములఁ జేయకున్నఁ బాపమఁ ట. చేసినఁ బుణ్యము లేదఁట. కామ్యకర్మములు చేసిన స్వర్గమే ఫలము. మరల మానవజన్మమే పర్యవసానము. కర్మాధికారులయి యుత్తమ జన్మలనుకొను బ్రాహ్మణులందు జ్ఞానము గలవారు గర్మముల జక్కఁగ నిర్వహింపఁజాలక కడు దుఃఖించు చున్నారు. ఇక జ్ఞానము లేనివారో నీచజాతులవారు చేయని కార్యములనుఁ జేసి పతితులై మా కంటె నీచవృత్తి యందున్నారు. ఇప్పుడు బ్రాహ్మణులే చెప్పులు కుట్టుచున్నారు. తినరానివి తినుచున్నారు. విక్రయింపరానివి విక్రయించు చున్నారు. ఇట్టివారి బ్రాహ్మణ్యము మేలా? నా మాల తనము మేలా? చెట్టుకొన కొమ్మ కెక్కి నేలఁబడుట మేలా? నేలనే పరుండుట మేలా? పతనభయములేని నా స్థితియే యుత్తమ మైనది. కావున నాకు మూఁడవ మార్గమే గతి. అది దేవసేవ. దేనికి నధికారి కానివాఁడు దాని కధికారి యగును. దానికిఁ బాండిత్యముతోఁ బనిలేదు. శౌర్యముతోఁ బనిలేదు. ధనముతో బనిలేదు. దేహబల మక్కఱ లేదు. ఏ యోగముతోను ప్రయోజనము లేదు. దీనికి నా యట్టి నీచజాతివాఁడేగాక యెట్టి పాపజాతియైన నధికారి యని భగవంతుఁ డె చెప్పెనఁట కదా. మిత్రభావముతో నీవే నాగతి. నేను నీవాఁడనని

యొకసారి తన్ను సమీపించినను వానియం దెన్ని దోషములున్నను వాని నెల్ల లక్ష్యము సేయక రక్షించుటే నా వ్రతమని మన కోదండ రాముఁడే చెప్పెను గదా. రాముఁ డాడితప్పఁడు గదా. ఉపేక్షించినను లోకమాత దయాసమేత సీత గలదుగదా. రాముఁడు నా యట్టి చండాలుని రక్షించునా? మృగజాతియైన యేనుఁగును రక్షింపలేదా. పక్షియైను గ్రద్దకు మోక్షమియ్య లేదా? ఉడుత నాదరింపలేదా. నా చండాలత్వము నేను గొని తెచ్చితినా? ఆయన యిచ్చినదే కదా. అత్తపేరు పెట్టి బిడ్డను గొట్టు నిల్లాలి వలె నాకుఁ జండాల దేహము తానే యిచ్చి నీవు చండాలుఁడ వని యనాదరించునా? అది యేటిమాట? పోనీ. ఆయన గాకున్న రక్షకుఁడు మఱియొకఁడు గలఁ డా? బ్రహ్మ యందమా? ఆయన తలను శివుఁడు తెగ నఱకెనఁట. శివుఁ డందమా వృత్రాసురునికిఁ జిక్కువడి తన్నుఁ దాను గాపాడుకొన లేకపోయెను. ఇదిగాక వీరందఱు పునరా వృత్తిలోఁ జేరినవారే. ఊరుపేరు చెప్పక భగవంతుని గజేంద్రుఁడు స్తుతించినపు డాయన చెప్పిన జగత్కారణత్వాది గుణములు తమయందు లేవని యిట్టివాఁడను నేను గాను నేను గానని బ్రహ్మయు శివుఁడును మూలల దాఁగిన వారేకదా. పార్వతికిఁ బరమేశ్వరుఁడే శ్రీరామ నామము తారకమని యుపదేశించెనుఁగదా. కాశిలోఁ జచ్చువారి కెల్ల ముక్తిదాయకమైన శ్రీరామనామమునే కదా విశ్వేశ్వరుఁడు కుడిచెవిలో నుపదేశించును. పరమేశ్వర పరమేష్ఠులు శ్రీమన్నారాయణుని యంశ జాతులే. శ్రీమన్నారాయణు సేవింతుమాఁ యనిన నాయన నిరాకారుఁడట. అయినను భక్తులు కోరిన రూపమున సాక్షాత్కరించునఁట. భక్తులు కోరుటచే గదా నారాయణుఁడు శ్రీరామాకారమున సాక్షాత్కరించెను. భక్తులు కోరుటచేఁగదా యిచట యథాస్వరూపముగ నిలిచెను. కావున నింతకంటె సేవ్యుఁడెవఁడు? ఆనాఁటి రాముఁ డీ నాఁడు లేఁడా? మాలయోబనిఁ దప్ప మఱియందఱ రక్షింతునని యెందైనఁ జెప్పెనా? అట్లు రక్షింప కుండిన నాయనకే వ్రతభంగము. నా కేమి హాని? జనన మరణ దుఃఖములు నాకు

సహజములే కదా. ఇనుమును గూర్చి యగ్నికి సమ్మెటపెట్టు. ప్రకృతి పరిణామమైన యీ దేహముతోడి సాంగత్యము వలనఁ గదా నా కీ జననము మరణము శోకము మొదలైనవి. ప్రకృతి సాంగత్యము నాకెట్లు వదలును? ప్రకృతి మహాబలిష్ఠమైనది. భగవంతున కంటె బలహీనమైనదే కాని తక్కిన యందఱికంటె బలీయమైనదే. ఇట్టి బలిష్ఠమైన ప్రతిబంధము తొలఁగించు కొన నా తరమా? మఱి యెవరికి శక్యముగాదు. అంతకంటె బలిష్ఠుఁడు నగు భగవంతునకు మాత్రమే శక్యము. కట్టి వేసిన వాఁ డాయనయే గనుక విడువ వలసిన వాఁ డాయనయే. పెద్ద మంట నుండి వచ్చిన మిణుఁ గురున కా మంట జనకస్థానమైనట్టు నాకు భగవంతుఁడే తండ్రి. ఆయనయే నాలోనుండి ధరించును. పోషించును. గనుక నాయనయే తల్లి. తల్లిదండ్రు లపరాధము చేసిన బిడ్డను గట్టివైచినను దండించినను నది యా బిడ్డను బాగుపఱచు సదుద్దేశము తోనే కాని క్రోధము చేతనా? నే నేదియో యపరాధము చేసియుండుట చేతనే నాకీ దేహప్రాప్తి యను కారాగృహ వాసము లభించెను. నే నేమి యపరాధము చేసితిని? తిట్టితినా, కొట్టితినా? ఆయన ద్రవ్య మపహరించితినా? ఆ హా యిన్ని నేరములు నేను జేసినవాఁ డనే. విశ్వమంతయు హరిమయము. హరి విశ్వమయుఁడు. హరిమయము గాని ద్రవ్యము పరమాణువును లేదుకదా. అటైన నందందు మనుష్యులు నన్ని మృగములు పక్షులు వృక్షములు ఱాలు రప్పలుకూడ హరిమయమే కదా. వీనిలో నేనెన్ని మార్లెన్నిటిని దిట్టలేదు. ఎన్నిటిని గొట్టలేదు. ఇవన్నియు భగవంతునిపట్ల జేసిన యపరాధములే కదా. ఈ యపరాధముల కెంతటి శిక్షకు నేను బాత్రుడను గాను? తిట్టుట కొట్టుట యేల? ఎన్నిటిని నేను సకారణముగనో నిష్కారణముగనో హింసింపలేదు? పశువులు పక్షులు సమస్త భూతములు భగవంతునకు వాసస్థానములు. అట్టివానికి హాని కలిగించుట భగవంతుని పట్ల యపరాధము చేయుటగాదా? ప్రతి జంతువు నందలి జీవుడునుఁ నా యట్టివాఁడే కదా. దేహము నాకెట్లు ప్రీతిపాత్రమో

యట్లేకదా ప్రతి జీవునకుఁ దానుండు దేహము సముద్రమునుఁ దరించువానికి నావవలె సంసార సాగరముఁ దరించు ప్రతిజీవునకుఁ దరణసాధనముగాఁ గదా భగవంతుఁడు దేహము నొసంగి నావకు ననుకూలవాయువు వలెఁ దాను జీవునకు క్షేమం కరమైన మార్గమున నతనిఁ దీసికొని పోవుచుండ నేనా నావను జెడఁగొట్టితి నేని సోదరుఁడైన జీవునకు నెంత ద్రోహము చేసిన వాఁడనగుదును. భగవత్ప్రయత్నమున కెంత ప్రతికూలముగ వర్తించిన వాఁడ నగుదును. అంతియే కాదు. పశుపక్షివృక్షాదుల శరీరములు నేను బూర్వము వాసము చేసిన గృహములే కదా. నే నా యిండ్లు విడిచి వచ్చితిని నా కిప్పుడు వానితోఁ బనిలేకున్నను వానియం దితరులు వాసము చేయుచున్నారు. నేను వాసము చేయుచుండిన కాలమున దానిని నా యిల్లని యెట్లు తలంచితినో యట్లె ఇప్పుడు వాసము చేయువారు తలంచుచున్నారు. ఇంతకు నా దేహము నా సొంతమా? కాదు. తత్కాలమున వసించుట కుపయోగపడు సత్రము. ఆ కాలమున నుపయోగించుకొను నధికారమే కాని యెక్కువ స్వతంత్రాధికార మెక్కడిది? నా చేతిలో నుండువఱకు రూపాయ నాది. అది మఱి యొకరి యొద్దకుఁ బోయిన తరువాత నది నా రూపాయ యని కాని నాకు దానితో నక్కఱ కలదని కాని నేను బలాత్కారముగ వానియొద్ద నుండి లాగుకొనవచ్చునా? అట్టులే యితర జీవాత్మలకు వానస్థానమైన దేహముల నుండి బలాత్కారముగ వారిని వెడలఁగొట్టి యందలి పదార్థములతో నిప్పటికి వాసస్థానమైన యీ దేహమును బోషించుట యయ్యో యెంత ఘోరకార్యము. ఇంతకంటె మహాపాపమేది కలదు. నా యిల్లు బాడుగ నుంచుకొనుటకై యితరుల యింటిపదార్థములు బలాత్కారముఁగ దే వచ్చునా? అట్లైన దేహపోషణకార్యమే దుర్ఘటము కదా. ఫల మూలాదులందు జలములందు జీవులు లేరా. వీని నాహారముగఁ గొనక జీవించు టెట్లు? కర్తవ్యలోపముచే దేహత్యాగము జేయుట యాత్మహత్య కదా. ప్రకృతి పరిణామములైన యితర దేహములచేఁ బ్రకృతి పరిణామమైన

దేహమును రక్షింపుమని శాస్త్రములు చెప్పుచున్నవఁట కదా. శాస్త్రములు భగవదాజ్ఞలే కదా. అట్లైన నితర ప్రకృతి పదార్థములతో మన దేహమును బోషించిననఁ దప్పేమి? హింసింప కున్న నవి మన కెట్లు లభించు? ఫల మూలభక్షణము జలపానము హింసాకార్యములే కదాయగును. అట్లని నవి మానవచ్చునా యందువా?

కాశియందు నొక ప్రభువు నా కొక గుఱ్ఱము నిచ్చి నీవు దీనిని వాహనముగాఁ గొని నా యొద్దకు వచ్చి నా గుఱ్ఱమును నా కప్పగింపుమని యాజ్ఞాపించె ననుకో. ఈ గుఱ్ఱ మారోగ్యవంతమై బలముగలదై యుండిననే కదా, నా ప్రయాణము సాగును. కాశిఁ జేరుదురు. ప్రభువును గందును. గుఱ్ఱము దుర్బలమై రోగపీడితమైనచో నెట్లు నా ప్రయాణము సాగును? అదియునుగాక దా నిచ్చిన గుఱ్ఱమును బాగుగఁ బోషించి దానిని మంచిస్థితి యందుంచినఁ గదా యిచ్చినవాఁడును సంతోషించును. కావున మన దేహయాత్ర సాగుటకును భగవత్ప్రీతికిని దేహపోషణము మంచి కార్యమే అవశ్యము చేయఁ దగినదే. అట్లైన నే యాహార మిచ్చిన దీనికి రోగము రాదో యే యాహార మిచ్చిన నిది బలము గలదై యుండునో యా యాహారమునే గదా యియ్యవలయును. ఇట్టి యాహారము సాత్త్వికాహారమే. అదియైన నెంత యిచ్చిన నది మదము పట్టి చెప్పినట్టు వినక చెడిపోక యుండునో యంతే మితముగ నీయ వలయును గాని మంచి యాహారమని మితిమించి యియ్యరాదు. ఇచ్చితిమా మదముపట్టి మనపై సవారితీయును. అప్పుడును బ్రయాణము సాగదు. కావున సాత్త్వికాహారమును మితముగ నిచ్చి దేహపోషణ మవశ్యము చేయఁదగును. అటు చేయకున్నఁ బ్రత్యవాయము కలదు.

సాత్త్వికాహారము లయిన ఫలమూలాదులును హింస చేయక యెట్లు లభ్యపడునందువా? మనము చేసిన కార్యము నొక జీవికి బాధ కలిగిననే హింసయగును గాని బాధ లేకున్న హింస గాదు. గిచ్చితినేని హింసయగును.

ఒకరితో మాటలాడిన హింసగానేరదే. దూషించినను మనస్సు నొవ్వc బలికినను హింస యగును. ఒకిరికి మేలు గలుగ నెంచితినేని హింస గాదు. పరులకుc గీడెంచితి నేని హింస యగును. ఇట్లు హింస మనో వాక్కాయములచేc జేయవచ్చును. మనుష్యలను గిచ్చిన హింస యగును గాని దున్నపోతును గిచ్చిన హింసగాదు, ఏల? దేహము స్థూలమగుటచే బాధ తెలియదు. ఒక కొయ్యతో దున్నపోతును గొట్టిన హింస యగును. ఆ కొయ్యతో నంత దెబ్బనే చెట్టును గొట్టిన హింసగాదు. ఏల? ఆ మాత్రము దెబ్బచే దానికి నొప్పి కలుగదు. అట్టులే చెట్టునకు నొప్పి గలిగించునది రాతికి గలిగింపదు. బలిష్ఠపు పిడుగు వంటి దానితోc గొట్టిన వృక్ష పాషాణములకు బాధ తెలియునుగాని యాకులు గిల్లినంత మాత్రమున గాయలు కోసినంత మాత్రమున వృక్షములకు బాధలేదు. గోళ్ళు దీసిన మనకు బాధ గలదా! అటులున్నను వానిని స్వతంత్రించి తీయు నధికారము మనకు లేదు. అట్లైన గతియేమి యందువా?

వాస్తవ మాలోచించినc దినువా రెవరు? ఎవరి నిమిత్తము తినc బడుచున్నది? నాకు ననcగా నాత్మకు నోరు లేదు. కడుపు లేదు. ఆcకలి దప్పులు లేవు. చావు లేదు. ఇcక నా కాహారముతోడ నేమి పని? ఆహారము లేకున్న నా కేమి కీడు? కావున నాహారము దేహము నిమిత్తమే కాని యాత్మార్థము కాదు. ఆహారముచే వృద్ధి పొందునది దేహమే. నే నెట్లు దేవుని సొత్తో యీ దేహము నట్లె దేవుని సొత్తే. దీని కాహార మిచ్చి రక్షింపవలసినదిగా భగవంతుని యాజ్ఞ. హింస చేయరాదనుటయు భగవదాజ్ఞయే. కావున హింస చేయక యాహారమార్జించి దేహ పోషణము చేయవలసినట్టు లేర్పడుచున్నది. రాజిచ్చిన గుఱ్ఱమువలె నీ దేహము భగవంతుని సొత్తే. నిజ మాలోచించిన భగవంతుని సొత్తైన యీ దేహమును భగవంతుని సొత్తులయిన పదార్థములను నందుండు జీవులకు నొప్పి లేకుండునట్లు తెచ్చి భగవత్కింకరుcడనైన నే నాయన యాజ్ఞప్రకారముగ నాయన ప్రీతికై

యిచ్చున ట్లేర్పడుచున్నది. కావునఁ గార్యము చేయించువాఁడు భగవంతుఁడే. నేను నిమిత్తమాత్రమను. కావున దేహపోషణము దేవసేవ యనియే చేయవలయునుగాని యహంకారముతోను మమకారముతోను జేయరాదు. ఆకులు కాయలు కోయునపుడును బ్రాహ్మణులు వృక్షము నొద్దకుఁ బోయి నమస్కరించి "వృక్షరాజమా! భగవంతుని ప్రీతికై భగవదర్పణముగా నీ యాకులను గాయలను గోయుచున్నాను. నా నేరమును క్షమింపుము" అను నర్థము గల మంత్రములు చెప్పియే యావలఁ గోయుదురని పురాణము చెప్పు బ్రాహ్మణుఁడు చెప్పెఁ గదా.

అట్లైన నిట్టిమాటలు చెప్పి జంతువుల గొంతులేల కోయ రాదందువా? వృక్షముల యాకులు కాయలు కోయుటవలన బాధ కలుగదు. వృక్షమును దేహముగాఁగల జీవునకు నాశ్రయనాశము లేదు. జీవహింసయం దట్లుగాదు. ఎంత వేగముగ నఱికినను భైరవయాతనవలె నొప్పి కలుగక మానదు. తరువాత జీవున కందుండ సాధ్యపడదు. కావున నేవిధముగఁ జూచినను జీవహింస కారాదు. అన్ని జంతువులను భగవత్స్వరూపములని యెంచి గౌరవింప వలయును. ఆయన ద్రవ్య మపహరించితినా యని యంటిని. ఆయన ద్రవ్యము కానిది పరమాణువైన లోకమున నున్నదా? అన్నిటియం దాయన యున్నాడు. ఆయన యందన్ని యున్నవి. అన్నియు నాయన సృష్టించినవే. అన్నియు నాయన దేహమునుండి వచ్చినవే. ఇట్లుండ సర్వస్వామి యాయన గాక మఱియెవరు? అట్టి యాయన సొత్తు నాయన ప్రీతికై యక్కఱ లవసరములుగల యాయన బిడ్డలకై యుపయోగింపక యిది నాది యది నాదియని యెంచి వ్యవహరించుట యాయన ద్రవ్యము నపహరించుట కదా తన బిడ్డ లయిన కుంటి గ్రుడ్డి లోనగు వారికిని, ధర్మకార్యములకును, దన సేవకు నుపయోగింప మనయొద్ద నిల్లడగా భగవంతుఁ డిచ్చిన ద్రవ్యము నట్లు వినియోగింపక యిది నాది, ఇది నా భార్యది. ఇది నా బిడ్డది యని యెత్తియుంచుట స్వామిద్రవ్య మపహరించుట

గాదా. వీనికిఁ జోరునకు నేమి భేదము? తన్నుఁ గాపాడుకొనుటకుఁ బరులను గాపాడుటకుఁ దన్ను సేవించుటకై యిచ్చిన కరములు పాదములు లోనైన యవయవములతోఁ బరులకు బాధ యొనర్చుట భగవదాజ్ఞను మీఱి వర్తించుట కాదా. ముల్లు ద్రొక్కిన నెంతో బాధ. ఇఁక హింసించిన?

తన పట్ల మన మిన్ని యపరాధములఁ గావించుచున్నను, నహంకార మమకారముల బలిమిఁ గామాదులకు వశులమై కన్ను మిన్నుగానక వర్తించుచున్నను, సహించి దేహమునఁ బ్రవేశించునపుడు దేహమం దున్నప్పుడు దేహాంతర మెత్తినపుడు దేహము విడిచి పోవునపుడు నరకమం దున్నప్పుడు స్వర్గమం దున్నప్పుడు నంతరాళముల నల్లాడునప్పుడు సర్వ కాలముల సర్వావస్థల మన మేమఱినను దా నేమఱక మనలో నుండి యెన్ని కష్టములైనను దనవి గావని తన్నంటనీయక మన మేలు మన మెఱుఁగక ప్రవర్తించినను దా నెఱింగి సమకూర్చుచుఁ జెడుత్రోవల నడచినను నయభయముల సరియైన మార్గమునకుఁ ద్రిప్పుచు మనము దుఃఖించిన మనకై మనకంటె నెక్కువగ దుఃఖించుచుఁ దృణమిచ్చినను మహామేరువుగ సంతోషించుచు దాతయై త్రాతయై తండ్రియై కాపాడువాఁ డు భగవంతుఁడు గాక మఱి యెవ్వఁడు గలఁడు. సోపాధిక బంధువులైన తల్లిదండ్రులు నన్నదమ్ములు నక్క చెల్లెండ్రు నత్తమామలు బావమఱఁదులు లోనగువారు కలవేళ నాదరింతురు గాని లేనివేళఁ బలుకరింపరు. కాళీయుని మడుఁగులో దుమికిన కృష్ణు వెంటనే తల్లిదండ్రులు దూఁకిరా? అడవికిఁ బోవు రాముని వెంటఁ దల్లిదండ్రులు పోయిరా? కరిరాజు నే బంధువులు గాచిరి? ఏవురు మగలలో నేమగఁడు ద్రౌపది మానమును రక్షించెను. ప్రహ్లాదుని బాధించినవాఁడు తండ్రికాఁడా? ఇట్టి వెన్నివో కలవు. ఆపద్బాంధవుఁడు భగవంతుఁ డొక్కఁడే.

అని యిట్టు లాలోచించి యాలోచించి తన సర్వస్వము స్వరక్షాభారము శ్రీరామునందె వైచి సేవావృత్తి నరకమనియుఁ గృషి హింసా స్వరూపమనియు

వాణిజ్యము విత్తమూలమనియు యోజించి జననీ జనక పోషణార్థంబు స్వశరీరరక్షణార్థంబు కూలి చేసి జీవించుట శ్రేయస్కరంబని యట్లు చేయుచు నన్నివేళల శ్రీరామనామస్మరణంబు గావించుచు నే కాదశుల నుపవసించుచుఁ దీటికవేళ నొంటిమిట్ట కోదండరామాలయము ముంగల నిలిచి భజనము చేయుచు నివురు గప్పిన నిప్పువలె నప్పరమ భక్తుండు కాలక్షేపంబు సేయుచుండె.

ఇట్లుండ నొక యేఁట జైత్రశుక్లాష్టమీ తిథి నారంభించి శ్రీరాములకు బ్రహ్మోత్సవంబు సాగుచుండ నోబన్నయు సంజీవరాయని కోవెలముంగల శ్రీరాముని నభిముఖంబుగ నిలిచి తంబుర చేఁబూని భజన చేయుచుండె.

**ముఖారిరాగము - ఆదితాళము**

ఎపుడు దరిసెన మిదుదో - కృపతోడ రఘురామ
అపరాధి నని నీవు - నెపము లెంచకు దేవ॥

జడుఁడను బాలుఁడ - జాల్మఁడ మత్తుఁడఁ
గడుఁ బాపచిత్తుఁడఁ - గరుణింపవె రామ॥ ఎపుడు

అంజలి మున్ను నే - నంజనాసుతవరద
రంజిలి చేసిన - రాదుగా యీ పుట్టు॥ ఎపుడు

చేయఁ బెద్దల సేవఁ - జేయ సాధుల మైత్రిఁ
జేయఁ బుణ్యము లెట్లు - చేసెదొ నన్నింక॥ నెపుడు

అపరాధములఁ జేసి - యతుల భవాంబుధి
కృపణుఁడవై వడితిఁ - గృపతోడఁ గావవె॥ ఎపుడు

వాసుదేవ * రామ - దాసపోషక బిరుద
వాసి యొంటిమిట్ట - వాస చిద్విలాస॥ ఎపుడు

---

* వాసుదేవ= వాసు (వావిలికొలను సుబ్బరావు)నకు దేవుఁడవైన శ్రీరామాయని రెండవ యర్థము.

**యదుకులకాంభోజి రాగము - ఆదితాళము**

రామా యని నేఁ బలుమఱు పిలచిన
రావది యేటికి రఘురామా
భామామణితో సరసములాడుచు
నా మొఱ వినవో శ్రీరామ॥

వననిధిలోఁబడి తనదు కుమారుఁడు
మునుఁగుఁచు దేలుచు మొఱలిడఁగా
విని వినకా లితో ముచ్చట లాడెడి
వెట్టియుఁ గలఁడా శ్రీరామా॥

పొంగలి పెరుఁగన్నము పులిహోరయు
మ్రింగుచు వినవో శ్రీరామా
ఎంగిలి పండ్లను బోయ దొసంగగ
మ్రింగుచు వినవో రఘురామా॥

ఒంటిమిట్ట పురవాస రఘూత్తమ
కంటక మేటికి రఘురామా
వెంటనె సీతా భామామణితోఁ
గంటను బడరా శ్రీరామా॥

వాసుదేవ శరణాగత వత్సల
వారిధి బంధన రఘురామా
నీ సతి నీవును గూర్చుఁడు నాకిట
నేత్రానందము శ్రీరామా॥

**బిలహరి రాగము - రూపక తాళము**

ఆనాటి దైవమే - యీ నాఁడిచ్చట లేఁడా
అడలెద వేటికె - యజ్ఞానమున మనసా
మొసలిచేతఁ జిక్కి - మొఱలిడు కరిరాజు
విసవిసఁ గాచిన విశ్వమయుఁడు తండ్రి ॥ఆనాఁటి॥

కృష్ణద్వారకావాస - కేశవ గోవింద
జిష్ణుఁడ యని వేఁడఁ - గృష్ణ మానముఁగాచు ॥ఆనాఁటి॥

వరద వాసుదేవ - వరపుండరీకాక్ష
పరమపురుష యన్నఁ - బ్రహ్లాదుఁ గాచిన ॥ఆనాఁటి॥

ఎందెందొ కలఁడని - యేటికి వెదకఁగ
యిందె యేకశిలను - గందోయికిని దోఁప ॥ఆనాఁటి॥

**అఠాణా రాగము - ఆదితాళము**

రామ ననుఁ బ్రోవవె - యొంటిమిట్ట
ధామ ననుఁ గావవే
రామ రవికులసోమ నిను నా
స్వామి వటంచును వేమఱు మ్రొక్కెద ॥రామ॥

కావుమని వేడఁ, గాకాసురునిఁ
గావఁగను లేదా
వేవుర ముందర - విసువక తిట్టిన
వీఱిఁడి నిన్నే కలయఁగ లేదా ॥రామ॥

నినుఁ గౌగిలింపఁగా, ముని
లెదవేఁడఁ, గనికరింపక
వనచర శబరులఁ గౌఁగిటఁ జేర్చిన
కనికర మెట్టిదొ కరుణాసాగర ॥రామ॥

వాసవార్చితా – సీతానాథ – దాస పోషకా
వాసుదేవహరి – శాసిత మదకరి
దోసము లెంచక – వాసిగఁ బ్రోవుము ॥రామ॥

**శంకరాభరణము - ఆదితాళము**

ఏమి పాపములు చేసినాఁడనో, యెట్టు లేడ్తు రామా
భూమిమీఁదఁ గొఱమాలిన పుట్టువు – పుట్టుటయ్యె రామా॥

కౌసల్యాసతినై జన్మించినఁ, గాకుత్థాన్వయ రామా
వాసిగ నీకును స్తన్యం బీయనె, వనజదళాంబక రామా॥

క్రోఁతిగ నైనను బుట్టియుండినను, గువలయేశ రామా
ప్రీతిగ మీ పరిచర్య సేయుచును, బేర్మి గననె రామా॥

బోయెత నగుచును బుట్టియుండినను, భూమిసుతాధవరామా
హాయిగ సాపడ మంచిఫలమ్ముల, నర్పణ సేయనె రామా॥

అల్ల నిషాదుఁడుగా జన్మించిన, హాటక సువసన రామా
మెల్లగ నిను నేఁ గౌగిలింపనా, మిహిరకులాన్వయ రామా

దండకలోఁ బెను బండనైనను, దానవమర్దన రామా
దండిగ మీ కాసనమై యుండనె, తాటకాంతకా రామా

ఒంటిమిట్టపుర వాసుదేవ హరి, యుత్పలమేచక రామా
బంటుగఁ గైకొని వాసుదాసునిఁ, బాలన సేయవె రామా

**శ్రీరాగము - రూపక తాళము**

రామ కటాక్ష మెన్నఁటికో – సీతా
రాములు నను దరిఁజేర్చు టెన్నఁటికో॥
నగుమోముఁ జూపు టెన్నఁటికో॥ నన్ను
నాయన రమ్మని పిలుచు టెన్నఁటికో ॥రామాకటాక్ష॥

నగుచు ముద్దాడు టెన్నఁటికో – నా
వగపు దీఱ బుజ్జగించు టెన్నఁటికో ॥రామ॥

కమ్మగఁ బల్కు టెన్నఁటికో – నా
కాంక్ష దీరఁ గౌగిఁలించు టెన్నఁటికో ॥రామా॥

పదసేవ సేయు టెన్నఁటికో, శా
శ్వాత కింకరుండనై మురియు టెన్నఁటికో ॥రామా॥

అభయము నిచ్చు టెన్నఁటికో, యే
కాంతకింకరుడనై – యలరు టెన్నఁటికో ॥రామా॥

సీతా కటాక్ష మెన్నఁటికో – తాను
బ్రీతితో నను నాదరించు టెన్నఁటికో ॥సీతా॥

దరిఁ జేరఁ దీయు టెన్నఁటికో – చై
తన్య స్తన్యమిచ్చి ప్రోచు టెన్నఁటికో ॥సీతా॥

ఒడిలోనఁ జేర్చు టెన్నఁటికో, మన
కొడుకు వీఁడని పతికి నిచ్చు టెన్నఁటికో ॥సీతా॥

పుడికి ముద్దాడు టెన్నఁటికో – తమ
యడుగుల కడఁ జేర్చి యరయు టెన్నఁటికో ॥సీతా॥

స్వస్థునిఁ జేయు టెన్నఁటికో, తమ
యాస్థాన కవిగ నన్నరయు టెన్నఁటికో ॥సీతా॥

ఏకాంత దాసుని వాసు, దేవుఁ
దేకశిలేశ్వరుఁ దేలు టెన్నఁటికో ॥రామా॥

## గేయము

ఏమిరా పలుక వేమిరా – నా రామచంద్ర – ననుఁ గన్న తండ్రి
నా ముద్దులయ్య – బంగారుకొండ – ఏమిరా పలుకవేమిరా
ఏలరా నా మీఁదఁ గోపము – ఏమి చేసితినయ్య పాపము
తాళలేను వియోగ తాపము, లీల నీ నగుమోముఁ జూపుము॥

## ఆనందభైరవి - రూపక తాళము

చాలురా నన్ను నేలరా – సీతారామ – దశరథరామ!
కౌసల్యరామ – సాకేతరామ – అయోధ్యరామ – ఓ పరంధామ
చాలురా – పరిపూర్ణ కామా.

సలుపలేనుర రాజయోగము – సలుపలేనుర భూరియాగము
వలదు వలదుర స్వర్గభోగము వలతు నొక్కటె భక్తియోగము

కోపమా – నాదు – పాపమా – దీనార్తి హరణా – దివ్యాభరణా
హరనుత చరణా – పాపసంహరణ – కోపమా – మనస్తాపమా
బ్రతుకలేనుర నిన్నుఁ బాసి – వెతలఁబెట్టకు రిత్తగాసి
మతిఁదలంపుము నీదువాసి – మఱపు చెందకు మమతగోసి

తాళుమా యింత కాంతాళమా – నా రామభద్ర – కరుణా
సముద్రా – రక్షావినిద్రా – నతవసురుద్రా – తాళుమా
భూమితనయా – ప్రాణనాయక – భుక్తిముక్తి ఫలప్రదాయిక
స్వామి! నిహతనిశాటనాయక – జలధి గర్వవిభంజి సాయక

చెప్పవే తల్లీ చెప్పవే – సీతాదేవీ– ఓ లోకమాతా – ఓ జగ
జ్జననీ – ననుఁగన్నతల్లి – నా నోముపంట – నాపాలి భాగ్యమ
నా తోడి నీడ – నా కల్పవృక్షమ – ననుఁ గన్న కడుపా
నా కామధేనువ – చెప్పవే నీవే చెప్పవే – నా రాముతోడ – నాతండ్రితోడ.

వీడు మనకడగొట్టుపుత్రుఁడు – వీఁడు నీదుదయకుఁబాత్రుఁడు – వీడిన నను మనకరము నిప్పుడె – విడుచుఁ బ్రాణము నిజమటంచును చెప్పవే – తల్లీ చెప్పవే.

పెంపుమా – విన్నవింపుమా – నిజముగ వీఁడు – నిను నమ్మి పెంపుమా – నాడు వలదనినఁ బోఁడు – పాలఁ బడ్డాఁడు.

ఒట్టు సత్యము దేవ వీఁడు – ఉల్లమున నిను నమ్మినాఁడు
నెట్టినను విడనాడఁ బోదు – నీవు కరుణను నేలుమని దయఁ – జెప్పవే.

**యదుకుల కాంభోజి రాగము - ఆదితాళము**

రామా రామా రామ యని నీ – నామముఁ బలుకుట నావంతు
రామా! యేకశిలాలయ నను సం–రక్షణ సేయుట నీ వంతు.

ధారుణిపైఁబడిఁ సాష్టాంగనమ–స్కారము సేయుట నావంతు.
గారాబంబున రార పుత్రయని – కౌఁగిటఁ జేర్చుట నీవంతు.

చిఱుగజ్జెలు నా కాళ్ళను ఘల్లనఁ – జిందులుద్రొక్కుట నావంతు
మఱకువఁ బాపుచు వాత్సల్యంబున – మమత వహించుట నీవంతు

నీకై కృతులను నిర్మలమతినై – నేర్పునఁ గూర్చుట నావంతు
నీకేల్ సాఁచుచు వానిని గైగొని – నెఱ ముదమందుట నీవంతు

గగ్గురు పొడువఁగ గాయము నీ కథ – గానముసేయుట నావంతు
లగ్గు దలంచుచు నెంతో ప్రేమను – లాలన సేయుట నీవంతు

చేతులు నొవ్వఁగ నీ చరణంబుల – సేవల సేయుట నావంతు
ప్రీతిని దప్పక కౌఁగిటఁ జేరిచి – భీతిని బాపుట నీవంతు

వాసుదేవ రఘునందన సీతా – వల్లభ యనుటయె నావంతు
వాసుదాస కవి వరదుఁడ వనియెడి – వాసి రహించుట నీవంతు.

**యదుకుల కాంభోజిరాగము - ఆదితాళము**

ఉమామనోహర, రుమామనోహర – సరమా మనోహర సేవితా
రమామనోహర, సమానవిరహిత విమానచర సంభావితా

సరాళమతులను సురాళ గతులను – మరాళగతు లిదె పాడగా
విరాళ మొసగెదొ – మురాసురాంతక – మఱాలసించెదొ వేడగా

తుటారికత్తెల మిటారిచూపుల – కటారులను జెడకుండఁగాఁ
గటాక్షముంపుము – జటాలవందిత – నిటాలలోచన సన్నుతా

మసారవర్ణసు మసారపానక – రసాలరస సమసూక్తులన్
రసాత్మజాధిప – విసారరూప మ – నసార వేఁడెదఁబ్రోవుమా

కరీంద్రహనన కమరీంద్రహనన – సుకరీంద్ర వరద – ననుఁగావుమా
నరేంద్రవర నరహరీంద్రరూపక – సురేంద్రనుత ననుఁబ్రోవుమా

**రాగము - నాదనామక్రియ - ఆదితాళము**

రామనామముఁ దలఁచుకొనరా – వట్టి
రాముని దాసులఁ గలసి తిరుగకురా ॥రామనామము॥

ఱేపు మాపుల నాయువేగ – నీకు –
దాపరించును గాదె మృత్యువు వేగ
కోపాన యముఁడు నిన్ లాగ – నీకుఁ –
బ్రాపెవ్వరో యిది చూడుము – బాగ! ॥రామ॥

ధనములు నిలుచును వీట – నీ
తనయులు నిలుతురు సుమి వల్లకాటఁ – దోడఁ –
జనుదెంతు రనుమాట జూట – నరక
మునఁ గూలు నిన్నుఁ గావఁగ నెవరు పూఁట ॥రామ॥

ధనము లింటనె నిలచిపోవు – ముత్తో –
తనము పోయెనని యాలు వాపోవు
తనయుcడు చెవి వెదక బోవు – దిన –
దినము గూర్చిన వేవి వెంట రాcబోవు ॥రామ॥

తొలిజన్మముల దానమెంత – నీవు –
బలిభిక్షా దైవముల కిచ్చితో యంత
దొలcగక యుండు రవంత – కొండ –
బిలముల నున్నc గల్గును నేల వంత ॥రామ॥

ప్రావీణ్యమున నేకశిలను వాసు –
దేవుcడౌ రాముడ నిలచి యుండcగను
దేవురింపcగ నేల వెతను
నీ వేది కోరిన నిడును నిజముగను ॥రామ॥

**రాగము - యదుకుల కాంభోజ - ఆదితాళము**

రామలక్ష్మణులారా – రమ్యసద్గుణులారా
రక్షింపరే మ్రొక్కెదన్
కోమల తనులార – కోదండ ధరులార
సామజగతులార – సాక్షాత్కరింపరే.

ఎన్నెన్నో విధముల – నెన్నొ యిడుమలు కుడిచి
యిన్నాcట మీ పాద – సన్నిధిc జేరితి ॥రామ॥

పడరాని పాటులు – పడితిc బొట్టకుc గాcగc
గడను మీపాదముల – కడను జేరినాcడ ॥రామ॥

ఆలుబిడ్డల మని, యన్నదమ్ముల మని
జాలిc బెట్టిరి గాని, సౌఖ్యము లేదయ్యొ ॥రామ॥

పెట్టి నన్నినాళ్లు, పొట్ట పగులఁగఁ దిని
తిట్టిరి కడపటఁ, జుట్టాల మనువారు ॥రామ॥

దోసము లెన్నియొ - చేసితి నేమాయె
దోసము లెంతురె దొడ్డ దొరబిడ్డలు ॥రామ॥

పలువ మూఢుఁడు పాపి - చలచిత్తుఁ దవివేకి
తులువ వీఁ డనుచును - దోషము లెంచక ॥రామ॥

నీ వాక్యమును నమ్మి - నీవాఁడ నంచును
దేవ-పాహి-యంచు - దేవురు లాడెద ॥రామ॥

ఒంటిమిట్ట పురిని - నుల్లసిల్లెడి రామ
కంటగింపక నీదు - బంటుగ నేలర ॥రామ॥

ఇ ట్లోబన్న భజనము చేయుచుండు సమయంబున నాతాలూకా తహశీల్‌దారు మడుఁగులు గట్టి తన యంగనలతోడఁ గూడి బంట్రౌతులు ముందు బరాబరులు సేయ దేవాలయము నకుఁ బోవుచు నందు మాలబాలురఁగూడి భజనము సేయు నోబనిం గని యుత్సవకాలంబున స్వామిదర్శనార్థమై భక్తిమై వచ్చినవారిని స్పర్శదోష మంటదని కాని, జలపాత్రచే నున్నచోఁ జండాలాదిదర్శన స్పర్శ సల్లాపదోషములు లేవని గాని యెఱుంగని యా యధికారమత్తుఁడు తాను మైలపడితినని సంశయించి కోపించి యోరీ నీ వెవ్వఁడవు? ఇం దేల గుంపుగూర్చి పరులరాక పోకల కిబ్బంది గలిగించెదవు? మీరిచ్చట నిట్లు గుమిగూడిన దేవాలయమునకు మడుఁగుతో వచ్చెడి పోయెడి స్త్రీలు పురుషు లెట్లు వత్తురు పోదురు? మీరిందు నిలువక దూరముగ నెందైనఁ బొండని గద్దించి పలికిన నోబఁ డిట్లనియె.

**రాగము - నాదనామక్రియ - ఆదితాళము**

రాముని దాసుల మయ్యా – మమ్ముఁ –
ప్రేమను గనుఁగొన రయ్యా
రామదాసుల మేము – రాగము తోడుత
స్వామిని భజియింప – వచ్చినార మయ్య ॥రాముని॥

పరులమాటకు మేము రాము – మేము –
పరుల బాటకు నడ్డపడము
పరసతులను మేము – పాలించిచూడము
తరుణులందఱు మాకుఁ – దల్లిదోడులయ్య ॥రాముని॥

గజరాజవరదునిఁ దలఁచి – మేము –
భజన సేయుచు నిందు నిలిచి
గజిబిజిలేకుండఁ – గాలముఁ గడుపఁగ
గుజనులనుచు మమ్ముఁ – గోపింపకుండు మీరు ॥రాముని॥

పరులను వేడఁగఁ రాము – కామ –
చరులను గూడఁగఁ బోము
పరమశ్రద్ధ రామ–భజనము చేసెడి
పరభక్తులను గూడి – వర్తించువారము ॥రాముని॥

వాసుదేవుఁడె మాకుఁ దండ్రి, మఱి
భూసుతయే మాకుఁ దల్లి
ఈ సన్నిధిని బాసి – యెందేగ వచ్చును
రోసముతో మమ్ముఁ – ద్రోచిపుచ్చకుఁడయ్య ॥రాముని॥

ఇబ్బంది మావలన లేదు – రాచ –
సిబ్బంది వారము గాము
నిబ్బరముగ రాము నిర్మలకథలను
గబ్బముగను బల్కి కడతేఱు వారము ॥రాముని॥

తుంటరులము మేము గాము – దుష్ట –
కంటకులను జేరఁబోము
ఒంటిమిట్టేశుఁడు – ఉర్వీజరమణుఁడు
ఇంటివేల్పుగఁ గొని యెలమిఁ బూజింతుము ॥రాముని॥

అని చెప్పిన యధికారి రోషభీషణంబగు వేషంబున మండిపడుచు నీ తుచ్ఛుఁడు మా యాజ్ఞ చొప్పున నడవక యెదుర నిలిచి ప్రత్యుత్తరములు ప్రేలుచున్నవాఁడు. మెడపట్టి దూరముగ గెంటుఁడని తన సేవకుల కాజ్ఞాపించినవారును దండధరు కింకరులవలె దండధరులై యుద్దండంబగు దుండగంబున నా భక్తాగ్రేసరుఁ దోడివారలమోఁది పాఱదోలి వానిని మెడపట్టి దూరంబుగఁ ద్రోచిపోయిరి.

అప్పు డోబఁడు తన పరాభవంబునకుఁ జింతింపక శ్రీరాముల సన్నిధానంబుఁ బాసి పోవలసి వచ్చెఁగదా యని దుఃఖించుచు స్వామిఁ గూర్చి యిట్లనియె.

**ఆనందభైరవి రాగము - ఆదితాళము**

ఇఁక నెవరు నాకు దిక్కు – ఇందిరా రమణ
ఇఁక నెవరు నాకు దిక్కు॥
ఇఁక నాకు దిక్కెవ్వ, రిందఱుచూడఁగా
బ్రకటితముగ నీవే, పద పద మని త్రోయ ॥ఇఁక॥

నీవె నా దిక్కని – నెఱ నమ్మినందుకు
ఈ విధ మర్యాద – లెసఁగించితె రామ ॥ఇఁక॥

తల్లివి తండ్రివి – దైవము నీవని
యుల్లములో నమ్మి – యున్న ఫలమా యిది ॥ఇఁక॥

మున్నెవరినొ కాచి – తన్నమాటను నమ్మి
సన్నుతింప నిట్టి – మన్నన గూర్చితె ॥ఇఁక॥

నీముద్దు నెమ్మోము - సోమునిఁ జూపక
రామ! యర్ధచంద్రుఁ - బ్రాపింపఁ జేసితె ॥ఇఁక॥

వాసిగ నీ పద - దాసానుదాసుని
గాసి పెట్టుచు వాసుదాసు నెటులేలెదో ॥ఇఁక॥

ఆహా! నా కెట్టి కష్టము సంభవించెను. శ్రీరామునిఁ బాసి దూరము పోవలసి వచ్చెను. ఇంతకంటెఁ బ్రాణము పోయిన మేలు గాదా. నాపై రోషింప నధికారికే యధికారము గలదు? ఇదంతయు రామ మాయావిలాసము. ఆత్మారాముఁడైన రాముఁడు ప్రేరింపకున్న వీ రట్లు వర్తింపఁగలరా. కావున ఇది రామకృత్యమే. నే నేదియో ఘోరమైన నేరము చేయకున్న రాముఁడు నన్నేల దూరంబుగ నంపనిచ్చగించు. నేను మాలఁడ ననుట నెపము మాత్రము అని యిట్లు రాము సంబోధించుచున్నాఁడు.

**పంతువరాళి రాగము - ఆదితాళము**

నీచజాతిలోఁ బుట్టినాఁడనని - నిగ్రహ మేటికి - శ్రీరామా
నీచజాతిలో నన్నుఁ ద్రోచినది - నీవే కాదా రఘురామా
అల్లబోయెతవి యెంగిలి ఫలముల - నారగింపవా - శ్రీరామా
మెల్లగఁ జెపుమా యా శబరియు నీ - మేనత్తటరా రఘురామా
క్రోఁతులు నెలుఁగులు గంద్రంగులు నీ - కూరిమిచుట్టలె శ్రీరామా
నీ తాతకు నేమగునో వాల్మీకి - నెనరునఁ బలుకవె రఘురామా
ఆలివంకదా ముసలిగ్రద్ద నీ, వాదరింపవా శ్రీరామా
పోలఁగ నీకుఁ ద్రిశంకుం డేమగుఁ - బూని పల్కరా రఘురామా
నీ దే కులమో నిజముగఁ దెలుపుము.
నీ బవిసాఋను శ్రీరామా
వాదన నీ మాలదాసరి గెలువఁగ
వశమా నీకును రఘురామా ॥నీచజాతి॥

ఒంటిమిట్ట పురవాస రఘూత్తమ - యుర్వీనాయక శ్రీరామా
బంటునంటిని - బదములఁ బడితిని
బాలన సేయుము రఘురామా ॥నీచజాతి॥

**ఆహిరి రాగము - ఆదితాళము**

న్యాయమా - రామ! న్యాయమా - నను విడనాడ
న్యాయమా - రామ న్యాయమా
రేయి పగలు నీదుసేవ - చేయుచు నే నిచటనుండ
దాయనా నన్నిట్లు దూరగుఁ - జేయఁగా నను గన్నతండ్రి॥
దిక్కుదామని తలఁచువారికి దిక్కు నీవై యుంటగాదే
మ్రొక్కి నిన్నుఁ గొల్చుటెల్ల - నిక్కి నీల్గిన నేమిసేయుదు॥

వరుససద్గుణపాళి నీ యెడ - నిరవుకొనెనని యజ్ఞులందురు
కరుణయొక్కటి లేద దుండినఁ - ద్వరగఁ జూపుము లోభపడక
వాసిగా నీచరణ పంకజ - దాసులకు దాసానుదాసుఁడ
వాసుదాసుఁడ నొంటిమిట్టని - వాస! నన్నిటుకస్తి పెట్టగ ॥న్యా॥

**పంతువరాళి రాగము - ఆటతాళము**

ఏటికి దయ తప్పితో - శ్రీరఘురామా యేటికి దయ తప్పితో
ఏటికి దయతప్ప - నేమి నేరముగంటి
మాటికి నీ పేరె - స్మరియించు వానిపై ॥ఏటికి॥

కోపించి త్రోయింపఁగా - ననుఁ గన్నతండ్రి
నీ పుత్రకుఁడను గానా
కోపముఁ బరులపైఁ - జూపుట సరిగాని
నీ పట్టి మీఁదనె - నెనరు తప్పుట మేల? ॥ఏటికి॥

భక్తిలేదని యల్గితో - యోగ జ్ఞాన
శక్తిలేదని తలఁచితో॥
భక్తియోగ జ్ఞాన శక్తులు లేక వి
రక్తిని మీ పాదములె నమ్మువానిపై ॥ఏటికి॥

ఏకశిలాపురమున - శ్రీవాసదాసుని
బ్రాకటగతిఁ బ్రోవఁగా॥
లోక మెఱుంగఁగ దీక్షను గైకొన్న
కాకుత్థ్స కులతిలక - కరుణింపకయె, యిట్టు ॥ఏటికి॥

**పున్నాగవరాళి రాగము - ఆదితాళము**

రామ దేవరా - జాగేల చేయఁగ - బ్రేమఁ గావరా॥
కామినులను మును గాచినాఁడ నని
దీమస మేటికిఁ దామరసాంబక ॥రామ॥

మీ సేవ సేయఁగా - నా పరమేష్ఠి - వ్రాసినాఁడు గా
దోసము లెంచక - వాసిఁగ బ్రోవుము
వాసుదాసవరదా సురవందిత ॥రామ॥

కరిరాజుఁ బ్రోవవా - యది మొఱలిడ - నా శరబాలుఁగావవా
సురపతి కొఱకా - శరపతిఁ జంపఁగ
నరపతివయి నా - నరపతి, నేలవె రామ దేవరా ॥రామ॥

కామ మర్థము - కైవల్యము - కాంక్ష నిచ్చు నీ
నామముఁ దలఁచిన - బామరు నైనను
బ్రేమను బ్రోచెడు - రామముఁ దీరిచి ॥రామ॥

అని యిట్లు పాడుకొనుచుఁ బోయి దేవాలయమునకు బశ్చిమ భాగంబునఁ జెర్వులో నిలుచుండి రామసన్నిధిని బాయవలసి వచ్చెఁ గదా యను శోకంబున నిద్ర విడిచి రాత్రియంతయు భజన చేయుచుండె.

**రాగము - ఆనందభైరవి - ఆటతాళము**

చేరి కొలుతు, వీరరాఘవా – కూరిమిఁ బ్రోవు॥
ఎంతోబాళి, వెతలజాలి, వంతఁదూలి – విలపించిన
స్వాంతమునను, జింతమాని, యింత కనికరింపవేలా ॥చేరి॥

చాఁపరాతి నాఁతిజేసి, భూపపుత్రి, హరియించిన
పాపపంక్తి – కంఠుఁ దునిమి, ప్రోపుచేసి తెల్లసురల ॥చేరి॥

వాసుదేవ, దివ్యభావ, వాసి యెఱిఁగి – కరుణాకరా
భాసురగుణ – యొంటిమిట్ట – వాస వాసుదాసపోష ॥చేరి॥

**రాగము - కమాజు - ఆటతాళము**

ఘనకాయ, మౌనిగేయా, వినతవిధేయా ॥ఘన॥

జీతమా, బత్తెమా – సేవ తేరకుఁ జేయఁ
బ్రీతి నొకమాటైనఁ బలుక వేమిర స్వామి ॥ఘన॥

ఎన్నినాళ్ళకు నైనఁ – గన్నులఁ గనరావు
కన్నతండ్రియె యిట్లు – కన్నడసేయునా ॥ఘన॥

కరిరాజు సురవైరి – తరణిజతరుణులఁ
గరుణఁ గాచుట నిజము, గాదని తోఁ–చెను ॥ఘన॥

ప్రాకట గుణ భూష – వాసుదాస వరదా
ఏకశిలాధీశ – యేలరా యీ వేళ ॥ఘన॥

**రాగము - కన్నట - ఆటతాళము**

వారిజలోచనా – పాపవిమోచన
నేరము లెంచక – కూరిమిఁ బ్రోవరా ॥వారిజ॥

ధరణీజాపతి నీ – చరణములే గతి
కరుణా – భరణా – దురితనివారణ ॥వారిజ॥

జలరుహనయన నీ చరణము సోఁకినన్
శిలయే – చెలియై – చెలువము గాంచదే ॥వారిజ॥

ఏకశిలేశా దయా, లోకన పాత్రుఁడ
లోకా, ధారా, సుశ్లోకవిచారా ॥వారిజ॥

**రాగము - హిందూస్థానీతోడి - ఆటతాళము**

రామరాజల, లామదైత్యవి, రామ యేల, పరాకురా
సామజారిపరాక్రమా గుణ, ధామ యేలక పోకురా ॥రామ॥

ఒక్కసారియె, మ్రొక్కువారికి, దిక్కు నేనే యంటివి
నిక్కమది యని నమ్మిమ్రొక్కిన, నీవు దాఁచుకొంటివి ॥రామ॥

చారుహాస వికాసముఖ మొక – సారి చూపర మ్రొక్కెదన్
తారహారపటీర కీర్తివి – హార నీకే దక్కెదన్ ॥రామ॥

దాసపోషక పుట్టువాదిగఁ – దనువు నీ కర్పించితిన్
వాసుదాస సుపూజితా నీ – దాసుఁడని మది నెంచితిన్ ॥రామ॥

ఒంటిమిట్ట పురీనివాసక – కంటగింపఁగ నేలరా
కంటకారులగెంటి యిఁక నీ – బంటుగా నన్నేలరా ॥రామ॥

**రాగము - హిందూస్థాని - ఆటతాళము**

రామచంద్ర – సుగుణసాంద్ర, రమ్యశీలా – నాదుమ్రోల
ప్రేమక్రమ్మి – మోముఁదమ్మి – వేగచూపఁగానురమ్మీ ॥రామ॥

నీవు దక్క – నేమటొక్క – దైవమెఱుఁగ – నయ్య సామీ
దైవమైనఁ – దండ్రివైనఁ – దల్లివైన నీవె సుమ్మీ ॥రామ॥

కరినిగాచి – తరుణిఁబ్రోచి – గిరిని మోచి తందు రే – నీ
సరణి నిజమెయైన నన్నుఁ – గరుణఁ గావకుందువే ॥రామ॥

శరణు శరణు శరణటన్న - జాగుసేయ దాయునా
చరణసారసములఁ జూపి, కరుణ - రాఘవ యేలుమా ॥రామ॥

ఒంటిమిట్ట నగరధామా, యుగ్రజపిత పరమనామా
కంటకారిచయవిరామ - బంటుగా నన్నేలు రామ ॥రామ॥

**రాగము - భైరవి - రూపక తాళము - హిందుస్థాని మిశ్రము**

వలదు వలదుర రామ - భద్ర నాతో వాదు
బలవంతునితోఁ బోరు - భంగముఁ దెచ్చును ॥వలదు॥

చేతులు జోడించి - చెంత నిల్వఁగను
భీతితో నేను వి-భీషణుఁడను గాను ॥వలదు॥

వెనుక ప్రక్కన యుండి - వింజారము వీవ
కనలేవ నన్ను లక్ష్మణస్వామి నేఁ గాను ॥వలదు॥

నిరతము నీ నామ-స్మరణము సేయుచు
చరణము లొత్తగా - సామీరి నేఁ గాను ॥వలదు॥

మొదట నా మనసను - ముప్పిరి త్రాట నీ
పదములు బిగువుగా - బంధించివైచెద ॥వలదు॥

కదలనీయక నిన్నుఁ - గనుచూపులో నిల్చి
హృదయమన్ గుహయందు - నెప్పుడుఁ బడవైతు ॥వలదు॥

వాక్కుచేతనె నిన్ను - వశుఁడుఁగ జేకొనఁ
బ్రక్కబాయక నిల్చి - పనులు గావింపవో ॥వలదు॥

కవితోడ వైరము - గాదనగా వినవో
కవిని నౌదునో కానొ - కలది నీవే చెపుమ ॥వలదు॥

వాసిగ నొంటిమిట్ట - వాస శ్రీరఘువీర
దాసానుదాసుని - వాసుదాసుని వేల్ప ॥వలదు॥

**శంకరాభరణము - ఆటతాళము**

కన్నతండ్రి వటంచు నమ్మితి - నిన్ను వీడనురా
నన్నుఁ బ్రోచుట నీకు భారమా - నలినలోచనుడా ॥కన్న॥

నీదు బాసయె నీవు తప్పిన - నింద రాదటరా
పాదసేవయె సేయు నాతో - వాద మేటికిరా ॥కన్న॥

తల్లివైనను దండ్రివైనను - భ్రాతవైననురా
యెల్లనీవే యంచునీపై - నుల్లముంచితిరా ॥కన్న॥

మోహజాలములోన మునిగి - మోసపోయితిరా
స్నేహమెంచి యింకైన నన్నుఁ - జేరఁదీయుమురా ॥కన్న॥

ఒంటిమిట్ట నివాస రాఘవ - యొంటివాఁడనురా
బంటుబంటగు వాసుదాసుని - పాలివేల్పవురా ॥కన్న॥

ఇట్లతఁడు భజన సేయుచుండ నా రాత్రి యర్చకు లేకాంత సేవాది పూజాకృత్యములు సలిపి తలుపులు తాళములు ముద్రలు వైచి యింటికిఁ బోయి మరుసనాఁ డుదయమున లేచి ప్రాతరభిగమన కార్యంబులు నిర్వర్తించి వచ్చి సుప్రభాత ముఖరితవదనులై యథావిధి తలుపుల ముద్రలు దీసి గర్భ గృహంబులోనికిఁ బోయి కన సీతారామలక్ష్మణులు మువ్వురును దమ యంతరంగభక్తు నొప్పించి పాపాత్ముల ముఖంబు చూడ నొల్లకయో, యేకాంత భక్తుని గానామృతంబుఁ ద్రావు నాసక్తినో, పూర్వ ముఖంబుమాని పశ్చిమాభిముఖులై యుండిరి.

అర్చకుఁ డా విపరీతపు వింత చూచి యదరిబెదరి యుదిలఁ గొని పరువున వచ్చి ధర్మాధికారులకు విన్నవించె. వారును నాదరబాదర వచ్చి నిలువుచూపులఁ జూచువారును, ముక్కున వ్రేలిడుకొనువారును స్తంభముల

వలె నిలబడువారును, నోట మాటలేనివారును నొకరిముఖ మొకరు చూచు వారునునై యిది యేమివింత యిది యేమివింత యని యందఱు నాస్థాన మంటపమున గుమిగూడి మంతనం బుండసాగిరి. నిత్యపూజానైవేద్యాదులు నిలిచిపోయె.

అప్పటి గ్రామజను లిప్పటివారివలె నెప్పుడు సందుదొరకునా యేది యపహరింతుమా యను దేవాలయ చోరులుగారు. దైవభక్తి పరులు గావున శ్రీరాముఁ డారగింపక మన మెట్లు లారగింప వచ్చునని యందఱు పస్తుండిరి. సీతారామలక్ష్మణులు మన ముఖము చూడ నొల్లఁడయ్యెఁ దదీయ ముఖావలోకన భాగ్యంబు మనకును లేదాయెఁ గావున గ్రామమునకు గ్రామ జనులకు ననిష్టంబు తప్పదని యెల్లవారు భీతిల్లిరి. తుద కేదియో మహాపరాధము జరగకున్న నిట్టి విపరీతము పుట్టదని యందఱు నిశ్చయించిరి. అందర్చకుఁడు భక్తిపరుఁడును, ధనార్జన నిమిత్తమై పూజ చేయువాఁడుగాక భక్తితో శ్రద్ధతోఁ జేయువాఁడును గావునఁ దన వలన నేదో, యపచారంబు సంభవించెనని భయపడి యథాపూర్వము సీతారామ లక్ష్మణులు తూర్పుముఖముగ నగువఱకు నాహారము నుజ్జగించెదనని ముఖ మంటపమునంద ప్రాణాచారంబు పడియె. భజనము చేయువారు లేని మహానీచదశ యిప్పుడు గ్రామమునకుఁ దాపరించినది గాని పూర్వ మనే కులుండుటఁ జేసి వారందఱు స్నానములు గావించి శుభ్రవస్త్రములు నూర్ధ్వపుంద్రములు ధరించి భజన సేయ నారంభించిరి. శూద్రులు శాస్త్ర జ్ఞానము గలిగి పెద్దలసేవ చేసినవారగుటచే శాస్త్రప్రకార మేకపుంద్రమునే ధరించిరిగాని పులిని జూచి నక్క వాఁతలు వేసికొన్నట్టు ద్వాదశనామములు ధరించి భగవద్గీత చంకఁ బెట్టుకొని తామును బ్రాహ్మణులుగాఁ గోరి నటించినవారు గారు. శాస్త్రబద్ధులు – గుణ వృద్ధులు – ప్రబుద్ధులు నైన వారి చర్య యిట్టి దేయై యుండునుగదా. వ్యక్తజీవచైతన్యము గల యుద్భిజ్జ,

స్వేదజాండజ జరాయుజములను నాల్గిట జీవుఁ డెనుబదినాలుగు లక్షల యోనుల జన్మించి యావల మనుష్యుఁడై పుట్టును. మనుష్యత్వమునను రెండులక్షల యోనులఁ గ్రమక్రమముగ జన్మించి యుత్తమబ్రాహ్మణుఁడగు మనుష్యాకారము గలిగినంతమాత్రమున నందఱు మనుష్యులు గారు – మహాయోగులు – మహాతపస్సులు – మహాభక్తులు – మహాజ్ఞానులునై యాత్మసాక్షాత్కార భగవత్సాక్షాత్కారములు గలిగి జీవన్ముక్తులైనవారే నిజమైన మనుష్యులు. వారియందే మనుష్యత్వము సార్థకము. తక్కినవారు మనుష్య ప్రాయులు – మనుష్యకల్పులు. మనుష్యరూపులు ద్విపాత్పశువులు. మనుష్యుల యందును బూర్వజన్మ వాసనాబలమున వ్యాఘ్రములు – జంబుకములు – దున్నలు – నెమళ్లు – పాములు – తేళ్లు గలవు కదా. మాంసము భుజించువారు తాము పులులు – తోడేళ్లు – సింహములుగా నున్నప్పుడు తమకుఁ బూర్వజన్మమున వాడుకఁబడిన మాంసాహారమును వదలఁజాలని తిండిపోతులు. మనుష్యవ్యాఘ్రములు మనుష్యవృక్షములు. పరుల మోసగించువారు మనుష్య జంబుకములు – జ్ఞానహీనులు మనుష్య మహిషములు అలంకారప్రియులు మనుష్యమయూరములు. పరబాధాకరులు మనుష్యసర్పములు, మనుష్యవృశ్చికములు. చపలచిత్తులు, తుంటరులు మనుష్యమర్కటములు. ఇట్టులే మనుష్య సూకరములు. మనుష్యుల యిప్పటి వర్తనమునుబట్టి వారు పూర్వజన్మముల నేమియై యుండిరో చెప్పవచ్చును. కావున నుత్తమబ్రాహ్మణత్వము స్వవర్ణాశ్రమధర్మంబుల యథావిధి నిర్వర్తించి పరిణామక్రమంబున నొందఁదగినది. కాని భగవద్గీతలు జేబులలోఁ బెట్టుకొని తిరుగుటచేతనుఁ నతర్ధ్యద్వాదశ నామధారణచేతను, ననుకరణము చేతను లభించునది కాదు. మత మనుభవముగాని వాగ్వి జృంభణముగాదు. అడంభము నిజమైన సదాచార సంపత్తి యుత్తరోత్త రాభివృద్ధి హేతువుగాని మండూకప్లుతులుగఁ గావు. అన్ని యాచారములలో నిజమైన భక్తిచే

భగవన్నామ సంకీర్తనము శ్రేష్ఠమైనది. ఈ జ్ఞానము గల వారగుటచే భజన పరులందఱు నేవురార్వురు గుమిగూడి రామభజనము చేయుచు సముద్రపు టలలవలె నొకరి వెనుక నొకరు మేళతాళములతో గ్రామదేవాలయ ప్రదక్షిణములు గావించుచుండిరి. స్త్రీలు గృహములందే రామభజనము చేయుచుండిరి. ఆ దినమంతయు గ్రామంబున సీతారామ నామము తప్ప వేఱొండు శబ్దము వినరాదయ్యె. సూర్యుఁ డస్తమించెను. ఆకాశమున నక్షత్రములవలె బ్రొయ్యి రాఁజయ్యెను. ఏ జిహ్వయు జలము నంటినది కాదు. ఈ వింత చూచుటకు దూరపు గ్రామముల నుండియు వేనవేలు ప్రజలు వచ్చిరి. వారును గ్రామజనులట్లేయైరి.

ఆ రాత్రి వేకువజామున నర్చకుని స్వప్నమున శ్రీరాముఁడు బైరాగి వేషంబున గోచరించి యోరీ నీ వేల ప్రాయోపవేశము గావించితివి? నీ యందు దోషము లేదు. నా కెదురుగ నుండి భజనము చేయుచుండిన యోబని మీరు వెడలఁగొట్టితిరి. వాఁడిప్పుడు చెర్వులో నిలిచి భజనము చేయుచున్నవాఁడు. వాని భక్తికి సంతోషించి వాని గానామృతరసంబునఁ దవిలిన మక్కువచే వానివంక మరలితిమి. వాఁడు యథాప్రకారము వచ్చి నిలిచెనేని మేమును దూర్పు ముఖముగ నిలుతుము అని చెప్పెను.

ఓబని దన్నించి త్రోయించిన యధికారికి నిట్టి స్వప్నమే వచ్చెనుగాని యతఁడు బెత్తపు దెబ్బలచేఁ దబ్బిబ్బు లాడుచు నిద్దుర లేచి తాను గన్నగల వృత్తాంతము నందఱకుఁ జెప్పెను. అర్చకుఁడును బ్రాణాచారము నుండి లేచి తన స్వప్న వృత్తాంతమునే యందఱకుఁ దెలిపెను.

అప్పు డర్చకాధికారులతోడ నందఱును మేళతాళంబులతోఁ బల్లకితో నోబయ్యయుండు చోటు వెదకుచుఁ బోయిరి. వీరిని దూరము నందే చూచి యా భక్తుఁడు మరలఁ దన్ను బాధింప వచ్చుచున్నారని తలఁచి భయపడి.

## నాదనామక్రియ రాగము - ఆదితాళము

అయ్యయ్యో యిదియేమి పోరు - వీ
రియ్యెడనైనను నన్నుండనీరు ॥అయ్యయ్యో॥

ఒకరిమాటకు మేము రాము - మే
మొకరికినైనను నెగ్గాడఁ బోము
అకలంకమతిని శ్రీరాము, నే
వికలత లేకుండఁ దలఁచువారము ॥అయ్యయ్యో॥

కాసువీసము లడుగ రాము - రామ -
దాసులతో మైత్రి సేయగఁబోము
కౌసల్యానందనుఁ గొలుచు - రామ
దాసులతోఁ గూడి యుండువారము ॥అయ్యయ్యో॥

పరసతులఁ గన్నెత్తి కనము - మేము
పరులమీఁద నింద లాడిన వినము
పరుల యిండ్లకు మేము చనము - సీతా
వరుని భజించుచు నుందు మనుదినము ॥అయ్యయ్యో॥

దూషించువారి నెగ్గనము - మమ్ము
భూషించువారిని మది మెచ్చుకొనము
రోషంబునకు నీము మనము - మాయ -
వేషములను బరుల మోసగింపము ॥అయ్యయ్యో॥

పరవిత్తముల కాసపడము - మేము -
పరయువతి జనములపై మది నిడము
హరినామ భజనము విడము - కిం
కరులకునైనను మది భయపడము ॥అయ్యయ్యో॥

ఒంటిమిట్టను వెలయు రాము - బంటు
బంటుగ నగుచును వెలసియున్నాము -

తుంటరులము మేము గాము - ఇట్లు
కంటగింపఁగ నేటి కయ్యా శ్రీరామా ॥అయ్యయ్యో॥

**సావేరి రాగము - చాపుతాళము**

కలఁడో లేఁడో - నన్నుఁ గన్నయ్య - మా రాముఁడు - నా
పాలిటఁ - గలఁడో లేఁడో

కలఁడో లేఁడో కాకుత్థ్సతిలకుఁడు
కలఁకదీఱ, నా - కనులకుఁ గనరాఁడు - కలఁడో.

బలిమి రాజభటులు - పడఁద్రోచి యీడ్వఁగ
వలదు వలదనుచును - వారింపగా రాఁడు - కలఁడో.

గర్భమందు విప్ర - కాండాగ్నిఁ గ్రాఁగిన
యర్భకు మనిచిన - యరవింద నేత్రుఁడు - కలఁడో.

తన్ను శరణువేఁడ - దయతోడ రక్షింతు
నన్న బిరుదము గలుగు - సన్నుతశీలుఁడు - కలఁడో.

దాస రక్షాదీక్ష - దాల్చి యేకశిలను
వాసుదాసుఁని బ్రోచి - వాసి గన్నతండ్రి - కలఁడో.

కలఁడు కలఁడు కలఁడు - కలఁడు కలఁడు కలఁడు
కలఁడు కలఁడు సీతా-కమలా హృదయేశుఁడు.

**రాగము - పంతువరాళి - ఆదితాళము**

ఇంకెందుఁ బోదు నయ్యా - సంకటహరణా - ఇంకెందు.
బోదువయ్యా.

ఇం కెందుఁ బోదునో - యిందు నిల్వఁగ రాదు
పంకజాక్షుఁడు నాపైఁ - బంతగించెను నేఁడు ॥ఇంకెందు॥

ఊరు నాడు విడిచి - యూరికి వెలుపల
నారాయణ కృష్ణ - నరహరి యనుచుంటి ॥ఇంకెందు॥

పెట్టఁబోయఁగ రామ! పీడింప నిన్నెపుడు
గట్టి మనసున నిపుడు – రట్టు చేసెద వేల ॥ఇంకెందు॥

విజనమైనచోట – గజవరదుని రాము
భజన సేయఁగ వీరు – పైపడి వచ్చిరి ॥ఇంకెందు॥

పదరె పదరె కాళ్ళ – పాడడవులకైన
నదరు బెదరు లేక – హరిని దలఁపవచ్చు ॥ఇంకెందు॥

వాసు దేవుఁడవను – వాసిని నిను కొల్వ
గాసి పెట్టుదె యిట్లు – కౌసల్యనందన ॥ఇంకెందు॥

అని యిట్లు భజనము చేయుచుఁ దనకై వచ్చువారిని గని మరలఁ దన్నుఁ దన్నుదు రను భీతిని దూరదూరము పోవఁ జొచ్చెను. ఆ భక్తుఁడు దూరము పోవుట గని యధికారులను వేగముగ నడవసాగిరి. వారు వేగముగ వచ్చుట చూచి యోబఁడు మఱింత భయపడి పరువెత్తసాగెను.

వారును శీఘ్రగమనమునఁ బోయి పట్టుకొనిన భయ పడుచుఁ వాఁ డిట్లనియె.

**నాదనామక్రియ రాగము - ఆదితాళము**

ఇక్కడ నేనుండ నయ్య – మీకు
మ్రొక్కెద విడరయ్య – పుణ్యాత్ములారా ॥ఇక్కడ॥

జలజలోచను మదిఁ దలఁచి – నాదు
కలుషము లెల్లను – గడద్రోయ వలచి
తెలిసి తెలియక యిందు నిలిచి – మీకు
నలుక జనింపఁగఁ జేసితి నయ్య ॥ఇక్కడ॥

పోయెద వేఱొండు కడకు – నేఁ
జేయను నిఁకమీఁద – నిట్టిది దుడుకు
దాయగఁ గౌసల్యకొడుకు – కరుణ
పాయఁగ శిక్షింప వీఁ డెట్లు బ్రతుకు ॥ఇక్కడ॥

వాసుదాసుని వరదుఁ డనుచు - జనులు
భాసురముగఁ బల్కఁ గీర్తిని వినుచు
వాసిగ నిజమనుకొనుచు - నేను
డాసినందుకు నన్ను దండింపఁ బనిచె ॥ఇక్కడ॥

అనిన వారతని జడుపు దీర్చి జరిగిన వృత్తాంతము శ్రీ రాముఁడతని ననుగ్రహించిన విధముఁ దెలిపి యిట్లనిరి.

**నాదనామక్రియ రాగము - ఆదితాళము**

రావయ్యో మాల యోబయ్యా - నీవు
రామభక్తుఁడ వని మే మెఱుఁగమయ్యా ॥రావయ్య॥

రాముని భక్తుఁడ వీవు-మే-మేమోయనుకొని యెగ్గాడినాము
మామీఁదఁ గోపింపవలదు-వట్టి-పామర జనులట్లు వర్తించి
నాము- ॥రావయ్య॥

వేకువజామునఁ గలను - శ్రీ
కాకుత్థ్సతిలకుఁడు కనిపించి నాఁడు
వే కొని రమ్మనినాఁడు-తమిని -
నీ కీర్తనలందె మది నిల్పినాఁడు ॥రావయ్య॥

పడమటి ముఖమైనాఁడు - మా -
దుడుకుతనమును నీవు - నెడనుంచఁ బోకు
గుడిలోనఁ జూడుము వచ్చి - యింత
వడికిఁ బూజలేదు మా మాట నచ్చి ॥రావయ్య॥

నీ వటరాకయె యున్న - మాకుఁ
బోవు - బ్రాణములెల్ల - బ్రతుకుట సున్న

దేవునిపై నాన యన్న - రామ
దేవుఁడు పస్తున్నఁ, దినుట యెట్లన్న ॥రావయ్య॥

భాసురముగ నీదు భక్తి - యల్ల -
వాసుదేవుని కెక్కెఁ - దక్కెను ముక్తి
రోసము మానుము రక్తి - నీ
వాసికి సరిరాదు ప్రహ్లాదు భక్తి ॥రావయ్య॥

అనిన నతఁడును ధైర్యము దెచ్చుకొని రామానుగ్రహమునకు నుబ్బి తబ్బిబ్బునై రాముఁడు పస్తున్నాఁడన్న మాటకు గళవళించి యొంటిమిట్టకుఁ బ్రయాణమై.

**గేయము**

రండీ పుణ్యాత్ములారా రామునిఁ గొలువఁగ
రండీ ధన్యాత్ములారా,
మెండుగ మనమందఱము - కో-దండరాముని భజన సేయుచు
గండుమీఱిన యమునిభటుల-గుండెలదరఁ జెండుదము ॥రండీ॥

గట్టి మనస్సు చేసి - మనమందఱము -
దిట్టలై మమతఁ గోసి -
పుట్టలుగ గుట్టలుగ - రట్టుమీఱి పెరఁగినట్టి
మట్టుమీఱిన పాతకముల - కొట్టికొట్టి నెట్టుదము ॥రండీ॥

సద్దులేని మతిని నిల్చి - సీతారాముల ముద్దుపదములఁ గొల్చి
హద్దుమీఱిన యమకింకరుల - గుద్దిగుద్ది చంపుదము ॥రండీ॥

దాసజనులఁ గావఁగోరి-ఒంటిమిట్ట - వాసుఁడై యశము మీఱి
వాసుదాసు నేలురాము - వాసిమీఱ భజియించుదము ॥రండీ॥

**గేయము**

ఒంటిమిట్టకుఁ బోవుదము – ఓ సాధులారా
పోవుదము రారయ్య – ఓ సాధులారా
మేము పోవుచున్నాము – ఓ సాధులారా
మీరును రారయ్య – ఓ సాధులారా
రాముఁ డందున్నాఁడు – ఓ సాధులారా
సీతమ్మతల్లి యున్నది – ఓ సాధులారా
ప్రత్యక్షదైవము – ఓ సాధులారా
దీనజనకల్పము – ఓ సాధులారా
కొంగుబంగారమ్ము – ఓ సాధులారా
తంగేటి జున్నయ్య – ఓ సాధులారా
పిలిచినఁ బలుకును – ఓ సాధులారా
ఒంటిమిట్టకుఁ బోవుదము – ఓ సాధులారా
పోవుదము రా రయ్య – ఓ సాధులారా
మీరును రారయ్య – పుణ్యాత్ములారా॥

అని కీర్తించుచు నృత్యముఁ ద్రొక్కుచు దేవాలయము నొద్దకు వచ్చి నిలిచిన నతని కర్చకుఁడు తోమాలె యర్పించి కొనిపోయి తూర్పుముఖముగఁ దిరిగిన స్వామిదర్శనంబు గావించె. అప్పటినుండి యతఁడు యథాస్థానంబున నుండి యావజ్జీవము భజియించుచు సాయుజ్యంబు ప్రాప్తించె. అతని వంశమువారు నేటికిని బ్రహ్మోత్సవకాలంబున నందు భజనము చేయుదురు. వారికి దేవాలయము నుండి వర్తనయుఁ గలదు.

**మ. అమలజ్ఞానసుదానధర్మరతిసత్యక్షాంతి నిర్మత్సర।**
**త్వములన్ యజ్ఞ తపోనసూయలఁ గడున్ దర్పించు ధాత్రీసురో।**
**త్తముకంటెన్ శ్వపచుండుముఖ్యుఁడు మనోర్థ ప్రాణవాక్కర్మముల్।**
**సమతన్ నిన్ను నయించెనేని నిజవంశ శ్రీకరుఁడౌఁ దుదిన్॥ భాగ॥**

# ఇమాంబేగ్ చరిత్రము

ఇమాంబేగ్, ఈయన కడపపట్టణమునకు నవాబుగా నుండిన తురుష్కుఁడు. కడప యనాదిస్థలమని యేర్పడుచున్నది. అనాదియైన కడప యిప్పుడు పట్టణముగా నుండు కడప కాదు. పరమలోభులై, మలభక్షకులై యెడ్లముడ్లు పొడుచుకొనుచు బట్టె గొడ్లవలెఁ గులాపశదులై యుండు నిర్భాగ్యపు రెడ్లుండునదియే తొలుతటి కడప. ఇప్పుడు పట్టణముగా నుండునది నూతనముగ నవాబులచే నిర్మింపఁ బడినది. వారి మహళ్లు లోనైన విటీవల నిప్పటి ప్రభుత్వమువారిచే రమారమి ముప్పది ముప్పదియైదు సంవత్సరములనాఁడు నిర్మూలింపఁ బడినది. శ్రీతిరుమల వేంకటాచలపతి యాలయమునకుఁ గడప యగుటచే దీనికి కీ నామము లభించెనందురు. వేంకటేశ్వరాలయమునకుఁ జుట్టు పదియామడ వేంకటేశ్వరరాజ్యమే. కావుననే దీనిని దేహళీపురమనియు బిలుతురు. తిరుక్కోవెలూరునకును దేహళీపురమను పేరు గలదు, దేహళియే దెల్హి (Delhi) వర్ణవ్యత్యయముచే నయి (కహ్లారము ప్రాకృతమునఁ గల్హారమైనట్లు) ఢిల్లీ యని యిప్పుడు వాడఁబడుచున్నది. దీనిని జనస్థానమున నేకదేశమనియు నందురు. దీన కుపబలముగ దలాయతులు వెండిబిళ్ళలపై (Kurpah) ఖరప యని వ్రాయఁ బడి యున్నది. ఖర పాలితము ఖరపము. టంగుటూరు లేబాక యందు ఖరేశ్వరాలయము గలఁదు. మఱికొందఱు కృపాచార్యు స్థానమగుటఁ గృప కరప యయ్యెనందురు. ఎట్లు చూచినను నిది యనాది స్థలమని యంగీకరింప వలసియున్నది. మహాభారతమున శల్యపర్వమున బలరాముఁడు సేవించిన తీర్థములను క్షేత్రములను జెప్పునపుడు శ్రీశైలము తిరుమల దర్శించి నట్టులుండుటచే నివి రెండును ద్వాపరయుగమందు నుండిన వనుట సిద్ధము. ఇది యాశ్చర్యము కాదు. జనమేజయ ప్రతిష్ఠిత దేవాలయములు కలియుగాది నుండి యున్నవన్నను జాంబవత్ప్రతిష్ఠితములు త్రేతాంత

ద్వాపరముల నుండి యుండవలయును. శ్రీశైలేశ్వరాలయము బౌద్ధనిర్మితము కదా యందురేమో బౌద్ధులెవ్వరు? ఏ దేశము నుండి వచ్చిరి? పూర్వ మున్న దానినే బుద్ధమతావలంబులు వాడుకొనుచు వచ్చిరి. కాని వారిందు నూతన సృష్టి చేయలేదు.

ఇమాంబేగను నతఁడు మహమ్మద్‌బేగ్ అను నతడు భిన్నులో యొకరో తెలియదు. ఒకరేయైన నీ కథ యెఱుఁగఁ దగినదే.

ఈ బేగ్ రాజ్యమునకు రాఁగానే తనపైఁ బద్యము చెప్పుటకు నొక కవీశ్వరుని బిలుచుకొని రండని సేవకుల కాజ్ఞాపించెను. ఈ వార్త తెలిసి తురకపై బద్యము చెప్ప నిష్టము లేక కొందరు, భయపడి కొందరు దాఁగిరి. అప్పుడొక తెంపరి నేనే కవీశ్వరుడనని పోయి నవాబునకు సలాము చేసి నిలబడెను. బేగ్ అతనిని జూచి నాపై బద్యము చెప్పుమని యాజ్ఞాపించెను. చిత్తమని యా కవీశ్వరుఁడు

**కం. ఖిల్లీ భల్లులులాయక,**
**భల్లుక ఫణి ఖడ్గగవయ బలిముఖ చమరీ**
**ఝిల్లీ హరి శరభ కిరికిటి,**
**మల్లాద్భుత కాక ఘూక మహమ్మద్‌బేకా.**

యని రెండుచేతులు చాఁచి జదివెనఁట. అందఱు మెచ్చుకొనిరి. కాని యందొకఁడు ప్రక్కనుండి యేమిరా నవాబ్ గారిని ఘూఖా (అమేధ్యము తినుమని) చెప్పెదవు యని యాక్షేపించెనఁట. అదిగాక పోయిన 'ఘీఖా' యని ప్రతిభాశాలి కవీశ్వరుఁడనెనఁట. 'ఘీఖా' యనఁగా నేయి తినుమని యర్థము. సెబాస్ సెబాస్ యని యందఱు మెచ్చిరి. అప్పుడు నవా బతనికి మంచి బహుమతి యిచ్చి పంపెనఁట.

ఈ యిమాంబేగ్ తటాలున హిందూదేవాలయములందుఁ దూఱి యా దేవుని పేరు పెట్టి పిలుచును. ప్రత్యుత్తరము వచ్చెనా సరి. లేకున్న నా

విగ్రహమును బీఁకి పాఱవేయును. ఇట్లు కొన్ని దేవాలయములు ధ్వంసము చేసి యొకనాఁడొంటిమిట్టకు వచ్చి తటాలున దేవాలయములోఁ దూఱి యర్చకులను బిలిపించి వాకిండ్లు దీయించి దేవుని యొద్దకుఁ బోయి రామా యని పిలిచెను. 'ఆఁ' యను ప్రత్యుత్తరము వెంటనే వచ్చెను. ప్రతిధ్వని ఇట్లురాదు గావున నెవరైన దాగియుండి తన్ను మోసము చేసిరా యని పరీక్షించి యిచ్చట దేవుఁడున్నాఁడని యప్పుడు తనపేర దేవాలయము క్రింద బావి త్రవ్వించి ప్రాకారముపై బురుజులు దిమ్మెలు కట్టించి ప్రతిదినము దీపములు పెట్టించుచుండెను. ఇప్పటికి నీ బావి ఇమాంబేగ్ బావియనియే యనుచున్నారు. వంకలో బావి యేర్పడువఱకు నీ బావి నీరే స్వామికిఁ దిరుమంజనమున కుపయోగింపఁబడుచుండెను.

* * *

# అయ్యలరాజు రామభద్రుఁడు

అయ్యలరాజను నొక సుప్రసిద్ధపురుషుని పేరే యీ వంశము వారందఱు తమ గృహనామముగా నుపయోగించుకొనిరి. వీరు విశిష్టాద్వైత బ్రాహ్మణు లని వీరిగ్రంథములవలనఁ దెలియనగు. నియోగి విశిష్టాద్వైతులు గోలకొండ వ్యాపారులు. ఈ వంశమున కాదిపురుషుఁ డయ్యలరాజు – ఆయన కుమారుఁడు తిప్పరాజు – ఆయన కుమారుఁడు పర్వతరాజు – ఆయన కుమారుఁడు అక్కయార్యుఁడు. ఆయన కుమారుఁడు రామభద్రుఁడు. ఈయన యించుమించు క్రీ.శ.౧౫౦౩ (1503) వ సంవత్సరమున జనించెను. అనఁగా నిప్పటికి ౪౨౨ (422) సంవత్సరములకు ముందీ యొంటిమిట్టయం దీ మహాకవి జన్మించెను. వీరిది పండిత కవివంశము. అందఱు మహాకవులే. అందు మన రామభద్రుఁడు తన స్వగ్రామ దైవతము నిష్టదైవమునగు శ్రీరామునిచరిత్రమునే రామాభ్యుదయ మనుపేర రచించెను. పండితులు కవులు జ్ఞానులు స్వగ్రామంబునఁ బూజింపఁ బడరు. వీరికి దేశాంతరమందే ప్రసిద్ధి. మలయపర్వతంబున శ్రీగంధపుఁ చెక్కలు ప్రొయ్యిలో నుంచఁబడును.

క. **తన యూరితపసి తనమును**
**దన పుత్రునివిద్య పెంపు తన సతిరూపున్**
**దన పెరటిచెట్టు మందును**
నని కలదుగదా సుమతివాక్యము.

ఈ కవి కవిత్వమహిమంగూర్చి వ్రాయ నిది సమయము గాదు. స్థలమును గాదు. ఒంటిమిట్ట సీతారాముల మహిమ ప్రదర్శించుట ప్రస్తుతము.

ఈ రామభద్రుఁడు శిశువుగా నున్నవేళ నొకనాఁటి యుత్సవ సమయంబున నీయన తల్లిదండ్రు లీయనను స్వామి దర్శనమునకై కోవెల

కెత్తుకొని పోయిరి. స్వామి దర్శనానంతరము ప్రాకారము లోపల జరగు నుత్సవముఁ జూచు వేడుకలో నా యిల్లాలు శిశువును మగనిచేతికిచ్చి వేడుక చూడఁబోయెను, వేగిరము రమ్మని భార్యకుఁ జెప్పి యాయనయు నా శిశువు నొక్కచోఁ పరుండఁబెట్టి యుత్సవము చూడఁబోయెను. స్వామి గోపురము దాఁటిపోవ వారును బోయిరి. తండ్రియొద్దఁ గుమారుఁడున్నాఁ డని తల్లి తలంచెను.

తల్లి తెచ్చుకొని యుండునని తండ్రి తలఁచెను. ఉత్సవము ముగిసెను. ఎక్కడివారక్కడికిఁ బోయిరి. రామభద్రుని తల్లి యిల్లు చేరెను. అప్పటికి మగఁ డింటికి రామిని శిశువు తండ్రి యొద్ద నున్నాఁడని యామె తలఁచి యూరకుండెను. ఆయన యెందెందో పెత్తనములు చేసి ప్రొద్దుపోయి యింటికి వచ్చెను. పిల్లవాఁడేఁడీ యని భార్య యడిగెను. నాకేమి తెలియునని భర్త చెప్పెను. మీ యొద్ద నిచ్చితిని గదా యని యామె చెప్పెను. నే నక్కడనే యుందును వేగిరము రమ్మనిన నీవు రాకపోయితివి. నీవు వచ్చెదవు కదా యని యచ్చటనే పండఁబెట్టి నేను వేడుక చూడఁబోయితిని. నీవు బిడ్డను దెచ్చుకొన్నావని యుంటినే తెచ్చుకొన లేదా యని మగఁ డడిగెను. లేదని మగువ చెప్పెను. అయ్యో నా బిడ్డగతి యేమాయెనో యని కన్నకడుపగుట తల్లి యేడువ నారంభించెను. నిశ్చేష్టితివలె నేమి తోచఁక మగఁడు నిలఁ బడి యుండెను. ఆ యేడుపు విని యిరుగు పొరుగు వా రేమి యేమని వచ్చిరి. వారు చెప్ప వృత్తాంత మంతయు వినిరి. దేవాలయములోపలఁ బోదమన్న గోపురము వాకిలి బీగములు వేసి యుండెను. ఇంటింట విచారించిరి. ఎందును శిశువు పోబడి తెలియలేదు. పిల్లవానిమీఁద నాభరణము లున్నకారణమున నెవరో సొమ్ముల కాశపడి శిశువును హరించు కొనిపోయి చంపియుందురని తలఁచి పలువురు పలుదిక్కుల వెదకిరి. ఎందును బాలకుని జాడ తెలియలేదు. అంతఁ దల్లిదండ్రులు నిరాశులై శ్రీసీతారాములే దిక్కని చక్క గోపురద్వారముఁ జేరి కన్నీరు మున్నీరుగఁ

గాఁ విపన్నులై యాపన్న రక్షకుఁడైన యాపన్నగతల్పు శ్రీరాముని, లోకమాత యైన సీతాదేవినిఁ గూర్చి యిట్లని స్తుతింపసాగిరి.

**సీతారామ తారావళి**

కం. శ్రీకాంతావల్లభ! యస్తోక దయారససముద్ర! శుభగుణ భద్రా
శ్రీకుశలవజనకా సు, శ్రీకరసుగుణాభిరామ సీతారామా!

కం. నీ కొడుకులు నీ కెట్లో, నా కట్టులు గాదె నాదునందనులు దమిన్
నా కొడుకు నాకు నిమ్మా! శ్రీకరసుగుణాభిరామ సీతారామా!

కం. నాకో యొక్కఁడె పుత్రుఁడు, నీకో పుత్రద్వయంబునిలుపఁ గులంబున్
నా కొడుకు నాకు నిమ్మా, శ్రీకరసుగుణాభిరామ సీతారామా!

కం. మృతుఁడైన విప్రసుతునిన్, బ్రతికించితివనుట నిక్కువంబగు నేనిన్
బ్రతికింపు నాదు పుత్రకు, శ్రితరక్షక సుగుణధామ సీతారామా!

కం. నీ సోదరులం జూడఁగ, నానగొనిన తల్లికొఱకునై శీఘ్రముగన్
నీ సోదరులం దేవే! శ్రీసఖ కల్యాణనామ సీతారామా!

కం. కాలుని బారింబడి యెడి, బాలుని బ్రతికింప లేక పార్థుఁడు వగవన్
లీలఁగొని తేవె శిశువున్, శ్రీలలనా చిత్తధామ సీతారామా!

కం. నీ కోవెల నే విడిచిన, నా కొడుకున కీవుగాక నాథుం డెవఁడో
నా కొడుకు నాకు నీవే, శ్రీకరసుగుణాభిరామ సీతారామా!

కం. శరణంబు నిన్ను వేడిఁనఁ, గరితురగ రథావళులనుఁ గనకపురాసుల్
గురియింతువు శిశునిమ్మా, స్థిరజీవితు సుగుణధామ సీతారామా!

కం. దత్తాపహరణ పాపము, మొత్తదె నిను నీ వొసంగి మున్నా శిశువున్
ఇత్తటి నీవే కొన, నీ చిత్తం బిఁక సుగుణధామ సీతారామా!

కం. బోయలు నీ మిత్రులు నిట, బోయలె నిన్ని లిపిరనుచు మునువింటినినీ
బోయమనంబును, శిశునెడఁ, జేయకు సుగుణాభిరామ సీతారామా!

కం. పావనములు ముక్తిసతీ, దేవనములు బ్రహ్మరుద్ర దేవావళి సం
భావనములు నీపదయుగ, సేవనములు సుగుణధామ సీతారామా!

కం. పాదంబులు నరకభయ, చ్ఛేదంబులు కమలగర్భ శితికంఠ హృదా
మోదంబులు భక్తజన, శ్రీదంబులు సుగుణధామ సీతారామా!

కం. గురుపుత్రబాణకీలా, పరిదగ్ధుం గాచినట్టి రహి నా పుత్రున్
బరిరక్షింపుము దేవా, చిరజీవిని జేయవయ్య సీతారామా!

కం. సాందీపని వేఁడినఁ ద, న్నందను బ్రతికింప లేదె నా సుతునట్లే
మందల నిడు మానందము, చెందింపుము సుగుణధామ సీతారామా!

కం. నీ కరములు భయహరణ గు, ణాకరములు తాపతప్త ప్రాణిహిమానీ
శీకరములు నతలోక వ, శీకరములు సుగుణధామ సీతారామా!

కం. నేత్రంబులు కరుణారస, పాత్రంబులు సాధుకోటి భవభయ లతికా
దాత్రంబులు సౌందర్య వి, చిత్రంబులు సుగుణధామ సీతారామా!

కం. భవహరుఁడనుచు నాతను, భవహరుఁడవు నైతె తండ్రి వారిజసుమసం
భవ హర నిత్య సమర్చిత, శివకర సుగుణాభిరామ సీతారామా!

కం. కొడుకును నా కర్పింపక, నడకొట్టితివేని నెవరు నా మది నిడ కం
గడిఁ బెట్టుదు నీ నడవడిఁ, జెడుగను సుగుణాభిరామ సీతారామా!

కం. ఇల్లాలిని గనుప్రొద్దుల, మొల్లపుసుకుమారినీవు మోసమ వనిలోఁ
దల్లడపడఁ ద్రోయింపవె, చెల్లంబో సుగుణధామ సీతారామా!

కం. అన్నియును విడిచి జీవం, బున్నంతకు నిన్నె కొలువ నొకతప్పునకై
మన్నిగొనఁ జూచి విడిచితి, చిన్నయనుజు సుగుణధామ సీతారామా!

కం. నీవు కొడు కౌటఁగాదె, దేవకి వసుదేవుఁడట్లు త్రిప్పులఁ బడి కా
రావసతిని గృశియించిరి, శ్రీవరసుగుణాభిరామ సీతారామా!

కం. ఏ సుఖముననుభవించిరి, కౌసల్యయు దశరథుండుఁ గానక కని ని
న్నా సుతు నట్టులు సేయుదె, శ్రీసఖ సుగుణాభిరామ సీతారామా!

కం. బుద్ధుఁడవై తలిదండ్రుల, నిద్ధగుణను భార్యఁగొడుకు నేడువ విడవే
సిద్ధుఁడ నయ్యెద ననుచుఁ బ్ర, సిద్ధగుణా సుగుణధామ సీతారామా!

కం. తప్పులు పట్టితినని నను, దెప్పకు దుఃఖంబు గదురఁదెగి తిట్టితి నా
యప్పా సైరింపుము దయ; చిప్పిల సుగుణాభిరామ సీతారామా!

కం. నాకు సుతభిక్ష నిమ్మా, కాకుత్థ్సకులాబ్ధి శీతకర! చాలు నయా
శోకము సైరింపఁగ నో, శ్రీకర సుగుణాబ్ధిసోమ సీతారామా!

కం. నా కొడుకు నాకు నిచ్చిన, నీ కీర్తి జగంబులందు నిత్యంబగు సీ
తాకమల లోచనా ప్రియ, శ్రీకరసుగుణాభిరామ సీతారామా!

కం. పాహి జగద్రక్షక! మాం, పాహినత త్రాత దేవవల్లభ నుత మాం
పాహి జగజ్జనక విభో! శ్రీహరి సుగుణాభిరామ సీతారామా!

**రాగము - కళ్యాణి - తాలు - చాపు**

శ్రీరామచంద్ర – శ్రీరామచంద్ర – శ్రీరామచంద్ర – శ్రీరాఘవేంద్ర
శ్రీరామరామ – శ్రీరామరామ – శ్రీరామరామ – శ్రీరామరామ
కమనీయశీల – కరుణాలవాల – కాంచనచేల – కమ్రకపోల॥శ్రీరామ॥
దశరథబాల – దశముఖకాల – దారితసాల – కరుణేందుఫాల ॥శ్రీరామ॥
రణజయశూర – మణిగణహార – మహితగంభీర – మానితధీర ॥శ్రీరామ॥
శతకామరూప – హతహరచాప – శితతరరోప – నతసురభూప ॥శ్రీరామ॥
మునిబాలుఁగాచి – మునిపత్నిఁబ్రోచి – మునిసవనముఁ గాచి దనుజుల వేచి ॥శ్రీరామ॥

వాలినిద్రుంచి – భానుజుమన్చి – వాయుజనెంచి వసుధఁ బాలించి
వనధిబంధించి – దనుజుల ద్రుంచి – జనకజఁగాంచి – సదయతమించి
కోసలనేలు – కౌసల్యబాల – కరుణ నీవేళఁ – గనుఁగొనుమిచాల
నియమముఁబట్టి – నీపదముఁబట్టి నీ పేరుపెట్టి నేనుగన్నట్టి ॥శ్రీరామ॥
నాపట్టినేఁడు – కానంగరాఁడు – నడువఁగలేఁడు – నయశిలవాఁడు
నాబిడ్డనిమ్ము నతులు గైకొమ్ము నామొఱవమ్ముగానీకు సుమ్ము ॥శ్రీరామ॥
నీకొడుకెకాని – నాకొడుకుగాఁడు – నీవేలకున్న – నింకెవరన్న
శ్రీరామభూప – శిథిలిత పాప – స్వీకృతచాప – చిన్మయరూప ॥శ్రీరామ॥
నీరదగాత్ర – కారుణ్యపాత్ర – సారసనేత్ర – సత్యచారిత్ర

## సీతాదండకము

'శ్రీభూమిపుత్రీ' జ్వలత్స్వర్ణగాత్రీ! నవాంభోజ నేత్రా! దయాపూర్ణాపాత్రా! లసచ్చారుహాసా! నమత్కృత్తివాసా! సుధాస్నిగ్ధచేలా! సుధాంభోధిబాలా! మణీహేమభూషా! దళద్భక్తదోషా! ధుతాంహోవిశేషా! రుచిశ్రీకవేషా! జగన్మాత! యో సీత! మా మాత! రక్షింపుమో తల్లి! సాధ్వీమతల్లీ శ్రితామర్త్య భూజాత వల్లీ! భవల్లీలఁ గొండాడ నేనెంత దానన్ మహాంహోనిదానన్ ముదానన్ ననుం బ్రోవవమ్మా రఘుస్వామి కొమ్మా సతీలోక శీలంబుఁ బుణ్యాలవాలంబు రక్షింప రక్షోవరుం ద్రుంప నైలింపముల్ వేఁడ వైదేహివై దేహివై నట్టి శ్రీరాముఁ జేపట్టి వన్యాళికిన్ మెట్టి లంకేశ్వరుందొట్టి రాకాసి మూఁకన్ విదారింపఁ గారింపఁగాజూడవే? చూఁడ వేతోఁక వాతాత్మజుం గూర్మిఁ గాపాడవే? పాడ వేల్పుల్ గుముల్ గట్టి గట్టిండి పల్గాకి యా కాకి నీ కాఁ కరంబున్ ఘటింపంగ సైరింపఁ గారాని కోపానఁ గారాని పాపంబు గావించు నాక్రించునుం ద్రుంపఁగాఁ బోచ రాముండు బ్రహ్మాస్త్రముం జేసి వైవంగనా నీచుఁడున్ బాఱి నాకీశ వాగీశ గౌరీశ లోకంబులందూఱి స్వర్నేతయాధాత యాపేత హాలాహలుండున్ నతత్రాతనేఁగాను నేఁగాను నేగాను శ్రీరాముఁ

డే, యా పరంధాముఁడే, మేచకేందీవరశ్యాముఁడే సర్వ కళ్యాణ సద్ధాముఁడే, నిస్తులౌదార్యగాంభీర్యసద్ధైర్యసుస్థైర్యనిస్సీముఁడే, యోగిచిత్తాంతరా రాముఁడే, పద్మినీరాముఁడే. పొమ్ము పొమ్మన్నఁ దావచ్చి నేఁ జచ్చితిన్ మర్గునేఁ జొచ్చితిన్ డ్రాత పంచాత్మలో నచ్చితిన్ నీదు పాదాబ్జముల్ గ్రుచ్చితిన్ గావవే యంచుఁ బాదంబులం బడ్డ మన్నింప వే? నింపవే ప్రేమమున్ బ్రాణ మిప్పింపవే? పంపవే కాటికిన్ రావణున్ లోక విద్రావణున్ నిన్ను బ్రుచ్చిల్లి కారించి నిన్వేఁడుకోకుంట; రేయెండ రేవెల్గు వేవెల్గు రీతిన్ సదాపాయకే నాథునిం గూడి యే యుందువో తల్లి నీక్షాంతి పెన్గుక్షి దానెట్టిదో యెన్ని యెవ్వారి యేదోష పుంజంబు లేనిన్ వెసం బ్రింగెడిన్ దత్క్షుధం దీర్పఁ జాల్ దోష పుంజంబు లోకంబు, లెన్నైనఁ జేయంగదానోప వౌ రౌర! నీ ప్రేరితుండై గదా యగ్గదాధారిలీలావిభూతిన్ సృజించున్ ధరించున్ హరించున్ జగన్మాత నీనేత యేరూపముం గొన్న నారూపము న్నీవు కైకొంచుఁ దత్కార్యముం జేయ సాహాయ్యముం జేయునం దౌఁ గదా? నీవ యీశాన వీభూత సంజాతమున్ బ్రోవఁగాఁ ద్రోవఁగా; నన్ను రక్షింప నీకేమి భారంబ! యో యంబ! యా విప్రు కోపంబు దుర్వాసు శాపంబు నీ నాథు రోషంబు నట్లే యమోఘంబు దానౌచు నీ చూపు నీ ప్రాపు నీ ప్రోపునుం బాప నాకాలయం బాలయంబైన నందున్న యేబ్రాసులం బ్రాశిఁ జిల్కంగ నీ వందు జన్మించి నాకంబు శ్రీకంబుగా జేయవే మాత? కారుణ్యపూతా సుధాంబోధిసంజాత నీ మూర్తి మంతంబు స్త్రీజాత, మంతంబు లేదమ్మ నీ దివ్య మాహాత్మ్యముం జూడ నీవేకదా శ్రద్ధయుం బుద్ధియున్ విద్యయున్ హృద్యయున్ భూతియున్నీతియున్ ధన్యవున్ మాన్యవున్ దేవి దండంబులో తల్లి జోహారులో యమ్మ సాష్టాంగముల్ మాత వేయేటికోళ్ళంబ మాంపాహి శ్రీరామపత్నీ నమస్తే నమస్తే నమః

ఇట్లు దంపతులు స్తోత్రంబు చేయుచుండ నరుణోదయంబయ్యె. కాలచర్యాభిజ్ఞులైన యర్చకులు రామతీర్థంబున కేగి స్నాతులై మడుఁగు

ధోవతులు కట్టి ద్వాదశోర్ధ్వ పుండ్రంబులు ధరించి జలపాత్రంబులఁ గేలధరించి ప్రాతరభిగమనకార్యంబు దీర్పఁ జనుదెంచుటయు గోపుర ద్వారంబులు తెఱచిరి. మేళగాండ్రు మంగళవాద్యధ్వను లెసగించిరి. స్నాతులై పవిత్రులై వచ్చిన బ్రాహ్మణు లిట్లు సుప్రభాతంబు పాడిరి.

## శ్రీరామసుప్రభాతములు

### శ్లోకములు

జయజయ వాసుదేవ రఘునాయక జాగృహి భో
    వికసతి పఙ్కజాలి రుదయ త్యహిమాంశు రయమ్।
అరుణకరాను రాగభరితం మఘవత్కకుభో
    ముఖమనులిప్త కుఙ్కుమ మివాద్యముదం తనుతే॥ 1

దరవికసత్పయోజముఖ నిర్య దలిప్రకర
    ప్రభమిదమీక్షణ ద్వితయ మీశ్వరతే భవతు
సనకసనందనాది మునిపఙ్క్తిరియం పురతః
    పఠతి తవ స్తవం రఘుకులేశ్వర జాగృహి భో. 2

సమయ మియస్త మీశ శశినా పరితస్ఫురితం
    భవతు పురంపు నర్ధశశతాంశు వికాసవిధిః
యది సమమీక్షణ ద్వితయ మీలనమఙ్గకథం
    జగతి దివానిశా వ్యవహృతి ర్భగవన్ ప్రచరేత్ 3

కుశికసుతో మునిర్వదవ దప్రతిబోధ కృతే
    తవరఘునాథ పత్రపరిపాలన కామతయా
తదిదముపస్థితం దిన ముఖం ననుతే భగవం
    స్తవవరివస్యనే సకుతుకా స్సకలాహి జనాః 4

నలినీసమ్ప్రతిభాను బింబ ముదయక్షోణీధ్ర మూర్ధోద్గతం
పరితోషాదరవిన్ధ కుట్మల మయాంజల్యుద్గమైర్నందతి
పరితః కిఞ్చమధువ్రత తిభిర్బన్గచ్యు తైర్గుంజిత
చ్ఛలిత స్తోత్రపరాయణైర్దశశతాభీశుస్సమాభాష్యతే. 5

శయ్యోత్థాయం గురుజన మనుచ్ఛాత్ర వర్గోయదత్ర
శ్రద్ధాపూతః ప్రణతి సుభగ స్సంహితాయామధీతే
తత్తచ్ఛాఖాశ్రయణ రసిక స్సాధు వాదీ ద్విజౌఘ
శ్శ్రీమన్నిత్యం శుకపికముఖ శ్శ్రూయతామద్గృణాతి. 6

శ్రద్ధాశుద్ధమనాః ప్రకామ వినయవ్యాక్షిప్త చేతాస్తవ
శ్రేయాన్ భృత్యజనస్స్వకాల్యకరణీయా పూరణేసత్యపి
త్వత్కైఙ్కర్య ముదీక్షమాణ ఇహతేద్వారే సమాసీదతి
చ్ఛత్రాదర్శముఖైశ్శు భోపకరణై రేవంసమానన్దయ. 7

పరిజనవనితానాం చామరాందోలనేషు
క్షరతివిరల బన్ధః ప్రాక్తనః పుష్పహారః
ప్రసభమయమశేషాం యామినీం జాగరిత్వా
గలితరుచి రుదాస్తే కాలయోగాత్ప్రదీపః 8

పరిణఫలబుద్ధ్యా బాల్యలౌల్యా త్పురాయం
గ్రసితుమకృతచిత్తం కిఙ్కరస్తే హనూమాన్
తమిహనియతవాసం పశ్యవస్తీ ప్రభావో
ర్ధృతిముపజనయత్వం రాజసింహ ప్రబుద్ధః, 9

సంసారశ్రాన్తిహారీ సరసిజనిలయా దత్తహస్తావలమ్బః
కుర్వాణః కాన్దిశీకం చిరతరదురితవ్రాత మున్మీలితశ్రీః
తన్వన్మోక్షాభిషేకం సకలసుచరితస్థాన దత్తావధానః
ప్రహ్వేషు ప్రేమపూర్ణః ప్రసరతు భగవన్ సమ్భ్రమా త్త్వత్కటాక్షః 10

ఉత్తిష్ఠోత్తిష్ఠనిద్రాంజహిహిజగదధీశానరామాభిరామ
శ్రీమన్ సౌరాన్వవాయోజ్జ్వల వినతజనే దేహి దృష్టిం దయార్ద్రామ్
యద్యప్యేషాన్ధకారంబహిరుపచితమున్మూలయన్ భానురావి
ర్భూతోనైతేనశక్యం మమహృదయ గుహా ధ్వాన్తజాతం నిహన్తుమ్ 11

తం వానరం తవగుణానుభవై రనిద్రం
దేవీం విదేహతనయాం ప్రథమ ప్రబుద్ధామ్
అస్మానబోధనిహతాంశ్చ దృశాం విలాసై
రానన్దయస్వ సుఖ సుప్త పరన్తపస్త్వమ్. 12

ఆదర్శదున్దుభిపయోరుహ శఙ్ఖదోర్గ్రీ
రున్మాద భాజఇహమాదృశచేతనాంశ్చ
పూర్వాప లోకనకృతే తవ సన్నిధాప్య
సజ్జం త్వదీయజన మాశు సమర్థయత్వమ్. 13

తాలానుసారి తతయోగిమనోజ్ఞగీతం
జైత్రాపదానసుభగం శ్రవణైకపేయమ్
త్వద్వన్దినః పరిపఠన్తిహి కర్తకణ్ఠా
స్సమ్భావయ త్వ మనఘాన్ రఘుపుఙ్గ వేమాన్ 14

నిదానం సిద్ధీనాం నిరవధిచిదానన్దసుభగం
ప్రదానం సాధూనాం ఫలమనుపమానం దమవతామ్
విధానం విద్యానాం తవచరణపఙ్కేరుహయుగం
నిధానం న స్స్వామిన్ ప్రదిశవిసృజస్వాపమధునా 15

రక్షోరాజ స్త్రీలోకీపరిభవనచణో రావణ స్సానుబన్ధం
నాశం నీత స్స్వకృత్యం కృత మితి సుహితం హస్త నిద్రాసి దేవ
యేబాధన్తే సదా నః ప్రియతమభవతో దాసభూతా నజయ్యా
స్తత్తేషాం నిప్రహన్తుం విజహిహిభగవన్ స్వాపమేషోఽఞ్జలిస్తే 16

అమ్భోజాసనపాకశాసనముఖాస్సాకంహరాద్యైస్సురై
స్త్వత్సేవారసయన్త్రితేన మనసా మన్దారపుష్ప స్రజః
తం చిన్తామణిదర్పణం సురగవీదుగ్ధం హరే శ్చన్దనం
చానీ యావసరార్థినః పరిగతా స్తేషాం దయస్వప్రభో 17

ఏతే శ్వేతమృదూర్ధ్వపుణ్డ్రతిలకై శ్శ్రీచూర్ణ రేఖారుణై
రఙ్గద్వాదశకం విధాయ రుచిరం పద్మాక్షమాలాంచితాః
బాహోస్తప్తరథాఙ్గశఙ్ఖకిణితా స్త్వద్ధ్యానపూతా జనాః
త్వాముఞ్చన్తిసహేదృశైర్గృహజనై రేనా న్నమానన్దయ 18

యేపుష్పాఙ్కురకోరకై స్సహ భవద్విశ్లేష కాలేపురా
తాన్తిం ద్రాగలభన్త హన్తతరవస్తే సామ్ప్రతం సన్నిధౌ
ఉన్మీలత్కుసుమోత్కరైః కిసలయై రుద్గాయమానైర్ముదా
భృంగై స్త్వాముపసేవితుం కుతుకినో నిద్రాంజహీహిద్రుతమ్ 19

అద్య శ్రేయోనిధానా యితజనచరితం బ్రహ్మబృన్దం యధేదం
చోరంకారం నికారాస్పదమ భవదుదీర్ణైర్జనైః కింపచానైః
ఏవంతీవ్రాంశు యాత్రావసరపరిగతైః కైరపి క్షిప్త మేత
త్థానాద్భ్రష్టం పురస్తా త్తవపతతి తిరఃపశ్యసప్తర్షి చక్రమ్ 20

నారాయణస్య నతరక్షణదీక్షితస్య
బ్రహ్మాది దేవమహితస్య విభిన్నశత్రోః
పృథ్వీసుతాసహచరస్య సలక్ష్మణస్య
భూయా త్సదా భగవత స్తవ సుప్రభాతమ్ 21

ఏకాం శిలా మధిగతస్య నతార్తినాశ
దక్షాస్థిరత్వపిశునాం గుణరాశిసిన్ధోః
అవ్యాజముగ్ధమధురామృతసాగరస్య
భూయా త్సదా భగవత స్తవ సుప్రభాతమ్. 22

ఉద్బుద్ధముగ్ధసరసీరుహలోచనస్య
దోర్దణ్డచణ్డిమహతాఖిలశాత్రవస్య
సంసారతారక పదార్థతయాకుమార
తాతాశయస్థితిజుషస్తవ – సుప్రభాతమ్. 23

నస్వాధ్యాయో నదానం నచ నియమకథా నవ్రతం నోపవాసః
కావార్తా వృత్తశౌచాదిషుకలికలుషే చేతసి శ్రేయసాంచ
సత్యేవం హన్తదీనాః కతిచనవివశాస్సాధవ స్తాం సమస్తా
నస్తాశఙ్కంనిరస్తాన్ బహుపశుభిరయేనాథ నిస్తారయత్వన్ 24

ఘోరే వాలిని సాగరే దశశిరో రక్షస్యరాతివ్రత
ద్వేషా త్తే విశిఖాః పురా పరిభవారమ్భం వితన్వన్తియే
తేజోషం కుతేవ మాదృశహతాత్మారై కసారే భవే
తిష్ఠన్తీతి న వేద్మి నాథ కిమివై తస్మిన్ననుష్ఠీయతామ్ 25

జయజయజానకీరమణ జన్మజరామరణ
శ్రమహరణ ప్రవీణభవతారకకారణభో
జయజగతీకుటుమ్బజయశమ్భుకృతార్హణమాం
నయపరమంపదం జయతు తేమహతీకరుణా.

కుర్యాం మానసపూజనం రతియుత స్తాన్తిం నస మ్భావయే
తేనైవామృతపారణాంహృది దధే రామేతి వర్ణావలీమ్
చిత్తమ్మత్త మిద మ్మమాస్తు బలవన్న్యస్తం దయావారిధౌ
రామే వారిదకాన్తకాయ సుభగే భీమే విరామేద్విషామ్

ధర్మం కేచన కేచిదర్థం మపరేభోగం పరేమోక్షమ
ప్యాతిష్ఠన్తి పుమర్థ మీశన వయం త్వద్దాస్య నిష్ఠా
ఆతిష్ఠేమహి ధర్మమర్థ మఖిలం భోగంచ మోక్షం భవ స్తథా
త్వాదామ్భోజనిషేవణం తదపిన స్త్వత్ప్రీతి సమ్పాదనమ్

కౌసలేయ దయాసిన్ధో సుప్రభాత మిదంతవ
వాసుదేవపరాణాం స్యాత్సిద్ధయే సర్వసమ్పదామ్.

ఇతి ప్రాబోధిక స్తుతిః కవిభూషణస్య.
సమాప్తమ్.

శ్లో॥ కౌసల్యాసుప్రజా రామ, పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికమ్.

శ్లో॥ వీరసౌమ్య విబుధ్యస్వ, కౌసల్యానందవర్ధన
జగద్ధి సర్వం స్వపితి, త్వయిసుప్తే నరాధిప.

**ఉత్పలమాలా పద్యములు**

వేకువ యయ్యె నో జనని! నిచ్చె సరోరుహపాళి యియ్యెడన్
బ్రాకటమందమారుతము పద్మమరంద సుగంధవంతమై
శ్రీకరలీల వీచెడిని జెచ్చెర లెమ్ము శుభమ్ము లిమ్ము మా
యేకశిలావిహారిణి మహీసుత! మేల్కొనవమ్మ జానకీ 1

లోకచయంబు లన్నిటికి లోలవిలోచన తల్లి వీవు, నీ
వే కద సృష్టికిన్ స్థితికి హేతువు విశ్వజనంబు నీ కృపా
లోకనపాత్రమై ధరవెలుంగఁగఁ జిర్నగుమోముఁ దమ్మితో
నేకశిలావిహారిణి మహీసుత! మేల్కొనవమ్మ జానకీ 2

ప్రాకట హేమపాత్రములఁ బద్మభవేంద్ర గిరీశ కాంత ల
స్తోకపరీమళాన్వితము శుభ్రము నభ్రనదీజలంబు శ్ర
ద్ధాకలితాంతరంగములఁ ద్వత్పదముల్ కడుగంగ గోరి రో
యేకశిలావిహారిణి మహీసుత! మేల్కొనవమ్మ జానకీ 3

నీ కరుణాకటాక్షములు నెమ్మిఁదమున్ స్పృశియింపఁగోరియా
నాకప సత్యపేశ్వరులు నారదుఁ డాదిగ దివ్యమౌనులున్

వాకిట నిర్నిమేషలయి భక్తిc గృతాంజలులొౌచు నిల్చిరో
యేకశిలాధినాథ విబుధేశ్వర మేల్కొనవయ్య రాఘవా. 4

నాకనదీసుజాతము మదాళి సమావృతమైన నీరజా
నీకము గౌతమాదికముని ప్రవరుల్ గొనివచ్చి యిచ్చమై
నేకమతిం ద్వదంఘ్రియుగ మిప్పుడ యర్చనసేయ నిల్చిరో
యేకశిలాధినాథ విబుధేశ్వర మేల్కొనవయ్య రాఘవా. 5

నీ కథలన్ దిశాపతులు నీలగళుండు సతీసమేతులై
వాకొనుచున్నవారు బహుభంగుల, వాసరశుద్ధిc దెల్ప వా
ణీకమనుండు వేచెడిని, నీరజబంధుcడు నిల్చెc దూర్పునం
దేకశిలాధినాథ జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 6

కోకిల కంఠికామణులు కుల్కకుచంబులc బుర్దచిల్కన
స్తోకఘుమం ఘుమారవము, తోరపు గానరవంబు, లేcగలం
భాకరణంబు నేకమయి పాఱcగదోలె జనాఘసంచయం
బేకశిలాధినాథ జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా 7

శ్రీకరవారకామినులు చెల్వున గీతము లభ్యసింప వీ
ణాకలి తాత్మహ స్తలయి నవ్యముగా శ్రుతిగూర్చి పాడగాc
గోకిల షట్పదావళులు గుంపులుగాc వcడి బాఱుదెంచె నో
యేకశిలాధినాథ జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 8

వేకువ రామతీర్థమున విప్రజనంబులు సంధ్యవార్చుచున్
బైకెగజల్లు నర్ఘ్యముల పావననీరము లడ్డువాప ల
క్ష్మీకలితంబుగాగ సరసీరుహముల్ చనుదెంచె భాస్కరుం
దేకశిలాధినాథ యవనీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 9

జేకరుణానిధే వరద శేఖర జే రఘువీర జే హరే
జేకువలేశ జే దనుజశిక్షణ దక్షక జే ముకుంద జే
జే కమలాప్రియా యనుచు జేజెలు సంస్తుతి చేయుచున్న వా
రేకశిలాధినాథ జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 10

ఏకటవాయ జంబుపనసేక్షు రసంబులు ఖండశర్కరల్
శ్రీకదళీఫలంబులును లీలభుజించియుఁ గీరవారముల్
ప్రాకట రామనామరుచి రాదని చాటుచు నున్న విప్పుడో
యేకశిలావిహార జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 11

శౌకము లిప్డు వేకువను జారురవంబుల రామరామ నాఁ
బైకములేటికో చెదరిపాఱెడి దిక్కుల వెంట లోకులా
రా! కలుషంబు లిట్లరుగు రామునిఁ బేర్కొననంచుఁ దెల్పనో
యేకశిలావిహార జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 12

వీకున నోంకృతిం దెలుపువేలు పెవం డతఁడెందుఁ గల్గనో
లోకములోన నంచు సురలున్ మునులున్ గడురోసిరోసి తా
రీకడఁ గాంచినార మని యెంతయుఁ బొంగినుతించుచున్నవా
రేకశిలావిహార జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 13

భీకర రాక్షసాంతక! విభీషణ సాధుశరణ్య! దేవ! ద
ర్వీకరభోగతల్ప పృథివీవర సన్నుతదీననిర్జరా
నోకహ ధారణీసుతమనోహర హైమవతీశ సన్నుతా
యేకశిలావిహార జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 14

వేకువ రామతీర్థమున వేల్పులపిండు కృతావగాహమై
జోకఁగ గోపురాగ్రమును జూచి నమస్కృతిచేసి భక్తిమై

నీకడఁ జేరి మూర్ధమవనీతలమున్ స్పృశియింపమ్రొక్కెడిన్
ఏకశిలావిహార జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 15

ప్రాకట హోమపాత్రమునఁ బావనగాంగజలంబుఁ బూని సీ
తాకమలాక్షియున్, విమలదర్పణముల్ తమ కేలఁగ్రాలఁగా
నాకసతుల్ త్వదీయచరణంబుల చెంతల నిల్చి వేచినా
రేకశిలావిహార జగదీశ్వర మేల్కొనవయ్య రాఘవా. 16

మైకొని యెవ్వడేనియు క్షమాతనయాధవ సుప్రభాత మ
వ్యాకులచిత్తుఁడై యహరహమ్మును బాడిన వేగుఁబోకటన్
బోకల రాకలన్ విడిచి పొందు నిరంతర భోగమోక్షల
క్ష్మీక మనన్యసాధ్య రఘుశేఖర దివ్యకృపాప్రసాదమున్. 17

అర్చకులు కుంచెకోలల గర్భగృహద్వారంబులు తీసిరి. సేవకులు కరదీపికలతోడ రా నర్చకుండు స్తోత్రానుసంధానపూర్వకంబుగలోఁజనిలో ప్రదక్షిణం బిరుమారుగావించి యుత్తరశిరస్కుండై దండప్రణామంబు లాచరించి లేచి లోనికిం జని వీక్షింప సీతాదేవి పొదిగిట వామస్తనంబున నోరుంచి యుండు నొక బాలకుం గని యిది ఏమివింతయని తోడివారికిం జెప్ప వారును జూచి యబ్బుర పోయిరి. ఈ వార్త పురంబునందెల్ల వ్యాపించె. గుంపులు గుంపులు గట్టి జనులు వచ్చి చూడసాగిరి. స్నానంబు చేసి వచ్చి ప్రాయోపవేశంబు గావింతమని స్నానార్థులై రామతీర్థంబున కేగిన యా పుణ్యదంపతు లీ వార్తవిని తడి పుట్టంబుల తోడ పరువుపాఱి వచ్చిరి. ధర్మకర్తవచ్చి యర్చకునిచే బాలుఁ దెప్పించి చూడ నతఁడు నష్టుఁడైనట్టు తలంపఁ బడిన రామభద్రుఁడే యగుట నతనిని దల్లిదండ్రుల కప్పగించిరి. వారును నానందాశ్రుల బాలుని స్నానంబుఁ జేయించిరి. బాలుం డాఁకలి గొనెనని తల్లి శిశువునకు స్తన్యమియ్యం బూనెఁగాని యతండు త్రావండయ్యె.

సీతాదేవి చనుఁబాలు కడుపారఁ ద్రావినవాఁడగుట నతనికిఁ బొట్ట యుబ్బియుండె. రాత్రియంతయు సీతాదేవియే స్తన్యమిచ్చి బాలు రక్షించెనని సీతాదేవి మహిమయు బాలు నదృష్టంబును నతని తల్లిదండ్రుల పుణ్యంబును వేనోళ్ళఁ బొగుడుచుఁ బ్రజలు తమ తమ నివాసంబుల కేగిరి. ఈ చరిత్రం బిప్పటికిని ప్రజలు చెప్పుకొనుచున్నారు. కావుననే యొంటిమిట్ట సీతాయి సంతానదాయి యనియు సమస్త శుభవిధాయి యనియును భక్తులు సేవించి సంతానంబును బడిసి మ్రొక్కుబడులు నేఁటికిని జెల్లించి పోవుచున్నారు. ఈ విషయమే యాంధ్రవాల్మీకిరామాయణమున నిట్లు చెప్పఁ బడియె.

**ఉ॥ అమ్మక! కోవెలందుఁ దన యమ్మయు నొంటిమి వీడిపోవ రే**
**వమ్మిన యాఁకటన్ శిశువు పాలకు నేద్వఁగ, నాలకించి తా**
**నమ్మగ స్తన్యమిచ్చిన దయామయి నన్గన వమ్మ! యమ్మ! సీ**
**తమ్మ భయక్షుధార్థితుని నయ్యలరాజు కులోద్వహుంబలెన్.**

* * *

# బమ్మెరపోతనామాత్యుఁడు

బమ్మెరపోతనామాత్యునకే బమ్మెరపోతరాజని పేరు. బాలురును బశుప్రాయులై వర్తించు స్త్రీపురుషులును దప్పఁ దక్కిన యాంధ్రులలో నిమ్మహాత్ముని పేరెఱుంగని వారుండుట యరుదు. అట్టివాఁ డుండియు లేని వాఁడే. శ్రీభాగవతమును దెనిఁగించిన మహాకవి యితఁడే. పూర్వులు రచియించిన మహాభారత శ్రీమద్రామాయణములచే సంతృప్తి లేక నూతనముగ నా గ్రంథముల రచించువారు గలుగుదురుగాని శ్రీమద్భాగవతమును బద్యములుగఁ దెనిఁగింప సాహసించు బుద్ధిహీనుఁడు పుట్టఁడు. తన బవిసి యార్చుకొనఁ దలఁచినవాఁడే యట్టి కార్యమునకుఁ బూనుకొన వలయును. పూర్వమహాకవులందుఁ జంద్రునియందుఁ గలంకము వలె నేదోయొక దోషము చెప్పువారు గలరు. గాని పోతరాజు నందు నిందమోపిన నోరఁ బురుగులు పడునని భయపడుదురు. ఆయన యంతటి నిష్కల్మష చరిత్రుఁడు. పరమ పవిత్రుఁడు కవులం దరుదు.

ఈయన కవిత్వమహత్త్వము ప్రకృతవిషయముగాదు. ఈయన భక్త్యతిశయము శ్రీరాముల వాత్సల్యాతిశయము మాత్రమే యిందుఁ జెప్పఁ బడును.

ఈయన నియోగిబ్రాహ్మణుఁడు. కౌండిన్యగోత్రుఁడు. ఇంటిపేరు బమ్మెరవారు. నివాసస్థలము కడప మండల మందా యూరికి దక్షిణమున నుండు నొంటిమిట్ట. *ఈ పోతనామాత్యుని వంశమువారమని చెప్పుకొను వారును నీయన తమ మేనమామ వంశమువారి పూర్వుఁ డని చెప్పువారును నేఁటికిని నెల్లుగుంట్ల గ్రామ సమీపమున నుండు కోడూరు గ్రామమందును, రాచవీటి తాలూకా గోపగుడిపల్లె గ్రామ మందును గలరు. కోడూరు గ్రామకరణ మెల్లప్పగారు పోతనామాత్యుఁడు తన మేనమామ వంశమువాఁ

* ఆ విషయమైన పూర్వపక్షసిద్ధాంతములు పోతన నికేతనచర్చ పోతరాజ విజయమను గ్రంథంబులఁ జూడనగు.

డని చెప్పుచున్నవారు. పోతనామాత్యవంశము వాఁడై యిప్పటికి మూఁడుతరములకు ముందుండిన కవి వ్రాసిన సూక్ష్మతనూవిద్యావిలాసమును నేను జూచితిని. నేను జూచినది కాగితములపై వ్రాసిన ప్రతి. తాటియాకుల మూలగ్రంథ మీయన యింట దేవతార్చన పేటి యందున్నది. ఈ గ్రంథము ప్రతులు నందందున్నవి. ఈ గ్రంథకర్త తాను బోతన వంశమువాఁడనని వ్రాసియున్నాఁడు. ఈ గ్రంథము గుఱించి కడపలో జరిగిన సభయందు విస్తరింపఁబడెను. ఈ విషయమంతయు బ్రా॥ శ్రీజనమంచి శేషాద్రిశర్మగారి దత్తమండల కవుల చరిత్రమందుఁ గననగు. వారు వ్రాసిన దానినిమరల నేను వ్రాయుట భావ్యము గాదని దిక్ప్రదర్శనముగఁ దెలిపి విరమించితి. ఈ మేనమామ గారి వంశములోఁ జేరిన యామెయే యొంటిమిట్ట యందుండి ౫-౬ సంవత్సరములనాఁడు మరణించెను. ఈ పోతనామాత్యుఁడు నేటికి ౫౪౭ (547) సంవత్సరములకు ముందు క్రీ.శ. ౧౩౭౮ (1378) వ సంవత్సరమున జన్మించెను. ఈయన తల్లిదండ్రులు చాల నిరుపేదలు. ఈ కుమారునికిఁ జదువు చెప్పింపను శక్తిచాలక బాల్యమందుఁ బసులమేపఁ బంపుచుండిరి. చిన్ననాఁడు నేర్చిన వీధిపల్లెకూటపుఁ జదువేగాని యంత కెక్కువ రాకుండెను. ఉదయమున గొల్లపిల్ల వాండ్రతోడ నూరికి సమీపమున నుండు గుట్టలకుఁ బసులఁ దోలుకొనిపోయి మేపుకొని ప్రొద్దుగుంకువేళకు నింటికి వచ్చుచుండెను. ఈ విషయమునఁ దన యనుభవమునే యీయన కృష్ణపరముగ నిట్లు వర్ణించెను.

సీ. **కడుపున దిండుగాఁ గట్టినవలువలో, లాలిత వంశనాళంబుఁ జొనిపి**
**విమలశృంగంబును వేత్రదండంబును, జాఱిరానీక డాచంక నిఱికి**
**మీగఁడపెరుగుతో మేళవించిన చల్ది, ముద్దడాపలిచేత మొనయనునిచి**
**చెలరేఁగికొసరితెచ్చిన యూరుఁగాయల, వ్రేళ్ళసందులయందు**
**వెలయనిఱికి.**

**ఆ. సంగడీల నడుమఁ జక్కఁగఁగూర్చుండి, నర్మభాషణముల నగవు మెరసి**
**యాగభోక్తకృష్ణుఁ డమరులు వెఱగంద, శైశవంబు మెఱసి చల్దిగుడిచె.**

**సీ. మాటిమాటికి వ్రేలుమడఁచి యూరించుచు, నూరుఁగాయలు దినుచుండు నొక్క**
**డొకని కంచములోని దొడిసి చయ్యనమ్రింగి, చూడులేదని నోరు చూపునొక్క**
**దేవురార్గురచల్దులెలమిఁ బన్నిదమాడి, కూర్కొనికూర్కొని కుడుచునొక్కఁ**
**డిన్నియుండఁగఁ బంచియిడుటనెచ్చెలితన, మనుచుబంతెన గుండులాడు నొకడు**

**ఆ. కృష్ణుఁజూడుమనుచుఁగికురించిపరుమోల, మేలిభక్ష్యరాశిమెసఁగునొకఁడు**
**నవ్వునొకఁడు సఖులన్వించునొక్కఁడు, ముచ్చటాడునొకఁడు మురియు నొకడు**

ఇట్లు పసుల మేపుచుండు సమయంబున నొకనాఁ డాయన పూర్వజన్మ తపం బాకారంబు గొనివచ్చెనో యనఁ జిదానంద యోగీశ్వరుండు చనుదెంచి యబ్బాలకు నుపలక్షించి బాలకా! నీ కొకమంత్రం బుపదేశించెద. దానిని విడువక జపింపుమనినఁ బ్రాగ్జన్మ సుకృత వశంబున లభించిన సుగుణసంపత్తిగల యా బాలకుండు వినయ వినమిత శిరస్కుండై నమస్కరించి మహానుభావా! మీ యానతి చొప్పునఁ దప్పక నడచుకొనెదనని విన్నవించిన నతని గుణంబులకు సంతసించి యమ్మహానుభావుండు షడక్షర శ్రీరామతారకం బుపదేశించి దీనిని విడువక జపించితి వేని నీకు మహా శ్రేయస్సు ప్రాప్తించు నని మాయ మయ్యె. అధికారియగు శిష్యువెదకుచు గురువే యరుదెంచును గదా. ఇప్పటికిని నప్పర్వతప్రాంతంబులనుండు వారొక్క మహాపురుషుండు జటామండలధరుం డెప్పుడేని గోచరించునని చెప్పవింటిని. ఇందందు గుహలును గలవు. కొన్నిటి ముఖద్వారంబు లిప్పుడు శిథిలములై యున్నవి.

ఇట్లు జన్మతారకంబైన తారకం బుపదేశంబుగొని శ్రద్ధాభక్తియుక్తుండై దాని ననవరతంబు జపింపఁ దన్మాహాత్మ్యంబున జ్ఞానభక్తివైరాగ్యంబు లుదయించి క్రమక్రమాభివృద్ధింగాంచుచుండె.

పశువులను దోలుకొని పోవునపుడును, మేపునపుడును, దోలుకొని వచ్చునపుడును, నోరుకాయగాయఁ దన్మంత్రంబె జపించుచు నాయన

నడుమనడుమ దానియర్థంబు స్మరించుచుండు. దీనివలన శ్రీరాముఁడే నారాయణుఁడు భగవంతుఁడు వాసుదేవుఁడు సర్వజ్ఞుఁడు సర్వశక్తి సర్వవ్యాపి సర్వాంతర్యామి సర్వరూపి యని గ్రహించి దానినే యధ్యవసాయంబుచే దృఢపరచుకొనుచుండె. *ఇట్టి యాలోచన సేయు సమయంబున నొక్కొకసారి నిద్రాతివలె నిలఁబడి యాకాసమును భూమిని జెట్లను గుట్టలను బసులను బక్షులను నన్నిటిని యథాదృష్టిఁ బాఱఁజూచుచుండును. చెట్లును జూచిన దీని పట్ట చెక్క యాకులు లోనగునవి యన్నియుఁ బ్రకృతిపదార్థములే కదా? ప్రకృతియే యిట్లు పరిణమించెను. ప్రకృతి జడము గదా? దాని కిట్లు పరిణమించు శక్తి యెట్లు వచ్చెను? లోపలి జీవశక్తిచేత జీవుఁ డెవఁడు? ఈశ్వరకళ. ఆయన యంశమే అట్లైన నీశ్వరుఁ డొకఁ డుండవలయును సత్యము. నిప్పు మిణుగు రున్నప్పుడు నిప్పు లేకున్న మిణుఁగు రెట్లు వచ్చును? నిప్పునందుఁగల వేఁడిమి వెలుతురే యల్పముగ మిణుఁగురునందుఁ గలదు. సముద్రమునకు నల యెట్టులో సూర్యునకుఁ గిరణమెట్టులో యట్టులే ఈశ్వరుని యల్పాంశమే జీవుఁడు. కావుననే ప్రకృతి పదార్థమునకు జీవుఁడెట్లు ధారకుఁడు పోషకుఁడగుచున్నాఁడో యట్లు జీవునకు నీశ్వరుఁడు ధారకుఁడు పోషకుడు నగుచున్నాఁడు. కావున జీవునందలి శక్తి యల్పమగు నీశ్వరశక్తియే. అట్లైన నీశ్వరశక్తియే ప్రకృతి పరిణామమునకు హేతువగుచున్నది గదా. ఇటు చూచిన సర్వకర్త, సర్వభర్త, సర్వరూపి, సర్వవ్యాపి యీశ్వరుఁడే. అట్లైన నాయనయే సర్వజ్ఞుఁడు. అట్లైనచో జీవునకుఁ గాని ప్రకృతికిఁగాని స్వాతంత్ర్యమేదీ! రెండును నీశ్వరునకుఁ బరతంత్రములే – సత్యము – నిప్పునుండి చిట్లిన మిణుఁ గురు నిప్పునకు సమీపమున నుండువఱకు వేఁడిమి వెలుతురు గలదై యుండును. దూరమునకుఁ బోయెనా యా రెండును బోవును. అట్లే జీవుఁ డును నీశ్వరసాన్నిధ్యము నుండి తాను దొలఁగక తనయందలి శక్తి యీశ్వర

★ శ్రీరామనామమాహాత్మ్యంబును జూడుఁడు.

శక్తియే యని సముద్రమునందలి చేఁపవలెఁ దా నీశ్వరునందే యున్నానని సర్వదా జ్ఞప్తి యందుంచు కొనెనేని బాగుపడును. తాను స్వతంత్రుఁడనని తనశక్తి స్వతంత్రశక్తి యని తలఁచి ఈశ్వరు మఱచెనేని చెడును.

ఇదిగో నిక్కడ బెద్దచెఱువున్నది. దీనిలోనుండి యలుగు నీళ్ళు కాల్వగఁ బాఱి క్రింద మడుఁ గేర్పడినది. ఈ మడుఁగు లోనికి వచ్చు నీళ్ల చెఱువునీళ్ళే కదా. ఈ మడుఁగు తాను మడుఁగుగా నుండుటకుఁ జెఱువునీళ్ళు తనలోనికి వచ్చుటచేతనే యనునది మఱవక చెఱువు సంబంధము తనకు సర్వదా యుండి చెఱువు నీళ్ళు తనలోనికిఁ బాఱుచుండఁ గోరుచు నా నీళ్ళను దనలోనికి రానిచ్చువఱకు మడుఁగులోని నీళ్ళు శుభ్రముగా శుద్ధముగా నారోగ్యకరముగ నుండును. ఈ మడుఁగు "ఛీ చెఱువెక్కడ నేనెక్కడ? చెఱువునకు నాకు నేమి సంబంధము? నేను స్వతంత్రముగ నున్నదాననుగాని పరాధీనను గాను. నేను మడుఁగుగ నునికికి నేనే కారణ'మని తలఁచి తనలోనికి వచ్చు కాల్వను రాకుండఁ జేసికొనెననుకో, యేమగును? నీళ్ళు ముఱుకులై కంపు పట్టి చెడిపోవును. అట్టులే జీవుఁ డీశ్వరాభిముఖుడై వర్తించుచుఁ దనయందలి శక్తి ఈశ్వరశక్తియే యనియు, నదియే మడుగు లోనికి చెఱువు నీటివలెఁ దనలోనికిఁ బ్రవహించు చున్నదనియు, నది వచ్చునంతకాలము దేహమారోగ్యముగ నుండి కామ క్రోధ లోభాది కశ్మలముచేఁ జెడకుండుననియు, నీశ్వరునకుఁ బరాఙ్ముఖుఁడనైతినా యా శక్తి నా లోనికి వచ్చుట క్షీణించి యాధులు వ్యాధులు ప్రాప్తించి కామాదులచేఁ బీడింపఁ బడుదుననియు మనస్సే కాల్వయనియు గాల్వలోఁ జెట్లు చేమలు గాదము పెరుఁగక ఱాలుగుండ్లు నడ్డపడక యెంతకాలము మంచిస్థితిలో నుండునో యంతకాలము చెఱువునీరు మడుఁగులోనికి వచ్చునట్లు మనస్సు కామక్రోధ లోభ దూషితము గాక నిర్మలముగ నెంతవఱకు నీశ్వరాభిముఖమై యుండునో యంతవరకు దేహి బాగుండుననియుఁ గావున మనస్సును సర్వదా నిర్మలముగను నీశ్వరాభిముఖముగ నుంచుకొనుట యత్యంతావశ్యక

మనియు నేర్పడుచున్నది. జీవుఁ డజ్ఞానముచే నీశ్వరునకుఁ దనకుఁగల సంబంధము మఱచినను, జ్ఞానస్వరూపుఁడైన యీశ్వరుఁడు మఱచునా? మఱవఁడు. కష్టానుభవముచే జ్ఞానము గలిగి తనవంక మనస్సును ద్రిప్పువఱకు స్వరూపహాని లేకుండునట్లు తానే జీవుని గాపాడుచుండును. చెఱువులోని క్రొత్తనీరు చాలినంత తనలోనికిఁ బ్రవహింపకుండుటచే మడుఁగులోఁ గన్నకశ్మలము చేరి కంపు పట్టి తన యునికి తనకే దుస్సహమై యిదంతయుఁ జెఱువులోని నీరు తనలోనికి రాకుండుటచేఁ గదా కలిగెను గావున మరలఁ గాల్వను గాపాడుకొనిన బాగుపడుదునని మడుగునకుఁ దోఁచి చెఱువు నీటిని రానిచ్చి బాగుపడునట్లే, జీవుఁడును మనస్సును వేఱువంకకుఁ ద్రిప్పి యీ లోకమందును బరలోకమందును దుఃఖము లెల్ల ననుభవించి తుదకుఁ గాలాంతరమునఁ దెలివి తెచ్చుకొని మరల మనస్సును నీశ్వరాభిముఖము గావించి క్రమక్రమముగ సన్నకాల్వను బెద్దగాల్వగఁ జేసి నీ రెక్కువగ వచ్చునట్లు చేసినట్టు నిర్మలమనస్సును బూర్ణముగ భగవంతునివంకఁ ద్రిప్పి విశేషతేజస్సు నాకర్షించి యాయనతో నిత్యసంబంధముగలదై యుండును. చెఱువు నీరు పొంగి కాల్వ యొడ్డులను ధ్వంసము చేసి పెద్ద ప్రవాహరూపముగ వచ్చి మడుఁగుపైఁ బడి నిండి పొరలి పాఱెనా యప్పుడు మడుఁగు చెఱువు భేదమేర్పఱుప రాక యొక్క రూపమగును. అప్పు డిది మడుఁగని వేఱుగ గుర్తింప రాకపోవును. అప్పుడు మడుఁగు చెఱువులోఁ గలిసిపోయినదని చెఱువేయై పోయినదని యందుము. మడుఁగను పేరు నశించును. అట్టులే గంగాయమునాదినదుల నీరు సముద్రమును జొచ్చెనా తరువాత నా నీటికి గంగయని యమున యని పేర్లు పోయి సముద్రపు నీరనియే కదా యందుము. అట్టులే జీవుఁడును నెల్లయ్య పుల్లయ్య యను నిప్పటి నామరూపములు లేనివాఁడయి భగవత్స్వరూపమును భగవచ్ఛక్తిని విభుత్వమును గలవాఁడగును.

కాల్వ ధ్వంసమగునట్లు చెఱువునీరు పొంగి పొరలి దన లోనిఁకి బ్రవహింపఁ జేసికొనుశక్తి మడుఁగునకు కలదా? లేదు. అది చెఱువు చేయవలసిన కార్యమే. అట్టులే భగవచ్ఛక్తి పూర్ణముగఁ దనయందుఁ బ్రవహింపఁ జేసికొనుశక్తి జీవునకు లేదు. అది భగవంతునికి మాత్రమే సాధ్యము. మడుఁగు చెఱువు రెండు నచేతనములు. జీవుఁడు భగవంతుఁడు చేతనములు. జీవుఁడు కోరిన భగవంతుఁ డనుగ్రహించును. ఇట్లు చెఱువులోని నీరంతయుఁ మడుఁగులోనికిఁ బాఱి మడుఁగులోని ముఱికి నీరంతయుఁ బోయి చెఱువునీటిలో మడుఁ గెప్పుడు మునిఁగి ప్రత్యేకము మడుఁగుగా గానరాకపోవునో యప్పుడా మడుఁగు నేను జెఱువునని చెప్పుకొనుట యొప్పునుగాని ముఱికినీళ్ళతో నిండియుండు మడుఁగు నేను జెఱువునని చెప్పుకొనిన నది హాస్యాస్పదమగును. అల తాను సముద్ర మనవచ్చునా? కారాగృహవాసి స్వతంత్రుఁడ ననుకొనవచ్చునా? అట్లే 'సోహమ్' "బ్రహ్మాస్మి" యను నవి జీవుఁడు ప్రకృతిబంధములఁ బాసి బ్రహ్మభావముఁ బొంది నపుడు చెప్పఁదగియుండును. అట్లేల? మిణుఁగురు మాత్రము నిప్పుగాదా ఏమి? అటులే సంకుచిత మితజ్ఞానము. తేజము గలవాఁడు జీవుఁడు. అఖండ జ్ఞానానంద తేజఃపూర్ణుఁడు భగవంతుఁడు. ఈ తారతమ్యజ్ఞానముతో సోఽహమని బ్రహ్మాఽస్మి యనినఁ దప్పేమి? ఈ కారణముచేతనే కాఁబోలు శంకరాచార్యులవారు.

**శ్లో॥ సత్యవిభేదావగమే, నాథ తవాస్మి న చ మామకీనత్వం** అని వచించిరి.

భగవంతునిఁ గోరుట యననేమి ప్రతికూలబుద్ధి విడిచి యనుకూల బుద్ధితో మహావిశ్వాసముతో మనస్సును భగవంతునియందు నిల్పుటేకదా. అట్లు చేసిననే కదా మనస్సు మూలమున భగవచ్ఛక్తి మనయందుఁ బ్రవేశించును. అలలు తమలోనికి సముద్రపు నీళ్ళు రాకుండఁ జేసికొన గలవా? ఇఁక నానుకూల్య మేమి? ప్రాతికూల్య మేమి? అట్లు కాదు. అల లచేతనములు, అస్వతంత్రములు. మనకుఁ గించిత్ స్వాతంత్ర్యము

భగవంతుఁ డిచ్చియున్నాడు. కావున సూర్యరశ్మిలోకము నందంతయు నిండియుండినను మనమీదఁ బడకుండునట్టు గొడుగు పట్టుకొనవచ్చునుగదా. అది ప్రాతికూల్యము మన యందుండునది శుద్ధాత్మకాదు. బద్ధాత్మ. దేహమను నుపాధిచే నాత్మబద్ధుఁడై యున్నాడు. కుండకు నోరువలె మనకు మనస్సు కుండలోనికి నీళ్ళు రాకుండునట్లు నోరు మూయవచ్చునుగదా. లేక బోర్లింపవచ్చునుగదా? అట్టులే మనస్సును భగవంతునకు నభిముఖము చేయుటకు విముఖము చేయుటకు మనకు స్వాతంత్ర్యము కలదు. భగవంతుని యందనెదవే భగవంతుండెచ్చట నున్నాఁడని యాయన యందు మనస్సును నిలుపుదును? భగవంతు డంతర్యామిగ నన్నిచోటుల నున్నాఁడు. ఆయన లేని చోటు లేదనెదవా? సత్యమే. మడుఁగులోనికి వచ్చు కాల్వ చెఱువులో నెచ్చటనో యొకచోటఁ బ్రవేశించి కలిసిన గదా చెఱువు నీరా మార్గమున మడుఁగులో బ్రవేశించును? అట్టులే మనస్సును దేనియందు నిలుపుదును? ఈ చెట్టునందా! ఆ గుట్టయందా! ఈ గోవునందా? ఈ దున్నపోతునందా? ఆ మేఁకయందా? ఈ గడ్డియందా? ఈ రాతియందా? దేనియందు నిలుపుదును? ఇన్నిట భగవంతుఁడున్నాఁడు కదా. చెఱువు నిండ నీరున్నది. ఈ నీరు మడుఁగులోనికి రావలయు ననిన నెచ్చట నుండి యైనఁ గుండలతోనో, యేతముతోనో, కాల్వ లోనికి నీరు పోయవచ్చు. ఇది సులభమార్గమా? అలుగులోనికో తూములోనికో కాల్వ కలుపుట సులభమా? ఇదే సులభము గాని భగవంతునికి నలుగెక్కడ? తూమెక్కడ?

అలుగు తూములనగా సులభముగాఁ జెఱువునీరు వెలికి వచ్చు మార్గములని కదా యర్థము. అట్లు భగవంతున కేవైన గలవా? లేకేమి? సూర్యరశ్మి మిఁణుగురు బూచి యందుఁ గలదు. దీపము నందుఁ బ్రొయ్యి మంటయందుఁ గాఱుచిచ్చునందును గలదు. మిణుఁగురు బూచి వెలుతురు మన యింటిలోని చీకటినిఁ బాపఁగలదా? వంట చేయుట కుపకరించునా?

ప్రొయ్యిలోని మంట యింటిలోని చీకఁటి పోఁగొట్టగలదా? దీపము కాఁఖు చిచ్చు వలన వృక్షములు జీవజంతువులు బ్రతుకునా? పెరుగునా? పుట్టునా? అట్టులే భగవచ్ఛక్తి యన్నిటియందున్నను గొన్నిట గొప్పగాఁ గొన్నిట నల్పముగా నుండును. కొన్నియందలి శక్తి కొన్ని కార్యముల కుపయోగించును. కొన్నియందలి శక్తి దేహమును బోషించును. కొన్నియందలి శక్తి చంపును. అందును భగవచ్ఛక్తియే. అట్టులే భగవచ్ఛక్తి విశేషముగ దేనియందుగలదో దేనియందు మనస్సు నిలిపి యా శక్తి నాకర్షించిన మనకు మేలుగలదో అది తెలిసి వర్తించిన మేలు గలదు. మనకుఁ గానవచ్చు పదార్థములలో నెల్ల భగవంతుని శక్తి సూర్యునియం దెక్కువ నున్నది. సూర్యునియందు భగవంతుఁడు సాకారుఁడై యున్నవాఁడు. సూర్యకిరణముల మూలమున వచ్చు శక్తియే లోకమున భూతజాలమునెల్లఁ బుట్టించుచున్నది. పెంచు చున్నది. త్రుంచుచున్నది. మనము కూరగాయల చేత ధాన్యాదుల చేత దేహమును జీవింప జేయుచున్నామనుట భ్రాంతి. సూర్యకిరణముల నుండి వీనిలోనికి వచ్చిన శక్తి వలననే మనము జీవింపఁ గలవారమై యున్నాము. ఈ శక్తి వాయువునందు నీళ్ళయందును నున్నది. అన్నము దిని జీవించునట్లు కేవలము గాలివలన, నీటివలన, సూర్యకిరణముల పానము వలన మనము జీవింపవచ్చును. మన బుద్ధిని బ్రేరించునదియు నీ శక్తియే. కావుననే ద్విజులు సంధ్యవార్చుట. ఈ కారణము చేతనే కాఁబోలు సంధ్య వార్చినఁ బుణ్యము లేదు. వార్వకున్నఁ బ్రత్యవాయము గలదని పెద్దలందురు. సత్యము, సత్యము. అధికారి లంచము గొనినఁ బాపము గలదు గాన లంచము గొనకున్నఁ బుణ్యముగలదా. అట్టులే సంధ్య వార్చితినా బ్రాహ్మణ్యము దక్కును. వార్వకుంటినా పోవును. శూద్రుఁడ నగుదును. ధనమును నేను సంపాదించితినా నా పెద్దలు సంపాదించి యిచ్చి పోయినది వ్యయము చేయక దక్కించుకొని సుఖింపవచ్చును. ఎక్కువగ సంపాదించిన సంచితము నెక్కువగు చుండును. అటు సంపాదించక పోయితినా పెద్దలు పెట్టిపోయిన

దానినే వ్యయపఱుపవలయును. వ్యయమైనను మితముగనైనఁ గొంతకాలము వఱకు వచ్చును. అమిత దుర్వ్యయమైన యెడ దరిద్రుఁడై భిక్షానికి బోవలసివచ్చును. అట్టులే బ్రాహ్మణులు మహర్షుల గోత్రములవారు. ఆ ఋషీశ్వరుల తేజస్సే వారియం దిప్పటికిఁ బరంపరగా వచ్చుచున్నది. దీని నెక్కువ సంధ్యాజపతపాద్యనుష్ఠానములచే నెక్కువ చేసికొను శక్తి లేకున్న నున్నదాని నైనఁ గాపాడుకొనవచ్చును. అటు చేయక యస్పృశ్యములఁ దాకిఁ యభోజ్యముఁ దిని, యపేయములఁ ద్రావ యున్న దానిని వ్యయ పరచితినా శూద్రదశకో – పంచమదశకో పశ్వాదిదశకో వత్తును. ఈ తేజస్సు మనము చేయు యోగదాన ధర్మ దేవ సేవాదిసదాలోచన సత్కార్యముల వలన వృద్ధి యగును. దురాచార దుష్టభోజన దుష్టచర్య దుష్టకార్యాలోచనలచే క్షీణించును. ఈ శక్తి యెక్కువగు కొలది యాయువు బలము తేజస్సు నారోగ్యము నెక్కువగును. కావుననే ద్విజుల కందఱకు వేదవిహిత కర్మానుష్ఠానములు నియమితముగ విధింపఁబడినవి. వేఱు మార్గముల ధనము సంపాదింప శక్తి సామర్థ్యము లేనివారు దానిని గలవారి యొద్దఁ జేరి వారికేదో యొక కార్యము చేసి వారివలన ధనమును బొందునట్లు ద్విజులు గానివారు వారికిఁ గార్యము లందు సాహాయ్యపడి వారి యనుగ్రహముఁ బొందఁ గలుగుదురు. భగవంతుని మెప్పించుట కష్టసాధ్యము. భాగవతుల మెప్పించుట సులభసాధ్యము. వారి యనుగ్రహ మమోఘము. నారదుఁడు శబరి లోనగు వారిట్లు తరించినవారే. ఏమీ! ఏమంటిని భగవంతుఁడనెడు నిప్పులో నుండి చిట్లివచ్చిన మిణుఁగురా జీవుఁడు? నిప్పులో నుండి చిట్లి యెక్కడికి వచ్చెను! నిప్పునకు స్థలపరిమితి గలదు. కావునఁ జిట్లిన మిణుఁగురు వేఱొక స్థలమునకు దానిని విడిచివచ్చెను. అట్లే మడుఁగు కూడ. భగవంతుడు సర్వవ్యాపి కదా? భగవంతుఁడు లేని స్థలమే లేదే. ఇఁక జీవాత్మునికిఁ బ్రత్యేకస్థానమెక్కడ? భగవంతునియందే కదా జీవాత్మ యుండవలయును. చెఱువునందే మడుఁ గుండవలయును. నిప్పునందే మిణుఁగు రుండవలయును.

సత్యము. మడుఁగు మిఱుంగురు ననునవి యుపమానమునకుఁగాఁ జెప్పఁబడనవి. కాని యితరము కాదు. పెద్ద ప్రవాహమునందు మనము చూచిన యెడల నీటియం దెన్నో చిన్న పెద్ద నీటిసుళ్ళు గానవచ్చును గదా. అట్టి వానిని వేఱనక ప్రత్యేక నామముతో సుళ్ళని యందుము. సుడి యనునది యేమి? ఏటి నీరే. ఏటినీటివలన నైనదే. ఏటియందే యున్నది. దానిలోనికి వచ్చు నీరు పోవు నీరు కూడ నేటిదే. ఏటిలోనిది యొకయంశమే. ఇప్పుడు తక్కిన విచార మంతయు మడుఁగునకు వలె సరిపోవుచున్నది. సుడి సుడిగా నుండుటకు దాని ధారణ పోషణములకు నేఱెట్లు కారణమో మన యునికికి సత్తకు ధారణ పోషణములకు భగవంతుఁడే యాధారము. వాసుదేవార్థమిదియే కాఁబోలు.

సుడియం దేఱున్నది? ఏటియందు సుడియున్నది. అట్టులే భూతములు భగవంతుని యందున్నవి. భూతముల యందు భగవంతుఁ డున్నాఁడు. ఏఱంతయు సుడియందున్నదా? లేదు. అల్పభాగము. అట్టులే భూతముల యందును, తల్లిగర్భము నందలి శిశువువలె శిరమునందలి సంకల్పమువలె మనము భగవంతుని యందున్నాము. తల్లియే శిశువును ధరించుచున్నది. తల్లియే శిశువును బోషించుచున్నది. శిశువున కేమి జ్ఞానము గలదు? ఏమిశక్తి గలదు? ఏమి స్వాతంత్ర్యము గలదు? అట్టులే మన జ్ఞాన మెంత? శక్తియెంత? స్వాతంత్ర్యమెంత? ఈ యొంటిమిట్ట యందు నే నెన్నవ భాగము? ఈ మండలమం దీ యొంటిమిట్ట యెన్నవభాగము? ఈ ఖండమునం దీ మండల మెన్నవభాగము? ఈ భూమియం దీ ఖండ మెన్నవభాగము? ఈ బ్రహ్మాండమం దీ భూమి యెన్నవభాగము? మేడిపండు లోని విత్తనములవలె నిట్టి బ్రహ్మాండము లెన్ని భగవంతుని యందుఁగలవు? ఆయన యొక్కొక్క రోమకూపములో ననేక లక్షల బ్రహ్మాండములు సంచారములు చేయుచున్నవని భాగవతము చెప్పుచున్నది కదా. కనుకనే కాఁబోలు భగవంతుఁ డనేక కోటి బ్రహ్మాండనాయకుఁ డనుట దీనివలన

నాయన మహత్త్వము మన యల్పత్వము తెలియనయ్యెడిఁ గదా. నే నొక నాటకము వ్రాయ సంకల్పించితి ననుకో. వస్తువు పాత్రము లెందున్నవి? నా శిరమునందే కదా. అట్టులే భగవత్సంకల్పము లైన ప్రపంచములు భగవంతునందుఁ గాక మఱి యెందుండఁగలవు? సంకల్ప నాటకవ్యవహారము మన సంకల్ప బలమునఁగాక యెట్లు జరుగఁగలదు? అట్లె ప్రపంచవ్యవహారము భగవత్సంకల్పమున కధీనపడి యున్నది. కావుననే భగవంతుఁడు ప్రయోజన కర్త. మనము ప్రయోజ్యకర్తలము. ఈ జ్ఞానము లేక యజ్ఞానములోఁ బడి యేమి గర్వము? ఏమి దురహంకారము? ఆహా! తుదకు దేవుడే లేఁ డనుచున్నాము. గర్భములో నుండు శిశువు కాలితోఁ దల్లిని దన్నినట్లు మనము భగవంతునిపట్ల నెన్నియో యపరాధములఁ జేయుచున్నాము. అటులున్నను మనల నాయన క్షమించుట యాయన పరిపూర్ణ దయాతిరేకము చేతనే. భారమంతయు భగవంతునియందు వేసి వర్తించువాఁడే కృత కృత్యుఁడు.

అని యిట్టు లాలోచించుచు నందు రాలియుండిన యొక వేఁపాకు నెత్తికొని దానివంక నట్టెచూచి తలయూఁచి యిట్లు తలపోయుచున్నాడు. ఆహా వేపాఁకా! నీవు నోరు లేకయే దైవమహిమ నెంత బోధించుచున్నదానవు! ఇది పండి యెండినేల రాలినది. ఏల యెండినది? సారము బొత్తిగ రాకయున్న పసరు వెచ్చపడి పోవుటచేత. ఏల పడిపోయినది? నిలువ శక్తి లేక. తొలుతనిది లేఁజిగురై ఆవలఁ బండెను. ఎండెను. ఇట్టులే కదా మనుష్యులు బాల్య కౌమార యౌవన వార్ధక మరణంబుల నందు చున్నవారు. ఈయాకు నడుమఁ జూడు. మనకు వెన్నెముక వలె దీని నడిమి యీనె యున్నది. మన ప్రక్క యెముకలవలె వీనికిని నీ నెలున్నవి. మనలో దేహమంతయు వ్యాపించియుండు నరములవలె దీనియందుఁ గానవచ్చుచున్నవి. మన యందలి నరములవలె నివి గొట్టములే. మనలో నెత్తురు పాఱునట్లే దీనిలోను నీరు పాఱుచున్నది. అది భూసారము. దానివలననే యీ యాకులన్ని జీవించి

పచ్చగా నున్నవి. ఈ సారము వీనిలోని కెట్లు వచ్చెను? తొడిమెల లోని కెట్లు వచ్చెను? రెమ్మల నుండి రెమ్మల కెట్లు వచ్చెను? కొమ్మల నుండి కొమ్మల కెట్లు వచ్చెను? బోదెనుండి బోదెకెట్లు వచ్చెను? వేళ్ళ నుండి. ఈ వేళ్ళు భూమిలో నలువంకలఁ బోయి వృక్షపోషణమునకుఁ గావలసిన ధాతువును నీటిని గ్రహించి యా సారమును గొట్ట కొనకొమ్మ చిగురువఱకు నన్ని కొమ్మలకు రెమ్మలకు నాకులకు బూలకు బూపలకుఁ బిందెలకుఁ గాయలకుఁ బండ్లకు వ్యాపింపఁ జేయుచున్నవి. తమ దేహతత్త్వమునకు విరోధించు ననారోగ్య కరములైన యాహారముల గ్రహించు వివేక హీనులైన మనుష్యులు గలరుగాని యొక్క వృక్షమైనఁ దన దేహ తత్త్వమునకు సరిపడని దానిని గ్రహించునా? చెట్టు లనలేల? పశు పక్షి మృగాదులును భుజింపవు? మనుష్యుఁ డొకఁడే తన జ్ఞానమును దుర్వినియోగపఱుచువాఁడు. వృక్షములు పరోపకారముగ ఫలించుచున్నవి. ఏళ్ళు పరోపకారముగఁ బాఱుచున్నవి. పశువులు పరోపకారముగ జీవించుచున్నవి. ప్రాణముల నిచ్చుచున్నవి. మనుష్యుఁ డొక్కఁడే స్వార్థమునకుఁ బరులఁ బీడించియో మోసగించియో నయముననో భయముననో యార్జించి పరుల కీయవలయు ననిన దుఃఖించువాఁడు. మనుష్యుఁడు తప్పఁ దక్కిన జీవజంతువులు తాము పరులను యాచింపక న్యాయమార్గమునఁ గష్టించి యార్జించి జీవించి పరులకిచ్చి తాము చచ్చినను బ్రతికినను బరుల కుపకరించును. పరుల యాచించువాఁడు మనుష్యుఁడే. పరులఁ బీడించువాఁడు మనుష్యుఁడే. మనుష్యుఁడు తన పొట్టకై యెంత ఘోరకార్యమును జేయుచున్నాఁడు! ఆవులెంతో సాధుజంతువులు గదా, వాని బిడ్డలకై వానియందు భగవంతుఁ డుంచిన పాలను దూడల కడుపులు గాల్చి మనుష్యుఁడు దాను బిదికి త్రాగుచున్నాఁడు.

ఇట్లు తన శిశువును దన భార్యయొద్దకు రాకుండఁ గట్టివైచి యా భార్య కాలుసేతులుఁ బంధించి దాని చన్నుల నుండు పాలను మఱియొకఁడు

పిండి కొనిపోయిన దన కెట్టులుండునో మనుష్యుఁ డూహింపఁలేఁడు కదా. కడుపార దూడ త్రావఁగా మిగిలినవి తా నుపయోగింపవచ్చును. గాని దూడల నెండఁగట్టి పిదుకుట మహా పాపము. ఇది గోహత్యగాదా. తరుష్కుఁ డొక వ్రేటునఁ జంపును. గో రక్షకుల మనువారు పాల నమ్ముకొన మరగి దూడల కడుపుగాల్చి చంపుదురు. కాని త్రాగువా రీ పాపమును బంచుకొందురు. పూటకూలమ్మకుఁ బుణ్య మేమన్నట్టు లమ్ముకొనువారికిఁ బుణ్యపాప విచారముండునా? హింసయే జీవనము కాఁగల మనుష్యజన్మ మెంత పాపజన్మమో అహింసావ్రత పరాయణుఁలగు మనుష్యులే మనుష్యులు. అయాచనాపరులగు నరులే నరులు. పాములు తేళ్ళు విష జంతువులని నరులు చంపుదురు. మనుష్యులయం దుండు విషముకన్న వీని యందెక్కువ విషమున్నదా? ఇట్టివారి నేమి చేయవలయునో? తేలుపాము విష మొక్కనిమాత్రమే బాధించును. దుష్టమనుష్యుని విషమో సంసారములను గ్రామములను దేశములనే కూలద్రోయునే. పాములు తేళ్ళు తమ కపాయభీతి గలిగించినవారినే కఱచును. దుర్జనులో? పోనీ యివి విషజంతువు లనుకొందుము. మేఁకలు – దున్నపోతులు – కోళ్లు – జింకలు – నీళ్ళలోని చేఁపలు నాకాశమునఁ బోవు పక్షులు నివి వీరికేమి ద్రోహము చేసినవి? పులి తమ్ముఁ జంపి తినిన నది ఘాతుకమృగమట. తెకతేర కిన్నిటిని జంపువా రే మృగములో. ఆహారమునకై చంపిన దోషము లేదఁట. ఎవరి కేది యాహారము? పులులకు, సింహములు మొదలగువానికి మాంస మాహారము. గోవులు మేఁకలు లోనగువానికి నాకు లలము లాహారము. అది లేకున్న నవి జీవింపవు. మాంసము తినకున్న మనుష్యుఁడు జీవింపఁ డా? ఏ యాహారము లేకున్న జీవి జీవింపదో దాని కది సహజాహారము.

దైవచిత్ర మింకను జూడుము. ఈ యాకులు మనవలెనే గాలి పీల్చి విడుచుచున్నవి. చెట్లు మాటలాడలేవో యటుగాక యవి మాటలాడుకొను విధము మనకుఁ దెలియదో కాని తాఁకినఁ దెలిసికొనును. వీనికిని

జూచుశక్తి వినుశక్తి ఆఘ్రాణించుశక్తి గలవు. మనుష్యుఁడు గొడ్డలి తీసికొని యడవికిఁ బోయినఁ జెట్లు వానిని జూచి గడగడ వణఁకునని వేదములు చెప్పుచున్నవి కదా. వీనికిని గుండెలు గలవు. భగవంతుని కల్పనాశక్తి యెట్టిదో కాని యీ చెట్టున కిన్ని యాకులున్నవే. ఒకయాకు వంటి యాకు వేఱొకటి కలదా? అత్యల్పమైన భేదము కానవచ్చుచునే యుండును. ఇంతయేల? ప్రపంచమున నన్నివిధముల సరిపోలు పదార్థములు రెండు లేవు. ఆహా భగవంతుఁ డా! భగవంతుఁడా! యెవ్వఁడు నీ శక్తి యూహింపఁ గలవాఁడు. ఒక యోషధి దినిన బిడ్డలు గలుగుదురు. వేఱొక యోషధిని దినిన బిడ్డలు బ్రదుకుదురు. మఱియొకటి దినినఁ జత్తురు. ఒక యోషధివలన వచ్చిన రోగము మఱియొక దానిచే మానును. ఈ మూఁడు భిన్నశక్తులా? ఒకటియే యిట్టి చిత్రకార్యములఁ జేయునా? ఇదంతయు నీ సృష్టి స్థితి సంహార శక్తులను బోధింపదా? ఇన్ని భేదములఁ గానవచ్చు శక్తులన్నియు నొక శక్తి భిన్నచేష్టలే.

ఇందొక చిత్రము. ఈ చెట్టు కొమ్మలలోఁ గొన్ని తూర్పునకు, గొన్ని పడమటికిఁ, గొన్ని యుత్తరమునకుఁ, గొన్ని దక్షిణమునకుఁ బోయినవి. వీనిలోఁ దూర్పుకొమ్మల నుండు నాకులు పడమటి కొమ్మల నుండు నాకులతోఁ దమకు సంబంధము లేదని తలఁచుట న్యాయమా? భగవంతుఁడు తానే ప్రపంచమునకు బీజప్రదుఁడైన తండ్రి యని చెప్పెను గదా. అట్లొక బీజము నుండి వచ్చిన మనుష్యులు ప్రాచ్యులఁట. ప్రతీచ్యులఁట ఉదీచ్యులఁ ట. దాక్షిణాత్యులఁట. వాస్తవ మారయ దిక్కు లెందున్నవి? దేశము లెందున్నవి? అన్ని దిక్కు లొక దిక్కు గాదా. అన్నిదేశము లొక దేశముగాదా? ఒక దేశమున నొక తండ్రికి బుట్టినవారిలో నిన్ని భేదములు! మాటలు చెప్పునపుడు లోకమునకు నంతయుఁ దండ్రి యొకఁడే. అందఱము సోదరులమని చెప్పుదురు. స్వార్థవిచారము వచ్చిన నొకరి గొంతు లొకరు గోయుదురు. సర్వసౌభ్రాత్రము మా మతమని ఘోషించువారి యందే యెక్కువ

యసూయ ద్వేష బుద్ధి – స్వార్థ పరత్వము కానవచ్చుచున్నవి. దేశాంతరముల మాటలయేల? ఇరుగు పొరుగు వారే యొక యింటిలో వారే కలహింతురు కదా. ఒక రెమ్మ యందలి యాకు తన ప్రక్క యాకును భేదముగఁ దలఁచు టెట్టిదో యట్టిదే కదా యిది. దైవమాయ దైవమహిమ. తలయెత్తి యాకాశము వంకఁ జూచితినా దైవమహిమయే కానవచ్చును. అట్టులే జలములఁ జూచినను గొండలఁ జూచినను నంతరాళమునఁ జూచినను దైవమహిమయే కానవచ్చును. అంతయుఁ బ్రకృతి పురుష పురుషోత్తమమయమే. సీతారామ లక్ష్మణ మయమే యని యేమియు నూహింపఁజాలక యట్టె నిలిచిపోవును. భగవంతునియందు నాభిముఖ్యము వహించి యాత్మవిచారము చేయువారి యాలోచన లెన్నిగ్రంథములు వ్రాసినను జాలవు. అవి యనుభవజ్ఞులకే యెఱుక.

ఆవల స్మృతి దెచ్చుకొని మఱియు నమ్మహాత్ముఁ డిట్టు లాలోచింప సాగెను. ఇన్నిట సర్వవ్యాపియైన భగవంతుని చేష్టలను జూచుచున్నాను గాని భగవంతుఁడు కానరాలేదే. భగవంతుఁడు సర్వవ్యాపి సర్వశక్తుఁడు నని పలుమా ఱుచ్చరించితిని. ఎన్నిమా ర్లుచ్చరించిన నేమిఫలము? ఏమి దెలిసినట్టు? చంద్రుఁడు గుండ్రముగా నున్నాఁడు. తెల్లగా నున్నాఁడు. చల్లగా నున్నాఁడు. అనిన నేమి తెలిసినట్లు. అప్పడములు నట్లే యుండును. చంద్రు నొకసారి చూచినఁ గలుగు నానందమువంటి యానంద మిట్టిమాటలచేఁ గలుగునా? పుస్తకము లందు వర్ణించినది చదివినను, జూచినవారు చెప్పినను సముద్రమును మనము కన్నులారాఁ జూచినట్లగునా? కావున భగవ త్సాక్షాత్కారము గలుగ యత్నింపవలెను. అది గలిగిన జన్మము సార్థకము. భగవంతుఁడు కొందఱు నిరాకారుఁ డందురే. నాకెట్లు గోచరించును? ఆయన నిరాకారుఁడో సాకారుఁడో ఆయన యెట్లున్న మనకేమి? భక్తులు కావలయు ననిన సాకారుఁడయియె గోచరించును. కావుననే దేవతలును నవతారమూర్తులనే సేవింతురు. ఊరుపేరు చెప్పక ధ్యానించిన గజేంద్రునకు

సాకారుఁడై వచ్చి విష్ణువు సాక్షాత్కరింపఁడా? ప్రహ్లాదుని కొఱకు నృసింహాకారముతోఁ బ్రపంచమంతయు నిండియుండి కోరిన స్తంభమునఁ బుట్టలేదా? మనమెట్లు కోరిన నట్లు సాకారుఁడయియే భగవంతుఁడు వచ్చును. వచ్చు ననినేల? అర్చామూర్తిగ వచ్చియే యున్నాఁడు గదా. ఎవ్వరికే మూర్తి ప్రీతికరమో యా మూర్తినే యర్చించిన నా రూపముతోనే భగవంతుఁ డు గోచరించును.

పూర్వాచార్యులతోను భక్తులతోను నీ మూర్తు లాడలేదా? పాడలేదా? మాటలాడలేదా? వేంకటేశ్వరుఁడు సంపత్కుమారుఁడు రంగనాథుఁడు లోనగు మూర్తుల చరిత్రములు భక్తుల చరిత్రములు మనము వినమా, చంకను బిడ్డ నుంచుకొని యెక్కడికో పోనేల. మన శ్రీరామమూర్తి కోదండ దీక్షాగురుఁ డట్లు సాక్షాత్కరించినవాఁడే కదా. శ్రీరాము లవతారము చాలించునపుడు హనుమంతుడు “స్వామీ నీ మూర్తినే నెందు మరలఁ గాంతునన నిందుఁ గానగు నని చెప్పెఁ గదా. మా గురువును నీ మూర్తి యే నన్నుగ్రహించునని బోధించెఁ గదా. ఇఁక నా కేల విచారము. నేను శాస్త్రబద్ధుఁడను. నాకు శాస్త్రవాక్యములు గురువాక్యములు ప్రమాణములు. సూర్యుని యందుఁ జూతుమా యనిన సూర్యరశ్మి భగవంతుని తేజస్సులో నణుప్రమాణము. దానినే నీటియందలి ప్రతిబింబమందును జూడలేము. ఆకాశ బింబమునఁ జూడలేము. హిరణ్మయపాత్రము భగవంతుఁడు తొలఁ గించువఱకు సూర్యాంతర్వర్తియగు మూర్తి గోచరింపదు. హృదయ గుహ యందుఁ జూతుమనినఁ దపస్సు – బలము – వ్రతము – నభ్యాసము వలయును. ఇన్నియున్నను ప్రయత్నముచే సాధ్యపడఁడు. అదియు మనము కోరినపు డంతయు దర్శనము లభింపదు. కావున సులభసాధ్యము, సత్యఫల యుక్తము నశ్రమము నగునది యర్చామూర్తి దర్శనమే యని నిశ్చయించి ప్రతిదినము పశువులఁ దోలుకొని పోవునపుడును మరల వచ్చునపుడును గోవెలకుఁ బోయి స్వామిదర్శనము చేసికొనుచుండెను.

ఒకనాఁడు కోవెలకు స్వామి దర్శనమునకై పోవ నాఁటి దినము కార్తీకపూర్ణిమగుట సహస్రదీపోత్సవము కావున వేయి దీపములు వెలిగింప బడి యుండెను. వానిని జూచి యధ్యాత్మ చింతాగతచిత్తుఁ డైన యాయన యిట్లు తలఁచెను.

ఆహా యేమి యీ వైభవము. 'ఈ దీప పంక్తులను జూడఁ బరవాసుదేవు సేవింపవచ్చిన శుద్ధాత్మలవలెఁ గాననయ్యెడిని. నా యందు సకలాత్మలున్నవి. సకలాత్మలయందు నేనున్నా నని చదివినప్పుడు జీవాత్మలన్నియుఁ బరమాణు స్వరూపములు గదా. ఒక పరమాణువు నందిన్ని పరమాణువు లెట్లుండునని సందేహించు చుంటిని. తెలిసెఁ దెలిసె. ప్రతి దీపకాంతియు మండపమం దంతయు నిండియుండుట నిజమైనపు డిన్ని దీపముల కాంతులు ప్రతి దీపమందు నుండుట నిస్సందేహము. ఆత్మవిషయమందు నట్టులే యగు. ఈ పండువెన్నెలలో నిన్ని దీపము లున్నట్టుల భగవంతుని తేజస్సులో నిన్ని మగ్నములై యున్నవి. ఇన్నిటి యందు వెన్నెల యుండునట్లు భగవంతుఁ డిన్నిటనున్న వాఁడు. భగవంతుఁడు గుణముచేతను రూపముచేతను సర్వవ్యాపిగదా. కుండలోఁ బెట్టబడిన దీపమువలె బద్ధాత్ముఁడు. ప్రకృతి సంబంధకోశములలోఁ జిక్కుకొని సంకుచిత తేజుఁడై యున్నాఁడు. మన దేహములు మట్టికుండలు. ఆత్మజ్ఞానము గల మహాత్ముల దేహములు నచ్చపు గాజుకుప్పెలు. గాజు పరిశుద్ధమైన మట్టియేకదా. గాజుకుప్పెకు నాలుగైదు గుడ్డలపొరలు చుట్టితిమనుకో. వెలుతురు వెలుపల రాకయుండును. ఒక్కొక్క పొర పోవుకొలఁది వెలుతురు వెలుపలికి హెచ్చుగుచుండును. అన్నిపొరలు పోయిన యెడల దీపకాంతి యిల్లంతయు వ్యాపించును. అట్టులే జీవాత్మను జుట్టుకొని యుండు ప్రకృతికోశములు తపోయోగ భక్తి జపాదులచే క్షీణింపఁ జేయుకొలఁది నాత్మకాంతి వెలుపల నెక్కువఁగ దోఁచును. అన్ని క్షయించిన శుద్ధాత్మకాంతి యపారమై యావరణ రహితమై బ్రహ్మాండముల నన్నిట వ్యాపించును. అప్పుడు పరమాత్మ తేజములో సముద్రమునందు గంగా

జలమువలె జీవాత్మ తేజ మైక్యమైపోవును. వాసుదేవ శబ్దార్థమప్పుడు తెలియును.

ఈ విధముగ భక్తి యతిశయింపఁగా భగవన్మహిమ తెలిసికొనఁ బురాణేతిహాసములఁ బఠింపఁ బోతరాజు గోరిక కలవాఁ డయ్యెను. అవి యర్థము చేసికొనుటకు సంస్కృతాంధ్రభాషాజ్ఞాన మావశ్యకమై యుండెను. కావున నప్పుడు గ్రామ మందుండు పండితులను వేఁడికొని గ్రంథములఁ దెచ్చికొని పుణ్యసతులు వాకిట దీపములుంచిన చోటులకుఁ బోయి యచ్చట దీపముండువఱకుఁ బఠించి మఱి నిద్రించుచుండెను. పూర్వమున నార్యధర్మము లెఱింగిన యిల్లాండ్రు లక్ష్మీకరమనియు వీధిని బోవువారి కెంతో యుపకారక మనియుఁ దలంచి సాయంకాలమున వాకిట దీపము లుంతురు. ఇప్పుడు వాకిట గూండ్లు మాత్రము కొన్నిచోటల గానవచ్చు చున్నవి గాని సోమరితనము చేతను, లోభితనము చేతను, నజ్ఞానముచే తను నిల్లాండ్రు దీపములుంచరు. నాగరికత దయ్యము తలవిచ్చి యాడు చోట నీ గూండ్లను గూడ దీసివేసిరి. వీరి మతులకుఁ దగినట్టు గతులు నున్నవి.

ఇట్ల మ్మహానుభావుఁడు కష్టించి విద్య సాధించెను. అప్పుడాయనకు వాల్మీకివలె నద్భుత కవితాశక్తి యుదయించెను. శ్రీభాగవత పఠనము వలన భక్తి విరక్తు లతిశయించెను. రామాయణమును భాస్కరాదులు భారతమును దిక్కనాదులును రచియించి యుండుటచేఁ దాను భాగవతమును దెనిఁ గింప నారంభించెను.

ఇప్పటి కీయనకు యుక్తవయస్సు వచ్చెను. దారయుఁ బుత్రుఁడు నేర్పడిరి. రామతీర్థమునకుఁ దూర్పునఁ బిత్రార్జితమైన భూమిని స్వయముగ దున్ని యుదరపోషణము కావించుచుండెను. మూల గ్రంథమును దెనిఁ గించునపుడు శ్రీరామాలయంబుననే జయసమీపంబున నుదఙ్ముఖుడై గూర్చుండి వ్రాయును. స్వకల్పనముగఁ బద్యములను సేద్యము చేయుకాల మందు వ్రాయును. పొలమునకు దున్నపోతులఁ గట్టుకొని సేద్యమునకుఁ

బోవునపుడు రొండిలో దాటియాకులు ఘంటము నుంచికొనిపోయి తోఁచినది తోఁచినట్లు వ్రాయుచుండెను.

ఈయన భక్త్యతిశయము – నసమాన కవిత్వపటుత్వము – శ్రీభాగవతము నాంధ్రీకరించుట యనునవి యాంధ్రలోకంబునఁ గ్రమక్రమముగ వ్యాపించి ప్రభువులకును గర్ణతాడనము గావించె. వారికీ కృతి యెట్లైన నంకితము గొన నాశ జనించె. తమ కా గ్రంథ మంకితమిచ్చిన నగ్రహారము లిచ్చెదమని కొందరు, కరితురగ వాహనాదుల నిచ్చెద మని కొందరు నేవేవియో యాసలు గొలిపి మంత్రులచేఁ జెప్పి పంపిరి. కాని శ్రీరామరాజునకుఁ దప్ప మఱియే మానవరాజున కంకిత మీయనని నిరాకరించి పోతన పంపుచుండెను. విరక్తునకు జగమంతయుఁ దృణప్రాయము. అట్టి ప్రపంచములో భూమిలో నేదో యొక మూలలో సహస్రాంశములోఁ దమ కుందు మూరెఁడు నేలలో వ్రేలెఁ డొసంగఁగల రాజులు శ్రేష్ఠులా? సర్వప్రపంచ సృష్టి స్థితి సంహారములకుఁ ప్రభువై భుక్తిముక్తి ప్రదాత యగు భగవంతుఁడు శ్రేష్ఠుడా? బ్రాహ్మణకృతి కన్యను ధనము తీసుకొని నరులకు విక్రయించుతలఁ పాయనకుఁ గలిగినది కాదు. శుల్కము దీసికొని కన్యను బరుల కిచ్చుటకు నేను భోగము వాఁడనుగాను. నా కన్య వేశ్యయుఁ గాదు, పొమ్మనుచుండెను. అట్టి మహాత్ములకుఁ బ్రతిఫలాపేక్ష లేక సాహాయ్యము చేయు సాత్త్వికబుద్ధి యా ప్రభువులకుఁ బుట్టినది కాదు.

సామదానభేదములు వ్యర్థములగుఁట జూచి కర్ణాటక రాజు పోతురాజు దండనమునకు సాధ్యమైనట్టులే పోతరాజు నగు నని తలఁచి దండననీతి నా బీదబాఁపనియందుఁ బ్రయోగింప సమకట్టి యైశ్వర్య ప్రకటనమునకు భయపఱుచుటకు నుపయోగించునని సేనాసమేతుఁడై యొంటిమిట్టకు వచ్చి యుదయమున నూరిలోనికి బోయి పోతనామాత్యుని జూడవచ్చునని యోజించి యాసాయంకాలము కోటవెలుపల విడిచెను. ఊరిలోని వారందఱు నా వార్తవిని యయ్యోరాజు బలవంతుఁడే. సేనాసమేతుఁడై వచ్చినవాఁడే.

దుర్బలుఁ డైన బీదబ్రాహ్మణుని నేమి చేయునో యని భయపడిరి. కొంద ఱాయన కేమేమియో బోధించిరి. కొందఱు శ్రీరాముఁ డేలయాయనను జేయి విడుచు ననుకొనిరి. ఎప్పు డుదయమగునో పోతన విషయమున నేమి విందుమోయని గ్రామజనులు దుఃఖాక్రాంతులై యుండిరి. అప్పుడు భక్తాగ్రేసరుడైన మన కవీంద్రుఁడు వరాహావతార ఘట్టమును దెనిఁగించుచుండెను. ఈ వార్తయంతయు విని యమ్మహానుభావుఁడు తన మనంబున నిట్లు శ్రీరాముని సంబోధించెను. శ్రీరామచంద్రా! యీ నాకృతికన్యను నీకు సమర్పించితిని. సీతాదేవివలె నిదియు నీ సొత్తె. ఆనాఁడేమఱి సీతాదేవిని బోఁగొట్టుకొని కన్న యగచాట్లు పడితివి. ఇప్పుడు నీ యెదురనే దీనిని గొనిపోవఁ గర్ణాటక రాజు వచ్చినాఁడఁట. మానము పౌరుషము గలవాఁడ వైతివేని నీ సొత్తును దక్కించుకొనుము. లేకున్నఁ బోఁగొట్టుకొనుము. కీర్త్యపకీర్తులు లాభనష్టములు నీవిగాని నావి కావు అని నిర్భయుఁడై తన కార్య మందుఁ దా నుండెను.

ఆ రాత్రి మృకండతీర్థసమీప భూమిని సేనాసమేతుఁడై యా రాజు నిద్రింపఁ బ్రక్కపర్వతములనుండి నూర్లకొలఁది యడవి పందులు దిగివచ్చి దండుపైఁ బడి భటులను వధింపసాగెను. వాని ఘుర్ఘురధ్వానంబులకు భటులు మేల్కొనివానిని వధింపఁ జూచిరి. కాని వెల్లివిరిసినట్లు వచ్చు పందులతోఁ బోరాడలేక కొందఱు చచ్చిరి. కొందఱు దిక్కున కొకఁడుగాఁ బరువెత్తిరి. కొందఱు చెట్ల కెగబ్రాకిరి. సేనయంతయుఁ జెల్లాచెదరై పోయెను. చచ్చిపడిన పీనుఁగులు తప్ప జీవించినవాఁ డొకఁడును గానరాఁడయ్యె. వస్త్ర వాహన భూషణము లన్నియుఁ గూడ పాడయ్యె. గుఱ్ఱములు నేనుఁగులు చక్రాతి మీఁదఁబడిన గ్రచ్చకాయలట్లయ్యె. రాజుమాత్ర మెందో పరువెత్తి దాఁగియుండి ప్రాణంబు దక్కించుకొనియె. అరుణోదయముననే గ్రామాధికారులు గ్రామ జను లందలి ప్రముఖులు గుంపుగ రాత్రి జరిగిన దేమియు నెఱుంగక యా రాజును సగౌరవంబుగఁ బిలుచుకొని వచ్చుటకు

మేళతాళంబులతో వేశ్యాజనులతోఁ బోయిరి. రాజొక్కఁడు మాత్రము కట్వస్త్రముతో మొగము వ్రేలవైచికొని కన్నీళ్ళు గ్రుక్కుకొనుచు దిక్కులు చూచుచు నేమిచేయుటకుఁ దోపఁక మిణకరించుచు నొక చెట్టుక్రింద నుండెను. ప్రముఖులు పోయి కుశలప్రశ్నము గావించి యిది యేమి విచారగ్రస్తులై యున్నారు. పరివారమేది? పరిచారకులేరీ? యని ప్రశ్నించిరి. రాత్రి జరిగిన వృత్తాంతమంతయు వారికిఁ దెలిపి కొందఱు చచ్చిరి. కొందరు పురివిచ్చిరి యని పీనుఁగులఁ జూప వా రాశ్చర్యపడి యిట్లనిరి.

మహాప్రభూ! మీకు మేము బోధించువారముగాము. తప్పు పట్టు వారమును గాము. మీరు సదుద్దేశముతో రాలేదనియు భాగవతమునకై పోతనామాత్యుని బీడింప వచ్చితిరనియు వింటిమి. అదియే నిజమేని యాయన యిప్పుడు వరాహావతారఘట్టము వ్రాయుచున్నవాఁడు. ఆయన మహాభక్తుఁడు. విరక్తుఁడు. మీ వార్త యాయనకు మేము చెప్పినపుడు రాముఁడే కలఁడని నవ్వుచుఁ బ్రత్యుత్తర మిచ్చెను. కోపముగాని తాపముగాని వహించిన వాఁడు గాఁడు. అట్టి పరమ సాధువును బాధింపఁ దలంచి నంతటనే మీకింత విపత్తు సంభవించెను. పీడించియే యుండిన మీ రేమై యుందురో. మీ రాజ్య మేమైయుండునో. గతించినదానికి శోకించి ప్రయోజనము లేదు. మీరు వచ్చి యిమ్మహాత్ముని శ్రీరామచంద్రమూర్తిని దర్శింపుఁడు. మీకుఁ గావలసినవి మే మేర్పాటు చేసెదమని చెప్పిరి.

ఘోషయాత్రకుఁ బోయిన దుర్యోధనులవలెనై యా రాజు వారివెంటఁ బాదచారియై గ్రామములోనికిఁ బోయి రొండిని దాటి యాకులు గంటమును జెక్కి మడికిఁ బోవ దున్నపోతులను గాడికిఁ గట్టు నమ్మహాకవివర్యునిఁ జేరఁ జని చుట్టుదిరిగి సాష్టాంగనమస్కారము చేసి నిలువంబడియె. పోతనయు నాయన గూర్చుండఁ దనకున్న చింపిచాఁపఁ దెచ్చెనుగాని యింతలో రెడ్లు కరణాలు మంచి చాఁపలు తివాచీలు దెప్పించిరి. 'సాధువర్యా! నా యపరాధమును గర్వమును క్షమింపుము. అహంకారమత్తుఁడనై మీకు

నెగ్గు దలంచితిని గాని నివురుగప్పిన నిప్పువంటి మీ మాహాత్మ్య మెఱుంగనైతి. సాధువులకు నెగ్గులెంచువాఁడు లగ్గెన్నటికిని గానఁడు. రాజనను గర్వంబున నిట్లైతి. క్షమింపుడు. మీ పాలివేలుపు శ్రీరామచంద్రమూర్తి నాపై నాగ్రహించిన వాఁడు. ఆయనను దర్శించి వత్తము రండని తోడుకొనిపోయి శ్రీరాము దర్శించెను. ఇంతలోఁ జెదరిపోయిన భటు లొక్కరొక్కరే వచ్చి చేరిరి. ఆనాఁ డంతయు నా ప్రభు వొంటిమిట్ట యందే యుండి మఱునాఁడు తన పట్టణమునకుఁ బోయెను.

ఆవల గజేంద్రమోక్షణఘట్టము వ్రాయునపుడు పోతన

**మ. అలవైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబుదాపల**

నని వ్రాసి యావల నేమివ్రాయుటకుఁ దోఁపక గంటము తాటాకులు నింటియందుంచి యాలోచన చేయుచు వెలుపల సంచారము పోయెను. ఈ పద్యము మూలము ననుసరించి వ్రాసినది గాదు. వైకుంఠపురములో మూలసౌధంబులో భగవంతుఁ డేమి చేయుచుండెనో యెట్టు లూహింపఁ గలడు? అభిప్రాయము తోఁపక పద్యము సరిగాఁ గుదురకపోయినపుడు కవులొంటరిగా నెందైనఁ బోవుట స్వభావము. అట్టులే యాయనయుఁ బోయి ప్రారంభించిన పద్యమును సాంతము చేయవలయునే యని యేదో యొక విధముగాఁ బూర్తి చేసికొని వచ్చెను. ఈ లోపలఁ బోతనామాత్యుని వలెనే యొకరు వచ్చి యాయన భార్య నడిగి యాకు లిప్పించుకొని యా పద్యము తరువాయి

**మందార వనాంతరామృత సరఃప్రాంతేందు కాంతోపలో**
**త్పల పర్యంకరమావినోది యగునాపన్న ప్రసన్నుండు వి**
**హ్వల నాగేంద్రము పాహిపాహి యనఁ గుయ్యాలించి సంరంభియై.**

అని పద్యమును పూరించి పోయెను.

ఆవల మఱికొంతసేపటికిఁ బోతన వచ్చి యాకులలోన పద్యము పూర్ణముగ వ్రాయఁబడి యుండుట జూచి యాశ్చర్యపడి భార్యను బిలిచి

నేను లేనప్పుడు తాటాకు లెవ్వరియొద్ద నీయవలదని చెప్పి యుంటినే. యెవరు వచ్చియుండిరి? ఎవరి యొద్ద నిచ్చితివి? ఈ పద్యము నెవరు పూర్తి చేసిరని యడిగెను. ఆమె నివ్వెరపడి "యిది యేమి యిట్లు మాటలాడెదరు? ఇంతకు ముందు మీరేకదా వచ్చి యాకుల నడిగి యిప్పించుకొని వ్రాసి పోయితిరి. ఇప్పుడెవరు వ్రాసిరని యడిగెదరేమి?" యని యడిగెను. పోతనయు నాశ్చర్య సంతోష శోక మగ్నుఁడై యేమీ! నేనే వచ్చి వ్రాసి పోయితినా? యనెను. అవును మీరే వ్రాసి పోయితిరి. మిమ్మె నేను గుర్తింపఁ జాలనా! యనెను. పుణ్యాత్ములారా! వచ్చినవాడఁను నేనుగాను. వ్రాసినవాఁడను నేను గాను. నా యక్షరములు కీయక్షరములకుఁ బోలిక చూడుము. వ్రాసినవాఁడు శ్రీరాముఁడే. నా యందలి యీయన కరుణకు సంతోషించితిని. కాని నీకిచ్చిన దర్శనము నా కీయడాయెఁ గదా. హా! నేనంతటి పాపాత్ముఁడను. నీవెంత పుణ్యము చేసితివో. నీ పుణ్యము నేను జేయనైతిఁగదా! యని శోకించెను.

ఈయన మహిమయు దారిద్ర్యము కర్ణాటక రాజున కయిన పరాభవ మాంధ్రలోకంబున వ్యాపించెను. అప్పుడు దిగ్విజయంబు చేసి మహా ప్రసిద్ధుఁడై యుండిన శ్రీనాథమహాకవి యీయన ప్రసిద్ధి విని యీయనను జూడవచ్చెను. నందలూరు మార్గమునఁ జెఱువుకట్టపై బమ్మెరపోతన గ్రామమందున్నాడా ఎందున్నవాఁడని విచారించుకొనుచు వచ్చి "యదో కట్టక్రింద దున్నపోతులతో భూమి దున్నుచున్న వాఁడే పోతన" యని కొందఱుచూప నాఁహాఁ యని యాయన ప్రసిద్ధికి నాయనయుండు స్థితికి నాశ్చర్యము విషాదము వహించి తన మహిమ యాయనకుఁ దెలుపఁగోరి యీ మడి యిప్పటికిని బోతన మడియనియే పిలువఁబడుచున్నది. చెఱువుకట్ట నీ మడికి ౧౫ బారల దూర ముందును. తన పల్లకి ముందువైపు మోయు బోయల బొంగు విడిచి పొండని చెప్పెను. ముందుప్రక్క మోయు వారును లేకున్నను బల్లకి నేల వ్రాలకయే పోవుచుండెను. దానిని జూచి

పోతనామాత్యుని కొడుకు తండ్రితో "నాయనా యా వింత చూడుము. ముందుప్రక్క మోయువారు లేకున్నను బల్లకి పోవుచున్నది" యనెను. పోతన చూచి పరివార సమేతుఁడై వచ్చుచున్నవాఁడు శ్రీనాథుఁ డని గ్రహించి నాయనా నీ వీడాపటి పోతును విడిచివేయు మనెను. ఆ బాలుఁ డట్లే కావించెను. ఒక ప్రక్క దున్నపోతు లేకున్నను నాగఁటి మ్రాను నేల వ్రాలక యెప్పటియట్ల పోవుచునే యుండెను. శ్రీనాథుఁ డదిచూచి రెండవప్రక్క బోయలను బొంగు విడువుఁ డనెను. అట్లు మోయువారు లేకున్నను బల్లకి క్రిందఁబడ దయ్యెను. పోతనయు రెండవవైపు పోతును విడిచెను. కాఁడి క్రిందఁబడినది కాదు. శ్రీనాథుఁడు సరస్వత్యుపాసకుఁడు. పోతన శ్రీరామోపాసకుఁడు. తన భక్తుని గౌరవము కాపాడ రామలక్ష్మణులే కాడి మోసి నేలఁ బడకుండఁ జేసిరి. గోవువెంటఁ దగులు కోడెభంగి భక్తుల నెప్పుడును భగవంతుఁడు కాచియే వెనువెంట దిరుగు చుండును.

భక్తులు తమ మహిమను సామాన్యముగ వెలిపుచ్చరు. అయినను దమ్మవమాన దృష్టిఁ జూచు గర్వగర్విష్ఠుల యహంకార పిశాచమును బాఱఁ దోల నెందేని గనఁ బఱుతురు.

శ్రీనాథుఁడు నాయన మహిమకు మెచ్చుకొని పల్లకి దిగి మడిలోనికి వచ్చి కుశల ప్రశ్నంబుగావించి హాలికులా? యని పరిహసించెను. వెంటనే పోతనయు,

**ఉ. బాలరసాలసాల నవపల్లవకోమల కావ్యకన్యకన్**
**గూళలకిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకంటె సత్కవుల్**
**హాలికులైననేమి? గహనాంతరసీమలఁ గందమూల కౌ**
**ద్దాలికులైననేమి నిజదార సుతోదర పోషణార్థమై?**

అని బదులు చెప్పెను. "బావా! నవ్వులాట కనిన! గోపమా" యని శ్రీనాథుఁ డడుగ నాయనా నాకుఁ గోపమెక్కడిది? అడిగిన దానికిఁ బ్రత్యుత్తర

మిచ్చితిని. కన్నకూఁతునకుఁ గష్టించి సృష్టించిన కావ్యకన్యకకు నేమిభేదము? రెండును భగవద్దత్తములే. అందుఁ గన్న కూఁతుకన్నఁ గావ్యకన్యయే మిన్న యని నా యభిప్రాయము. అట్టి కన్యను దగిన వరున కియ్యవలయునుగాని ధనమున కాశించి యంగడిఁ బెట్టి యెవఁడు ధనమెచ్చుగ నిచ్చునో వాని కియ్యవచ్చునా? అటైన నా కన్యకు వేశ్యకు నేమిభేదము? అట్లు చేసి యా ధనముతో జీవించు కవికిని, భోగముదాని తండ్రికి నేమిభేదము. ఈ విషయము నీకు మనస్సునకు రావలయునని నా యభిప్రాయము. భార్యల మూలమున నాఁడు బిడ్డల మూలమున వచ్చు ధనముచే రాఁగల గౌరవము నీచము. అట్టి ధనముచే జీవించుటకంటె దున్ని బ్రతుకుట చాల నుత్తమము. ఆపద్ధర్మంబుగ బ్రాహ్మణుఁ డిట్లు సేయుట యశాస్త్రీయంబు గాదుగదా. అనిన నదట్లుండనీ ఇంటికిఁ బోదము రమ్ము అని పిలిచినఁ బోతనయు నే నీకయ్య దున్ని వచ్చెదను. నేల పదునాఱిన మరల దున్నుట కష్టము. నీవింటికిఁ బొమ్ము. నేనిదో వచ్చెద నని కొడుకును దోడిచ్చి పంపెను. శ్రీనాథుఁడును బరివారముతోఁ బోతన యింట దిగెను.

బీదకాఁపురము. ఇల్లా యయ్యవార్ల వారి తిరుమాళిగె వలె నున్నది. ఇంత పరివారమున కొక్కసారిఁగ గావలసినంత బియ్యము బేడలు లోనైన వెందున్నవి. అందు శ్రీనాథుఁడు సంపన్నుఁడు. ఆయన యోగ్యతకుఁ దగినట్లు లుపచరింప వలయును. ఏమి చేయుదునురా రామా యని పోతన భార్య భగవంతు ధ్యానించెను.

**రాగము - తాళము**

నాఁటి రఘురాముఁ – డీనాఁ డిచ్చట లేఁడా
మానక పరితాప – మందె దేటికి మనసా
దుర్వాసుఁ డరుదేర, ద్రౌపది కార్యంబు
నిర్వహించిన నవ, నీరజనేత్రుఁడు
వరనిజభక్తుల, యురుయోగక్షేమము

భరము దాల్తు నన్న, పరమదయాళుఁడు.
రామరామ నీవె, రక్షింపు మీవేళ
మామానమును గాచి, క్ష్మాపుత్రికాలోల,
వాసుదేవుఁడ వని, భక్తిని సతతము
భాసురముగ నిన్నె, పాడుచుండుఁ గద.

అని యనేకవిధముల శ్రీరామచంద్రు ధ్యానించుచు వచ్చిన వారికెల్లఁ బాద్యమిచ్చి కుశలప్రశ్నంబుఁ గావించి యాదరించు చుండెఁ గాని మనస్సులో నిందఱ కేమివంట చేయుదును? ఇందఱకు వలసిన సామగ్రి యెందుఁ దెత్తును? ఆయన వచ్చినను నెందుఁ దెచ్చును? అప్పుడగుదు నన్న నిఱుపేదల కెవ్వరిత్తురు? అని యాలోచించుచు శ్రీరాము ధ్యానించుచు నుండె. ఇంతలో వర్తకుఁడు వచ్చి యమ్మా మన యింటికెవరో చుట్టములు వచ్చినారఁట. తాను వచ్చు లోపల వంటచేసి సిద్ధముగ నుంచు కొమ్మని మీకుఁ జెప్పుమని యయ్యగారు చెప్పినారు. కావలసిన వస్తువులన్ని తెచ్చినాను. తీసికొనుఁడని నాలుగైదు గోతముల మేలైన బియ్యము పప్పులో నైనవి సర్వపదార్థముల నిచ్చి పోయెను. ఆమెయు నుప్పొంగి స్నానము చేసి షడ్రసోపేతముగ వంట సిద్ధము చేసెను.

దరిద్రునకు లోభికి బంధులరాక యమకింకరులరాక సమానములు. ఇందఱేకకాలమున వచ్చిన వీరికి భోజన మేమి పెట్టుదును! ఎక్కడ నుండి తెత్తును? ఎవ్వరిత్తురు? అని యిట్లా లోచించుచుఁ గార్యము తడఁబడదే నాఁటికొక్క దైవములేఁడే యని ధైర్యము తెచ్చుకొనుచు బియ్యపుగింజలకై శ్రీరామునేమని ప్రార్థింతునని చిన్నపోవుచుఁ గొఱఁతకయ్యదున్ని దున్నపోతులఁ దోలుకొని వచ్చి గాఁట గట్టివైచి యేమి చేయుటకు నెవ్వరి నడుగుటకుఁ దోఁపక విషణ్ణవదనుఁడై భార్యను జేరఁబోయెను. ప్రసన్న వదన యయి యామెయు "నేమి యింత జాగు చేసితిరి. వారందఱు కాచుకొని యున్నారే. స్నానము చేయుఁడు. తీర్థమునకుఁ బోయినఁ జాల

సేపగును. ఇంటనే స్నానము చేయుండనెను. ఆయనయు స్నానము చేసిన భోజన మేమి పెట్టెదవు?" అని యడిగెను. అదియే మట్టు లనెదరు? మీరు పంపితిరని రామసెట్టి లక్ష్మణసెట్టి యను వైశ్యులు వచ్చి కావలసిన సామగ్రి యిచ్చి పోయినారు. వంటయైనది. మీదే యాలస్యమని పదార్థములఁ జూపెను. నే నెవ్వరికిఁ జెప్పలేదే యని పోతన యనెను. అది యేమో మీరు పంపినారని యిచ్చి పోయినారు. ఈ యూరివారా? కారు. క్రొత్తవారు. ఆ మాటలు విని పోతన యోసీ నీ పుణ్యమే పుణ్యము. శ్రీరాముఁడే వర్తకుఁడు రామసెట్టిగా వచ్చి నీకు దర్శన మిచ్చెను. నే నేవర్తకునకుఁ జెప్పనులేదు. ఎవరిని బంపను లేదు. శ్రీరామునకు నీయందుఁ గల మక్కువ నాయందు లేదు అని చెప్పి స్నానము చేసి శ్రీనాథునితోడఁ గూర్చుండి భుజించెను.

భోజనానంతర మిరువురు మహాకవులు సరసల్లాపగోష్ఠి నుండు సమయంబున శ్రీనాథుఁ డిట్లనియె. కవీంద్రా! నీ స్థితి బరితాపకరముగా నున్నది. నీ మేలు కోరి నీ కొక హిత ముపదేశించెద. కోపింపకుము. శరీర మాద్యం ఖలు ధర్మసాధన మ్మను నార్యసూక్తి కలదు కదా. దేహము బాగున్న నన్ని కార్యములు సుకరములు. నీవు కవీంద్రుఁడవు. కవిత్వము మనః కార్యము. కాయము దృఢముగా నున్నఁగదా మనస్సు దృఢముగ నుండును. నిఱుపేదవై సౌఖ్యహీనుఁ డవై కృషియందుఁ గాలము గడపు నీ మనస్సు చక్కఁగాఁ బనిచేయఁ గలదా? సుఖభోజనము సుఖానుభవము, రసిక జనగోష్ఠి, లోకవార్తా జ్ఞానములోనైనవున్నఁగదా నిత్యము రసవంతమై యుండును. ధనము లేకున్న నివి యెట్లు లభించు. ఇహపరములు ధనైకసాధ్యములు. ఇహపరములు రెండును సాధింప యత్నించుట బుద్ధిమంతుల లక్షణము గాని పరమున కని యిహమున నాశనము చేసికొనువాఁడు పక్వ క్షేత్రమును వదలి యరణ్యమును దున్న యత్నించు వాని వంటివాఁడు. నారాయణు సేవించువాఁడవు లక్ష్మినేల నిరాకరించెదవు? తలచుట్టము తోఁక పగ గలదా?

అదియునుగాక పెరటిచెట్టు మందునకుఁ బనికిరానట్టు కవియుఁ దపసియు విద్వాంసుఁడు స్వగ్రామంబునఁ బూజితులు గారు. కొండలోఁ బుట్టిన సంజీవనిమహిమ యందలి ఊాలు అప్ప లెఱుంగనట్లు మహాకవియు భక్తాగ్రేసరుఁడవు నైన నీ మహిమ నిచ్చటివా రెఱుంగఁజాలరు. పరమండలంబుల నీవు మహానుభావుఁ డవని భావింపఁ బడుచుండ నిచ్చట నీ స్థితిగతులు విచారించువారును లేరు గదా. నీయట్టివాఁ డిట్టిహీన స్థితియం దుండనగునా?నిది రాక్షసభూమి గావున రాక్షసకృత్యములు వీరి కర్హమైన నగుఁగాక. నీకు శ్రమకరములు గదా. ఇది యేమి నీకుఁ గాణాచియా? ఇట్టి మాన్యములు నీకు నింతకుఁ బదియంత లిప్పించెద రమ్ము. భక్తిశూన్యులై బోయవృత్తినుండు నీ గ్రామజనులతో, మనుష్య రూపక్రవ్యాదములతో నీకు సాంగత్యమేల?

ధనము నాకెటులభించునందువా?

**కం. కమ్మనిగ్రంథం బొక్కటి**
**నిమ్ముగ నే నృపతికైన నిచ్చినచోఁ గై**
**కొమ్మని యియ్యఁడె వెయ్యా**
**ర్లిమ్మహి దున్నంగ నేల యిట్టిమహాత్ముల్.**

అని బోధించినఁ బోతనామాత్యుఁ డిట్లనియె.

మహాకవీ! నీవు సర్వజ్ఞుడవు. నీతో వాదించు శక్తి నాకు లేదు. అయినను నా యభిప్రాయంబు వినుము. మనుష్యులకు మార్గములు రెండు. ప్రవృత్తి మార్గము. నివృత్తిమార్గము నవి. ప్రవృత్తి మార్గ నిష్ఠున కీలోక సుఖములందే దృష్టి, నివృత్తిమార్గ నిష్ఠునకు మోక్షమందే దృష్టి. ప్రవృత్తి మార్గము చక్రము వంటిది. దానియందుఁ బయనించువాఁడు వచ్చినచోటికే యెన్నిమార్లైన వచ్చుచుండును. విరామము లేదు. నివృత్తి మార్గము వింటి నుండి వెలువడిన బాణమువంటిది. నిలుచుట లేదు. ఈ యుభయమార్గము లందుఁ బ్రయాణము చేయువారి కిరువురకు దేహమే యశ్వవాహనము. ప్రవృత్తిమార్గ

నిష్ఠుఁడు గుఱ్ఱమును దనపై నెక్కించుకొని మోసికొనిపోవును. తిండి విశేషముగఁ బెట్టుటచేతను దాని యిష్టము వచ్చి పోయిన మార్గమునఁ దాను బోవుటచేతను దేహము గర్వించి వానికి వశపడక వానినే తన వాహనముగాఁ జేసికొని యిష్టసంచారము గావించుచుఁ గన్న త్రిప్పులఁ బెట్టి తుదకు నరకమనుగుండములోఁ ద్రోయును. నివృత్తిమార్గనిష్ఠుఁడో యెట్టి యాహారము నెంత మాత్ర మిచ్చినఁ దన గుఱ్ఱము గర్వింపక యారోగ్యము చెడక దీలుపడక తాను జెప్పినట్లు విని తన్ను మోసికొని పోయి గమ్యస్థానముఁ జేర్చునో యంతమాత్రము మేపే దానికిఁ బెట్టును. ఆఁకలి చిచ్చార్చుటయే భోజనోద్దేశమేని పంచభక్ష్యములతో శాల్యన్నము దినుటకు నంబలియో గంజియో రాగిసంకటియో జొన్నరొట్టెయో తినుటకును భేదమేమి? దాహ మణఁచుటయే ప్రయోజనమేని బంగారుపాత్రమునఁ గలకండపానకము ద్రావిననే దాహ మణఁగును గాని రామతీర్థమందో వంకయందో చెఱువునందో దోసిటనో ముంతతోనో చిప్పతోనో ఇత్తళి పాత్రముతోనో కమ్మని చల్లనినీరు ద్రావిన దప్పి యాఱదా? మాన రక్షణము వస్త్రధారణమున కుద్దేశమేని జలతారు దుకూలములు సాలువ లైనను దుప్పట్లు కౌపీనము లైనను నారపట్టలు నాకులలములైనను సమానములే కదా.

పరుండుటకు సుఖనిద్రయే యుద్దేశ మేని హంసతూలికా తల్పంబున శయనించు నీకును జిటిచాఁపపైఁ బరుండు నాకును సంతోషము ప్రయోజనము సమానములే కదా. అట్లుండ పదార్థములు సంపాదించుటకు నీవెక్కువ కష్టపడుచున్నావో నే నెక్కువ శ్రమ పడుచున్నానో యోజింపుము. సజ్జనసమ్మతములు నిష్పాపములు. నీవు చేయుపనులో నేను జేయుపనులో యాలోచింపుము. మన యిరువురకు లభించు ఫలములు సమానములా, తలపోయుము. ధనము ధనము నని యంటివి. ధనమెంత మాత్రము మనకు రావలయునో యంతే వచ్చును గాని యెక్కువ శ్రమించి చేయరానిపనులఁ జేసినంత నెక్కువ వచ్చునా? ఒక కడవను సముద్రమున ముంచిన నెంతనీరు

పట్టునో బావియందు ముంచిన నంతే కదా పట్టును? ఆర్జించినను నది శాశ్వతమా? ధన మెంత సంపాదించిన నాశలుడుగునో చెప్పుము. కామ మనంతము? ఇహము సాధించుట బహుసుకరము? తృప్తిచే నిహమును దృటిలో జయింపవచ్చును.

సుఖదుఃఖములు మనఃకల్పితములుగాని వస్తుకల్పితములు గావు. దుఃఖము నొసఁగక సుఖమును మాత్రమే సర్వకాల సర్వావస్థల నిచ్చునది వైరాగ్యమే కాని యితర మేదియు గాదు.

వైరాగ్య భక్తులచేతనే పరము సాధ్యము. నారాయణు సేవించు వాఁడు లక్ష్మి నేల నిరాకరించెదవంటివి. లక్ష్మి యేది కోరిన నది యిచ్చును గాని దానివలనఁ గలుగు ఫలము నీవే యనుభవింపు మనును. ధనమును గోరితివా యది యిచ్చిదాని ఫలమనుభవింపుమనును. ధనము దుఃఖాంతమే. అది నీవే యెఱుఁగఁగలవు. మోక్షమును గోరితినా మోక్షమిచ్చును. నీవు ధనలక్ష్మిని సేవించెదవు. నేను మోక్షలక్ష్మిని సేవించెదను. కృతి నే ప్రభువున కైన నిచ్చి ధన మార్జింపుమంటివి. కన్యయుఁ గావ్యకన్యయు సమానలు. దారసుతా భగినీ భగభవవిభములచేఁ ద్రుళ్ళిపడువానిని నీవు గౌరవింతువా? నీవు నన్నుఁ జేయుమని చెప్పినపని యట్టిది కాదా? పూర్వజన్మసుకృత పరిపాకమున నన్నుఁ దానై వరించి లభించిన కవితాకాంతను బరుల కప్పగించి తన్మూలమున జీవింతునా? నాకింత మాత్రము ధనమిచ్చిన నాకాంతను గన్యను నీకు ధారపోసెదనని యాచించితినేని జాయా జీవుఁ డైన నట్టువవానికి నాకు నేమిభేదము? కవిత్వము యోగసిద్ధులలో నొకటిగాదా. దేవతాకార్యమునకో లోకోపకారార్థమో పరులను యాచింప వచ్చును గాని యాత్మార్థము యాచించుట నింద్యము. పాపావహము నిషిద్ధము కాదా. నట్టువ వాడైనను దన్ను వెదకు కొనుచుఁ దనయింటికి వచ్చి తాను గోరిన ధన మిచ్చిన వారియొద్దకే తనయాఁడు వాంఛ్ర నంపును గాని తాను బరుల యిండ్లకుఁ బోయి నాదారసుతలను నీకప్పగించెద

నాకు ధనమిమ్మని యడుగఁడు గదా. వాఁడు చేయని కార్యముఁగూడ నన్ను జేయుమని చెప్ప నీకెట్ల నోరాడెను?

అయ్యా! గ్రామమును గ్రామజనుల నేల దూషించెదరు? వా రెట్టివారైన మనకేమి? మనము సద్వృత్తి నున్న మనలఁ జూచియైన వారు నేర్చుదురు గాక. ఒకవేళ దూషించిరిపో. నన్నెవరు దూషించిన నేమి? ఎవరు భూషించిన నేమి? నన్ను మహాత్ముఁడని యంటివి. మహాత్ములగువారు సమ్మానమును గాలకూటమువలెను. దరుణిని శవమువలెను. సభను నాఁడు పాముపలెను, రాజధానిని గుంభీపాకమువలెను జూతురన్న విషయమెఱుంగవా? ఇది శ్రీసీతారామలక్ష్మణ చరణారవింద పరాగపవిత్రితమైన భూమి. ఇచ్చటి తీర్థము శ్రీరామబాణము మార్గము వెంటఁ బాతాళలోకంబు నుండి యరుదెంచిన దివ్య పాతాళగంగ. ఇచ్చటి శ్రీరాములు భక్తుల పాలిటికిఁ గల్పవృక్షము. ఇంతకు మించి మఱియేమి కావలయును? ఈ జన్మంబు నందు కాదు. మరల మరల భూమిపై జన్మించుచుండు వఱకు నీ స్వామిసేవ నాకు లభించుచుండునుగాక. అనుచుండు సమయంబున నటుకపైనున్న గ్రంథములందు సరస్వతీదేవి యథాస్వరూపముతోఁ గన్నుల నీరు కార్చుచు గోచరించిన నామెను జూచి భక్తాగ్రగణ్యుం డిట్లనియె.

**ఉ. కాటుకకంటినీరు చనుగట్టులపై పడ నేల యేడ్చె దో**
**కైటభ దైత్యమర్దనుని గాదిలికోడల యోమదంబ, యో**
**హాటకగర్భురాణి నిను నాఁకట గ్రాసము కోసరంబు క**
**ర్ణాట కిరాట కీచకుల కమ్ముఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ.**

అని చెప్పిన విని శ్రీనాథుఁ డా ప్రస్తావముఁ జాలించి యేదీ నీవు వ్రాయు భాగవతము చూతమని కోరిన పోతనయు నాకులఁ దెచ్చి యిచ్చెను. అందు

**మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయిసంధింపఁ, డే**
**పరివారంబును జీరఁ, దభ్రగపతిం బన్నింపఁ, దాకర్ణికాం**

**తరధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు, వివాదప్రోత్థిత శ్రీకుచో**
**పరిచేలాంచల మైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.**

అను పద్యము జదివి యాహా యేమికవిత్వ మేమికవిత్వము. మకరిని జంపి కరిని రక్షింపఁబోవువాఁడు చక్రములేక ఖడ్గము లేక కత్తిలేక యేమి చేయఁబోయెనో యని యాక్షేపించెను. దానికిఁ బోతనామాత్యుఁడు ప్రత్యుత్తర మేమియుఁ జెప్పక భక్తిహీనుల తెలివి తేటలింతయే కాఁబోలు ననుకొని యూరకుండెను.

మఱునాఁడు శ్రీనాథుఁడు తలంటుకొనుచుండెను. ఆయన కుమారుఁ డచ్చటనే యాడుకొనుచుండెను. నూనె ఎక్కువగుటచే దిగజాఱి కన్నులలోఁ బడఁ గన్నులు మూసికొని శ్రీనాథుఁ డుండెను. అప్పుడు పోతరాజు తటాలున నా కుమారుని నెత్తికొనిపోయి ప్రక్క యింటదాఁచి యొక గుండెత్తి దొడ్డిలో నుండు నేలబావిలో వైచి యది గుభాలున శబ్దింప నయ్యోబావా! నీ కుమారుఁడు బావిలోఁ బడెనని కేక వేసెను. నాయనా! నాయనా! యని శ్రీనాథుఁడు చేతులతోఁ గన్నులు దుడుచుకొనుచుఁ దెఱువరాకున్నను యాదర బాదర పడుచు లేచుచు వచ్చుచుండెను.

అప్పుడు పోతరా జడ్డము పోయి బావా యిది యేమిట్లు రిత్తచేతులఁ బోయెదవు? బావిలోఁ బడిన పిల్లవానిఁ దీయుటకు నిచ్చెన త్రాళ్లు మొదలైన సాధనములు తీసికొని పోక యిట్లు పోయి యేమి చేసెదవు? నీవును దూఁకెదవా? యనెను. పరిహాసమున కిదియా సమయమని శ్రీనాథుఁడు తత్తరలాడుచుఁ బరువెత్తుచుండ బావా! భయపడకుము. నీ కుమారుఁడు సురక్షితుఁడై జీవించి యున్నాఁడు అని వానిని దెచ్చి యిచ్చి పోతరాజు మఱియు నిట్లనియె. మనుష్యమాత్రుఁడ వగు నీకే యింత వాత్సల్య ముండిన జగజ్జనకుఁడై కరుణాసముద్రుఁడై వాత్సల్య సౌశీల్యాద్యనంత కల్యాణగుణగణ యుక్తుండైన శ్రీమన్నారాయణునకు భక్తుల మొఱ విని నప్పు డెట్లుండునో

మన మూహింపనైన గలమా? సాధనహీనుఁడవై నీవేమియుఁ జేయఁజాలవు. సంకల్ప మాత్రమున జగంబులను సృష్టించి రక్షించి లయం బొనర్పఁ జాలు సర్వశక్తునకు సత్యసంకల్పునకుఁ జేత నాయుధము లేకున్న నేమి లోటు? నిన్న నీ వాక్షేపించినపు డీమాత్ర మూహింపఁజాలవైతివి కదా. కుచేలున కైశ్వర్యమిచ్చిననాఁడు తన యింటనున్న ధనధాన్యాదులను గంపలతో నెత్తుకొనిపోయి యాయన యింట గుమ్మరించి వచ్చెనా? ద్రౌపది కిచ్చిన వలువల నే మగ్గంబుల నెప్పుడు నేసె? సర్వజ్ఞుఁడవైన నీకుఁ దెలియనాయెఁ గదా యనెను. ఆవల నొకటి రెండుదినము లుండి శ్రీనాథుఁడు వెడలిపోయెను.

దశమస్కంధమున రుక్మిణికల్యాణఘట్టము వ్రాయునపుడు రామతీర్థంబు నొడ్డునఁ గూర్చుండి మడికాచుచు

**సీ. దేవకీసుతుకోర్కి తీఁగలు వీడంగ**
**వెలఁదికి మైదీఁగ వీడఁ దొడఁగెఁ**
**గమలనాభుని చిత్తకమలంబు వికసింప**
**గాంతినింతికి ముఖకమల మొప్పె**
**మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ**
**బొలఁతికి జనుదోయి పొడవుసూపె**
**శౌరికి ధైర్యంబు సన్నమై డాయంగ**
**జలజాక్షి మధ్యంబు సన్నమయ్యె**

**ఆ. హరికిఁ బ్రేమబంధ మధికంబుగాఁ గేశ**
**బంధ మధిక మగుచు బాలకమరెఁ**

అని యింతవఱకు వ్రాసి మడిలో నేదో పనిపడి లేచిపోయెను. ఇట్లాయన మడిలో నుండు సమయంబున నింటినుండి పెద్దకూఁతురు పరువున వచ్చి నాయనా! తొట్టెలో మన పిల్లయున్నట్లుండి దేహమంతయు నిప్పుసోఁకిన గమరునట్లు మరి చచ్చిపోవు స్థితిలో నున్నది. ఇంతకుఁ బోయి యుండును.

అనినఁ దన వ్రాఁత జ్ఞప్తి తెచ్చుకొని బాలకమరె నని నేనొక యర్థంబున వ్రాసిన నది విష వాక్యయ్యె నని తలఁచి వెంటనే యాకుగంటము తీసికొని

**పద్మనయనుమీఁది ప్రమదంబు నిండార**
**నెలఁత యౌవనమున నిండియుండె.**

నని వ్రాసి భయములేదు పొమ్మని చెప్పి తాను నింటికిఁ బోయెను. ఇంతలో నింటిలో నేడ్పులార్పులు నయి యిరుగొమ్మలు పొరుగమ్మలు వచ్చి చూచి యయ్యో బంగారుబొమ్మ వంటి బిడ్డ కింతలో నేమమ్మా యిట్లాయె నని గడ్డము మీఁద వ్రేలిడి యాశ్చర్యపడు చుండ బిడ్డ మరల జీవించి యాడుకొనుచుండెను. చచ్చినబిడ్డ బ్రతికెనని మరల నందఱు నాశ్చర్యమగ్నులైరి.

ఆంధ్రవాల్మీకిరామాయణము వ్రాయునపుడు శ్రీరాముఁడు తండ్రికి నీళ్ళు విడుచు ఘట్టము వ్రాయునపుడును, వాలివధ సమయంబునను, నాగపాశబంధము వ్రాయునపుడును నంకిత మిచ్చు సమయంబునను నిట్టి యనుభవములే వీనికిఁ గలిగినవి. వీని నెఱిగినవారు నేఁటికి నున్నారు. గాని యవి వివరించుట యాత్మశ్లాఘగ నుండునని విరమించితి. జగజ్జనకుఁడు సర్వజ్ఞుఁడు సర్వశక్తుఁడు దయామయుఁడు భక్తజనయోగ క్షేమముల వహించువాఁడు నగు భగవంతుఁ డొకఁడున్నాఁడని దృఢవిశ్వాసము గలవారి కందఱకు నన్ని దేశంబుల నన్నికాలముల నిట్టి యనుభవములు కలుగు చుండును. నాస్తికులకుఁ దత్సములకు నివి వింతలు విపరీతములుగఁ దోఁచును గాని భక్తుల కవి సామాన్య విషయములే.

శ్రీనాథుని యంత్యదశయే కేవలమైశ్వర్యము నమ్మిన వారి గతిని ఘోషించును? ఆయన స్వయముగ నెట్లేడ్చెనో చూడుఁడు.

**సీ. కవిరాజుకంఠంబుఁ గౌఁగలించెను గదా.**
**పురవీథి నెదురెండఁ బొగడదండ**
**సార్వభౌముని భుజస్తంభ మెక్కెను గదా**
**నగరివాకిటనుండు నల్లగుండ**

ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబునఁ
దగిలి యుండెను గదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేతి
వియ్యమందెను గదా వెదురుగొడియ॥

గీ. కృష్ణవేణమ్మ కొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు దినిపోయెఁ దిలలుఁ బెసలు
బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్లు చెల్లింతు టంకంబు లేదునూర్లు.

సీ. కాశికా విశ్వేశుఁ గలసె వీరారెడ్డి
రత్నాంబరంబు లేరాయఁ డిచ్చుఁ
గైలాసగిరిఁ బండె మైలారు విభుఁ డేగి
దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు
రంభఁ గూడెఁదెనుంగు రాయరాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మతిహేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు

గీ. భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగెఁ
గలియుగంబున నిఁకనుండఁ గష్టమనుచు
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి
దివిజకవివర్యు గుండియ ల్దిగ్గురనఁగ.

దారిద్ర్యమున కేడ్చుచు శ్రీనాథుఁ డిట్లు మరణింప పోతనామాత్యుఁడో భాగవతరచనానంతరము సర్వసంగపరిత్యాగముఁ గావించి కుటుంబరక్షణ భారంబు కుమారునిపై వైచి శ్రీరామతీర్థంబు సమీపంబున నుండు గుహ యందుండి మితాహారుండై మోక్షాపేక్ష నిరంతర భగవద్ధ్యానపరుండైన

యమ్మహానుభావునకు నొకనాఁటి స్వప్నంబున శ్రీరామచంద్రుఁడు గోచరించి హింసాత్మకంబయిన కృషి జీవనోపాయంబుగఁ గొనుటం జేసి నీ కీ దేహాంతమున ముక్తి లభింపదు. మఱుజన్మంబున మదర్థంబుగ లోకోపకారక కార్యంబు లొనర్చి మూఁడవ జన్మంబున నీ తీర్థంబు తీరంబున నిస్సంగుండవై ఋషిచర్య ఘోరతపంబుఁ గావించి మదీయసాయుజ్యంబు గాంచెదవని యాదేశించి తిరోహితుండైన నమ్మహాకవి మేల్కొని స్వప్నవిధంబు స్మరించి యోహో భగవంతుండు శ్రీరామచంద్రుండు నాకు మూఁడవ జన్మంబున సాయుజ్యంబు ప్రసాదించె. ధన్యుఁడ నైతిని. భగవదనుగ్రహంబు నాపై నుండ మూఁడు జన్మంబులైన నేమి? మున్నూఱు జన్మంబు లయిననేమి? అందు నిందు భగవదనుభవం బొకండె కదా నాకుఁ గార్యంబని నిశ్చయించుకొని తపంబుఁ గావించుచు నంతరాంతరంబులఁ గోవెల కరుదెంచి స్వామిని దర్శించుచుఁ గాలంబుఁ గడపి ప్రియాతిథివోలె మృత్యువాసన్నంబయిన హేయంబయిన కాయంబు వదలి నెచ్చెలిఁగూడి సంతోషంబునఁ జను చెలికానిం బోలెఁ బుణ్య లోకంబులకుం జనియె.

లోకులారా! భక్తికి వశపడినట్లు భగవంతుఁడు మఱి దేనికిని వశపడఁ డు. ధనబల, బలబల, మనోబలముల శ్రీపతిని సర్వశక్తుని, సర్వజ్ఞుని, నెట్టివారును మెప్పింపఁ జాలరు. దైన్యము చేతను, ప్రేమచేతను మెప్పింప వచ్చును. వేదాంతము భక్తిని ఘోషించినట్లు మఱిదేనిని ఘోషింపదు. బ్రహ్మసూత్రములు వ్రాసిన వేదవ్యాస మహర్షియు భక్తిమార్గనిష్ఠుఁడే. మహాయోగి యగు శుకుఁడు భక్తిమార్గనిష్ఠుఁడే. కావున వెఱ్ఱి వేదాంతములు నెత్తిపై వేసికొని శిశ్నోదరపరాయణులై మోసపుఁ బలుకులు పలుకు భ్రష్టుల మాటలకు బేలుపోకుఁడు. తాము తరింపలేని వారు మిమ్మేమి తరింపఁ జేయుదురు. తమకు సిద్ధింపని యద్వైతము మీకేమి బోధించెదరు? ఆదిశంకరులును మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవగరీయసి యని భజగోవిందమని బోధించెఁగదా. లక్ష్మీనృసింహ మమదేహికరావలంబ మ్మని

ప్రార్థించెఁ గదా. దేహము విడిచిన తరువాత నద్వైతమని దేహముండు వఱకు ద్వైతమనియే కదా వారు చెప్పిరి.

భక్తులారా! తల్లి చంటిముక్కును శిశువు తన పెదవులతో నొక్కినఁ గాని పాలునోటికి రావు. అట్టులే మీరించుక యేని యొంటిమిట్ట శ్రీసీతారాముల యెడ భక్తిచేసి చూడుఁడు. ఆయన సాక్షాద్భగవంతుఁడు. అన్యథా బుద్ధిమాని సేవచేసి తరింపుఁడు. కీర్తించి సుఖింపుఁడు. భజించి బాగుపడుఁడు. ఇదియే నిరపాయమైన సుఖమార్గము.

**కం. లోకయశస్స్నుతుల సు**
**శ్లోకుల నీ భక్తవరుల శుద్ధచరిత్రం**
**బీకైవడిఁ గృతిఁ జేసితిఁ**
**జేకొనుమీ యొంటిమిట్ట సీతారమణా.**

**కం. మానుగ శ్రద్ధాభక్తులు**
**మానక దీనిం బఠించు మానవులకు సీ**
**తానాయక కృపనిమ్మా**
**మానిత త్వత్పాదభక్తి మహితసుఖంబుల్.**

ఇది శ్రీరామచంద్ర చరణారవింద మిళిందాయమాన మానసత్వ మహావైభవ వావిలికొలను రామచంద్రరాయ తనూభవ సుజన విధేయ సుబ్బరాయ నామధేయ ప్రణీతంబైన యొంటిమిట్ట శ్రీకోదండరామ మాహాత్మ్యంబను రామదాసుల చరిత్రము సర్వము సంపూర్ణము.

*శ్రీరామార్పణమస్తు.*